



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






సోమవారం | 17-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 303 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 2.36 తదుపరి దశమి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 5.15 తదుపరి మూల; వర్జ్యం: ఉ. 10.34-12.12; దుర్ముహూర్తం: మ. 12.53-1.39, మ. 3.11-3.56; అమృతఘడియలు: రా. 8.19-9.56; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


## 2 వేల కోట్లు కాదు... 2.63 లక్షలే



### చంద్రబాబు మాజీ పీఎస్ ఇంట్లో దొరికింది ఇంతే

### దాడులపై ఐటీ పంచనామా నివేదిక వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు మాజీ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ నివాసంలో జరిగిన ఐటీ దాడుల్లో దొరికింది కేవలం రూ.2.63లక్షలే. వైసీపీ ఆరోపించినట్లుగా రూ.2వేల కోట్లు కాదు. ఈ విషయాన్ని ఐటీశాఖ తన పంచనామా నివేదికలో స్పష్టంగా పేర్కొంది. సాధారణంగా ఐటీ దాడులు చేసినప్పుడు అక్కడ లభించిన నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, వజ్రాలు, ఖరీదైన మద్యం సీసాలు తదితర అన్ని వివరాలతో పంచనామా నివేదిక తయారుచేస్తారు. ఈ నివేదికపై ఐటీ అధికారులతో పాటు వాళ్లు దాడిచేసిన వ్యక్తి కూడా సంతకం చేస్తారు. అప్పటికప్పుడు చేతిరాతతోనే సదరు దాడుల్లో దొరికిన వస్తువుల జాబితా రాస్తారు. శ్రీనివాస్‌పై దాడుల సందర్భంలోను ఇలాంటి పంచనామాను ఐటీశాఖ రూపొందించింది. అందులో రూ.2.63లక్షల నగదు, 12తులాల బంగారం మాత్రమే సోదాల్లో లభించినట్లు పేర్కొంది. ఈ నివేదికపై ఐటీ అధికారులతో పాటు శ్రీనివాస్ సంతకం కూడా ఉంది. కాగా, శ్రీనివాస్ నివాసంలో దొరికిన రూ.2.63లక్షలు కూడా అక్కడికక్కడే తిరిగిచ్చేసినట్టు పంచనామా నివేదికలో పేర్కొన్నారు. ఎవరైనా రూ.3లక్షల నగదు వరకు ఇంట్లో ఉంచుకోవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. ఆ మేరకు నగదు ఉండటం చట్టబద్ధమే కావడంతో శ్రీనివాస్ నివాసంలో దొరికిన నగదును ఐటీ శాఖ స్వాధీనం చేసుకోలేదు. కుమార్తె వివాహం కోసం బంగారం కొనుగోలు చేసినట్లు శ్రీనివాస్ చెప్పడంతో 12తులాల బంగారాన్ని కూడా తిరిగి ఇచ్చేశారు.

### వైసీపీ డ్రామాలు పటాపంచలు

**ఐటీ శాఖ పంచనామానే నిదర్శనం** 10

**జగన్ క్షమాపణ చెప్పాలి.. ట్విట్టర్‌లో టీడీపీ నేతల ఫైర్**

## పరువు గంగపాలు!

### జర్మనీ కంపెనీలకు బకాయిలతో ప్రతిష్ఠకు మచ్చ

**పనులు చేయించుకొని డబ్బులివ్వలేదని కేంద్రానికి సదరు కంపెనీల ఫిర్యాదులు**

**వెంటనే చర్యలు తీసుకోవాలని వేడుకోలు**

**డీపీఐఐటీతో జర్మనీ రాయబారి సమావేశం**

**రాష్ట్ర విధానాలపై కేంద్రం తీవ్ర అసంతృప్తి**

**వెంటనే బకాయిలు చెల్లించాలంటూ లేఖలు**

**నిధుల కొరతే కారణమంటున్న రాష్ట్ర ప్రభుత్వం**




అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం పరువు గంగ పాలవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో రోడ్డున పడుతోంది. తాము అందించిన సేవలకు డబ్బులు చెల్లించకుండా ఏపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందంటూ విదేశీ కంపెనీలు గగ్గోలుపెడుతున్నాయి. తమ బకాయిలు రాబట్టాలంటూ జర్మనీకి చెందిన రెండు ప్రతిష్ఠాత్మక కంపెనీలు ఆ దేశ రాయబార కార్యాలయాన్ని ఆశ్రయించాయి. ఢిల్లీలో పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్(డీపీఐఐటీ) కార్యాలయానికి వెళ్లిన జర్మనీ రాయబారి ఏపీ ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మకమైన, అత్యంత సాంకేతిక నైపుణ్యంతో కూడిన పనులు సకాలంలో పూర్తి చేసినందుకు దక్కే గౌరవం ఇదేనా అని కేంద్రాన్ని నిలదీశారు. దీంతో ఏపీ ప్రభుత్వం తీరుపై కేంద్రం మండిపడింది. అంతర్జాతీయ కంపెనీల సేవలు వినియోగించుకుంటున్నప్పుడు దేశ పరువు, ప్రతిష్ఠలకు

మిగతా 10వ పేజీలో...

## సౌర విద్యుత్‌కు సై!

**నాడు వద్దని.. నేడు ముద్దంటున్న వైసీపీ సర్కారు**

**కొత్తగా పది వేల మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళిక**

**50వేల ఎకరాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ**

**గ్రిడ్ కుప్పకూలుతుందని నిపుణుల ఆందోళన**

**వ్యతిరేకిస్తున్న విద్యుత్ ఇంజనీర్ల సంఘాలు** 2

**ఆచరణ సాధ్యంకాదని యాజమాన్యానికి లేఖలు**



వారాణసీలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ

## సీఏఏ, 370పై వెనక్కి తగ్గం

### దేశం కోసమే ఈ నిర్ణయాలు

**రామాలయ ట్రస్టుకు 67 ఎకరాలు బదిలీ చేస్తాం**

**వారాణసీలో 2500 కోట్లతో అభివృద్ధి పనులు: మోదీ**

**63 అడుగుల దీన్‌దయాళ్ విగ్రహం ఆవిష్కరణ**

వారాణసీ, ఫిబ్రవరి 16: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 నిర్వీర్యంపై తీసుకున్న నిర్ణయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఎవరెన్ని రకాలుగా ఒత్తిడి చేసినా.. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఇక అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి ట్రస్టును ఏర్పాటు చేశామని, ఆలయం నిర్మాణం దిశగా ఈ ట్రస్టు

మిగతా 9వ పేజీలో...

## 2 వేల కోట్లు బాకీ రైతన్నకు

### ధాన్యం అమ్మిన డబ్బు కోసం రైతుల ఎదురుచూపులు

### రెండో పంటకు పెట్టుబడులు లేక అగచాట్లు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'అన్నదాతలకు అండగా ఉంటాం. ధాన్యం అంతా కొంటాం. ప్రతి గింజ సేకరిస్తాం. డబ్బులు వెంటనే జమ చేస్తాం'.. ధాన్యం కొనుగోళ్లకు ముందు అమాత్యులు చేసిన ప్రకటన ఇది. ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వ సేకరణ కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతులు.. డబ్బు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఒకటీ రెండూ కాదు.. అక్షరాలా రెండు వేల నలభై కోట్ల పన్నెండు లక్షల (రూ.2,040.12 కోట్లు) రూపాయలను ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ ధాన్యంలో పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన ధాన్యానికి ఇంకా 30% సొమ్ము రైతులకు చెల్లించాల్సి ఉంది. ధాన్యం ఇచ్చి రోజులు, నెలలు గడుస్తున్నా.. సొమ్ము కోసం ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు

మిగతా 10వ పేజీలో...





## బీజేపీకి స్నేహహస్తం?

**రాజ్యసభలో మా మద్దతు మీకే.. కావాలంటే 1, 2 సీట్లు ఇచ్చేస్తాం**

**కేంద్రానికి సీఎం జగన్ ప్రతిపాదనలు.. కేసుల నుంచి వెసులుబాటుకు ఎత్తు?**

**హైకోర్టు తరలింపు, మండలి రద్దు నిర్ణయాలపై ఆమోదముద్రకు పాట్లు**

**అలవికాని కోర్కెలు అంగీకరించే అవకాశాల్లేవు: బీజేపీ వర్గాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, వైసీపీ మధ్య ఏం జరుగుతోంది? పొత్తు అవకాశాలపై మంత్రి బొత్స చేసిన పరోక్ష వ్యాఖ్యలు దేనికి సంకేతం? ఢిల్లీ ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో సీఎం జగన్‌తో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా జరిపిన చర్చలు ఏం సూచిస్తున్నాయి? ..ప్రస్తుతం రాజకీయ పరిశీలకులను వేధిస్తున్న ప్రశ్నలివి. ఏప్రిల్‌లో జరిగే రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో వైసీపీ సంఖ్యాబలం పెరగనుండటాన్ని అవకాశంగా తీసుకొని

మిగతా 10వ పేజీలో...





ప్రమాణం చేస్తున్న కేజ్రీవాల్. (ఇన్‌సెట్) మినీ మఫ్లర్ మ్యాన్ తోమర్

## మోదీ ఆశీస్సులు కావాలి

### కేంద్రంతో కలిసి సాగుతాం: కేజ్రీవాల్

### ఢిల్లీ సీఎంగా ప్రమాణం.. ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: వేదికపై సామాన్యుల మధ్య.. ఎప్పటిలానే రామ్‌లీలా మైదానంలో.. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మంత్రులుగా మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్, కైలాశ్ గహ్లోత్, గోపాల్ రాయ్, రాజేంద్ర పాల్ గౌతమ్, ఇమ్రాన్ హుస్సేన్‌ల చేత లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ ప్రమాణం చేయించారు. ముందుగా ప్రకటించినట్లుగానే మంత్రులందరికీ పాత శాఖలనే కేటాయించారు. 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీకి ఈ నెల 11న వెలువడిన ఫలితాల్లో ఆప్ 62 సీట్లను గెల్చుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి రామ్‌నాథ్

మిగతా 9వ పేజీలో...

### తిరుమలకు లైట్‌మెట్రో!

తెరపైకి నూతన ప్రతిపాదన 10











తుళ్లూరు దీక్షా శిబిరంలో మహిళలు, రైతుల నినాదాలు

## అమరావతితోనే మా భవిత

**61వ రోజూ అదే హోరు.. కొనసాగిన నిరసన దీక్షలు, ధర్నాలు**

**ఓయూ విద్యార్థుల సంఘీభావం.. అజ్మీర్ వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు**

**శబరిమలైకి రాజధాని యువకులు.. కూకట్‌పల్లిలోనూ మద్దతు**

**సంఘీభావంగా రేపు జాతీయ రైతు నాయకుల రాక** 11






పరంజ్యోతి

# నియంతృత్వంతో జాతి నాశనమే



*రాజ్యం పాలయితుం శక్యం నతీక్ష్ణేన నిశాచర!*
*నచాపి ప్రతికూలేన నా వినీతేన రాక్షస!*

శ్రీమద్రామాయణంలోని అరణ్యకాండలో రావణ-మారీచుల సంభాషణలో వచ్చే శ్లోకమిది. సీతాపహరణం చెయ్యాలన్న దుష్ట సంకల్పంతో రావణుడు మారీచుని సాయాన్ని కోరుకుంటాడు. అప్పుడు మారీచుడు ఆ చర్యలోని అసంగతత్వాన్ని ఎత్తిచూపుతూనే శ్రీరాముని పరాక్రమాన్ని గురించి కూడా స్పష్టం చేస్తూ "రామో విగ్రహవాన్ ధర్మః" అని రాముని ధర్మనిష్ఠను శ్లాఘించడమేగాక.. పాలకునికి ఉండవలసిన ఉత్తమ లక్షణాలను గురించి, అతని ప్రవర్తనను గురించి విపులంగా, నిస్సంశయంగా, నిర్భయంగా రావణుడికి చెబుతాడు. 'ఓ రాక్షసరాజా! పాలకుడైనవాడు క్రూరమైన దండనలతో ఒక నియంతగా రాజ్యపాలన చెయ్యడం అసాధ్యం. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా ఉండేవాడు, ఇంద్రియనిగ్రహం లేనివాడు రాజ్యాన్ని పాలింపజాలడు' అని స్పష్టంగా చెప్పాడు. అటువంటి పాలకుల వల్ల ప్రజలు తోడేలు వల్ల మేకలు అపాయాలపాలైనట్లుగా నష్టపోతారు. ధర్మవిరుద్ధంగా పాలించే ప్రభువు పాలనలోని ప్రజలు రక్షణ కరువై అనేక కష్టనష్టాలకు గురి అవుతారు. దుర్బుద్ధిగలవాడైన, ఇంద్రియ నిగ్రహం, సత్యనిష్ఠ లేని రాజుల పాలనలో ప్రజలు నశించడం తప్పదు. పాలకులు పెడదారి పట్టినప్పుడు, లోకవిరుద్ధంగా, శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తిస్తున్న సందర్భాల్లో, నియంతృత్వ ధోరణితో పాలన కొనసాగిస్తున్నప్పుడు.. అతని మంత్రులు, న్యాయకోవిదులు అతని శ్రేయోభిలాషులు, ప్రజల పట్ల సానుభూతి కలిగిన మాన్యులు ఏ విధంగానైనా ఆ ప్రభువుకు చెప్పి ఆ దారి నుండి తప్పించాలి. దానివల్ల వారు అతణ్ని, అతనితో పాటు అతని ఏలుబడిలోని ప్రజలను రక్షించిన వారవుతారు. మారీచుడు చేసింది ఆ ప్రయత్నమే. రాక్షస జాతివాడైనా మారీచుడు రాముని పరాక్రమంపై అచంచల విశ్వాసం ఉన్నవాడేగాక తమ రాజైన రావణుని అకృత్యములు తెలిసిన వాడు కూడా. అందుకే.. రాక్షస జాతిని కాపాడుకోవాలన్న తీవ్ర కాంక్షతో రావణునికి పలు విధాలుగా హితబోధ చేశాడు. రాబోయే ఫలితాన్ని కూడా దర్శింపజేశాడు.

*రాజమూలోహి ధర్మశ్చ జయశ్చ జయతాం వర!*
*తస్మాత్ సర్వాస్వవస్థాసు రక్షితవ్యా నరాధిపాః*

"ఓ రావణా! ప్రజల ధర్మాచరణం కానీ, వారి శ్రేయస్సు కానీ, పాలకుని ప్రవర్తనను అనుసరించి ఉంటుంది. కాబట్టి ఎట్టి పరిస్థితులలోనైనా ప్రభువులు ధర్మమార్గం తప్పరాదు" అని హితబోధ చేశాడు. అయినా ఆ మాటలు రావణుని చెవికెక్కకపోవడంతో అతడి జాతి మొత్తం నిర్మూలనమైపోయింది. నియంతృత్వ ధోరణి ఎంత ప్రమాదానికి కారణమవుతుందో రామకథ మనకు దృశ్యమానం చేసింది.

**- గన్నమరాజు గిరిజామనోహర బాబు**

# లోకం తీరు




తన ఆఫీసు ప్యారడైజ్ జంక్షన్ వద్ద ఉంటుంది.. రోజూ ఈ శబ్దాలు వింటే కానీ నిద్రపోరు వదినా..

## 37మంది డీఎస్పీలకు పోస్టింగ్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీల సుదీర్ఘ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ప్రభుత్వం మారినప్పటి నుంచి పోస్టింగుల కోసం ఎదురు చూస్తోన్న పలువురు డీఎస్పీల్లో మెజారిటీ అధికారులకు మోక్షం లభించింది. వెయిటింగ్‌లో ఉన్న 37మందికి సీఐడీ, ఏసీబీ, ఎస్బీ, పీటీసీ, దిశ పీఎస్, ట్రాఫిక్ తదితర లూప్‌లైన్లలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి తర్వాత డీజీపీ గౌతమ్ సవాంగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో మూడు నెలలు దాటిన వారికి జీతాలు చెల్లించబోమంటూ ఆర్థిక శాఖ స్పష్టం చేసిన నేపథ్యంలో డీజీపీ ఈ చర్యలు చేపట్టారు. అయినా, ఇంకొంతమంది నిరీక్షణలో ఉన్నారు. తాజాగా కొందరిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు 'కేబినెట్'

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా పులివెందులకు చెందిన శ్రీనాథ్‌ను గత ఏడాది నవంబరు 8న జగన్ ప్రభుత్వం ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

## సీపీఎస్ రద్దుకు ఉద్యోగుల డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దుకు సత్వర చర్యలు చేపట్టాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే మూడు విడతల డీఏలపై వచ్చే కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపాలని కోరింది. సమాఖ్య విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో అనేక అంశాలపై చర్చించినట్లు చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి తెలిపారు. 11వ పీఆర్‌సీపై నివేదిక ఇప్పటికే అనేక వాయిదాలు పడిందని, ఇప్పటికైనా నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని కోరుతూ తీర్మానం చేశామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని మరో రెండు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అలాగే 27 శాతం ఐఆర్, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి తదితర నిర్ణయాలు తీసుకున్న సీఎం జగన్‌ను సన్మానించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

# సౌర విద్యుత్‌కు సై!

- నాడు వద్దని.. నేడు ముద్దంటున్న వైసీపీ సర్కారు
- కొత్తగా పది వేల మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళిక
- 50వేల ఎకరాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ
- వ్యతిరేకిస్తున్న విద్యుత్ ఇంజనీర్ల సంఘాలు



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సౌర, పవన విద్యుత్‌కు వ్యతిరేకంగా ఎగిరెగిరి పడిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆకస్మికంగా మాట మార్చేసింది. నాడు సౌరవిద్యుత్తే వద్దన్న వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు అదే ముద్దంటోంది. కొత్తగా ఏకంగా పది వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికి అవసరమైన సోలార్ పార్కుల కోసం 50వేల ఎకరాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ ప్రారంభించింది. అయితే ఒకేసారి ఇంత స్థాయి ఉత్పాదన ప్రతిపాదనపై విద్యుత్ నిపుణులు విస్తుపోతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ చర్యను తప్పుబట్టింది. కేంద్రం కొద్దిగా చేయమంటే చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని మరీ ఎక్కువ చేసిందని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థికభారం పడుతోందని వాదించింది. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సవరించాలంటూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం విమర్శలపాలైంది. ఇక ఇప్పట్లో పునరుత్పాదక విద్యుత్ జోలికి వెళ్లే ఆలోచన లేదని, ఈ ప్రభుత్వం దానికి వ్యతిరేకంగా ఉందని ఆంతరంగిక సంభాషణల్లో ఉన్నతాధికారులు చెబుతుండేవారు. కానీ ఆకస్మికంగా వైసీపీ ప్రభుత్వం తన విధానాన్ని మార్చేసుకొంది. కాగా, 10వేల మెగావాట్ల సౌరవిద్యుత్ అంటే సౌర ఫలకాల ఏర్పాటుకు భారీగా భూమి కావాలి. దీని కోసం రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 50వేల ఎకరాల భూసేకరణకు నిర్ణయించింది. కొత్త లైన్లకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ట్రాన్స్‌కోకు సూచించింది. కొత్త టెక్నాలజీ వల్ల సౌర విద్యుత్ రేట్లు బాగా తగ్గాయని, అందుకే దీని ఉత్పత్తి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

### పది వేల మెగావాట్లపైనే అభ్యంతరం

ఒకేసారి ఏకంగా పది వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం తీవ్ర విమర్శలకు గురవుతోంది. దీనికి సమాంతరంగా మళ్లీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాల్సి వస్తుందని, లేనిపక్షంలో గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం ఉందని విద్యుత్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ సంస్థల నియమం ప్రకారం మొత్తం సరఫరా చేసే విద్యుత్‌లో 60శాతం థర్మల్, 40శాతం పునరుత్పాదక విద్యుత్ ఉండేలా చూస్తారు. ఉదాహరణకు సౌరవిద్యుత్ ఉత్పత్తి పగలు జరుగుతుంది. సాయంత్రం విద్యుత్ వాడకంఎక్కువ ఉంటుంది. కాబట్టి వెంటనే థర్మల్ విద్యుత్ సరఫరా అందుకోవాలి. దానిని దృష్టిలో ఉంచుకొనే 40శాతం సౌరవిద్యుత్ సరఫరా చేయాలంటే 60శాతం థర్మల్ విద్యుత్ కూడా దానికి తోడుగా ఉండాలి. ఇప్పటికే రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ కలిపి సుమారు 8వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు కేంద్రాలున్నాయి. దానికి అదనంగా 10వేల మెగావాట్లు కలపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదంతా వినియోగించుకోవాలంటే మళ్లీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలి. ఇంత విద్యుత్ వాడకం రాష్ట్రంలో లేనేలేదని, డిమాండ్ లేకుండా ఉత్పత్తిని పెంచుకోవడం అర్థం లేని వ్యవహారమని నిపుణులు అంటున్నారు.

**భారీ ఖర్చు తప్పదు!**

'ఇప్పుడు తక్కువకు సౌర విద్యుత్ లభిస్తోందని దీనిని ప్రోత్సహించాలని ప్రభుత్వం అనుకొంటోంది. అది వస్తే థర్మల్ విద్యుత్‌ను తగ్గించేసుకోవచ్చని భావిస్తున్నాం. గ్రిడ్ సమస్యలు చూడాల్సి ఉంది. విద్యుత్ డిమాండ్ మధ్యలో తగ్గిన మాట వాస్తవం. కానీ జనవరి నుంచి మళ్లీ పెరుగుతోంది' అని ఓ ఉన్నతాధికారి వివరించారు. విద్యుత్ తక్కువకు వస్తోందన్న ప్రభుత్వ వాదన పాక్షికంగా మాత్రమే నిజమని నిపుణులంటున్నారు. సౌరవిద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వమే భూమి ఇవ్వాల్సి ఉంటుందని, తానే సొంతంగా లైన్లు వేసుకొని సబ్‌స్టేషన్లు పెట్టుకొని ఆ విద్యుత్ తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

### ఇంజనీర్ల సంఘాల లేఖాస్త్రాలు

ఈ అంశాన్ని లేవనెత్తుతూ ఇంజనీర్ల సంఘాలు తమ యాజమాన్యానికి లేఖాస్త్రాలు సంధించాయి. 'సీజన్‌ను బట్టి ఏపీలో విద్యుత్ వాడకం 6-11వేల మెగావాట్ల వరకూ ఉంది. ఇప్పటికే కుదుర్చుకొన్న ఒప్పందాల వల్ల 20వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది. ఈ సమయంలో ఇంత పెద్దఎత్తున పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని చేపట్టాలనుకోవడం అభిలషణీయం కాదు. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది' అని ఏపీఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం కొద్దిరోజుల క్రితం రాసిన ఒక లేఖలో పేర్కొంది.

## కొనసాగిన ఎండ తీవ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవికాలం ప్రారంభమైంది. పగటిపూట ఎండ, రాత్రిపూట చలి తీవ్రత కొనసాగింది. ఆదివారం కర్నూలులో 37, అనంతపురంలో 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అనంతపురంలో 16.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తాలో పలుచోట్ల మంచు కురిసింది. ఉదయం పది గంటల వరకు మంచు పడడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. ఆకాశం నిర్మలంగా ఉండడంతో మంచు కురవడాన్ని 'రేడియేషన్ కూలింగ్' అంటారని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పొడివాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు.



## ఎన్నికల ప్రచారంలో భాషను అదుపులో పెట్టుకోవాలి

బిహార్‌లో ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక అభివృద్ధి సమస్యలపైనే పోరాడాలి. ప్రచారంలో రాజకీయ నాయకులు భాషను అదుపులో పెట్టుకోవాలి. రాష్ట్రంలో ఎన్డీయే బలం చెక్కు చెదరలేదు. ప్రతిపక్షాలు మునుగుతున్న నావ. మేం ఎన్డీయేలోనే కొనసాగుతాం.

**- రామ్‌విలాస్ పాసవాన్, ఎల్‌జేపీ అధ్యక్షుడు**



## విద్యావంతులు, ధనికుల్లోనే విడాకులు ఎక్కువ

విద్యావంతులు, ధనవంతుల కుటుంబాల్లోనే విడాకుల కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. విద్య, ధనంతో అహంకారం కూడా పెరుగుతోంది. దీంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. సమాజం కూడా ఓ కుటుంబమే. కాబట్టి సమాజం కూడా పతనమవుతోంది. దేశంలో హిందూ సమాజానికి ప్రత్యామ్నాయం లేదు.

**- మోహన్ భాగవత్, ఆర్ఎస్ఎస్ చీఫ్**



## రోజూ 10వేల అడుగులు నడిచినా బరువు తగ్గదు

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: రోజూ 10వేల అడుగులు నడిస్తే శరీర బరువు పెరుగుదలకు అడ్డుకట్ట పడుతుందనే భావన సరికాదని అమెరికాలోని బ్రిగ్‌హామ్ యంగ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. 120 మంది యువకులపై జరిపిన అధ్యయనంలో ఈవిషయం వెల్లడైందని తెలిపారు. ఇందులో భాగంగా ఆ యువకులంతా పెడోమీటర్లు తప్పనిసరిగా ధరించాలనే నిబంధన విధించారు. వాటి ద్వారా వారు రోజూ ఎన్ని అడుగులు నడుస్తున్నారనే వివరాలను సేకరించారు. 24 వారాల తర్వాత వారివారి నడకలకు సంబంధించిన గణాంకాలను.. శరీర బరువుల్లో వచ్చిన తేడాలను పోల్చి చూశారు. అత్యధికంగా రోజూ 15వేల అడుగులు నడిచిన వారి బరువు కూడా సగటున 1.5 కేజీలు పెరిగినట్లు గుర్తించారు. దీన్నిబట్టి శరీర బరువు నియంత్రణకు నడక ఒక్కటే సరిపోదని.. ఆహారపు అలవాట్లు, జీవనశైలి వంటి పలు ఇతరత్రా అంశాలు కూడా కీలకమైనవేననే నిర్ధారణకు వచ్చారు.

## శిశువుల శారీరక కదలికలను నమోదుచేసే 'స్మార్ట్ జంప్‌సూట్'

లండన్: మస్తిష్క పక్షవాతం వంటి నరాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యల ముప్పును ఎదుర్కొంటున్న శిశువుల శారీరక కదలికలను ఎప్పటికప్పుడు నమోదు చేసే 'స్మార్ట్ జంప్‌సూట్‌ను ఫిన్‌లాండ్ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. దీనికి చేతుల భాగంలో రెండు, కాళ్ల భాగంలో రెండు సెన్సర్లు ఉంటాయి. ఇవి బ్యాటరీతో పనిచేస్తాయి. సదరు శిశువు ఏ కాలిని/చేతిని ఎంత సేపు కదుపుతున్నాడు.. ఏ వైపు ఎక్కువ సేపు బొర్లుతున్నాడు.. ఎంతసేపు పాకుతున్నాడు.. అనే వివరాలను ఈ సెన్సర్లు నమోదుచేస్తాయి. ఆ గణాంకాలను శిశువు తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్‌లోని 'స్మార్ట్ జంప్‌సూట్' యాప్‌కు పంపిస్తాయి. ఈ సమాచారాన్ని నరాల వైద్య నిపుణులకు చూపించి ఎప్పటికప్పుడు శిశువుకు తగిన చికిత్స చేయించుకునే అవకాశం కలుగుతుంది.

# 'సహకారం' దివాళా!

- ఆర్‌బీకేల్లోనే ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాలు
- నాలుగేళ్లుగా ఈ కమీషన్‌తోనే సహకార వ్యవస్థ పటిష్ఠం
- ప్రభుత్వ తాజా నిర్ణయంతో లక్షల్లో ఆదాయానికి ఎసరు
- రాష్ట్ర వ్యాప్తంగా 2,060 సంఘాల ఉనికి ప్రమాదంలో...

భీమవరం, ఫిబ్రవరి 16: రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో సహకార వ్యవస్థ నిర్వీర్యం కానుందా? వీటివల్ల సంఘాలు మరోసారి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉందా?.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఆర్‌బీకేల ఏర్పాటు, విధుల కేటాయింపుపై రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంఘాలను ఆర్థికంగా దెబ్బతీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి కమీషన్‌కు విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్ముతున్నాయి. ఈ ఆదాయంతో పురోగతి సాధిస్తూ రైతులకు సేవలందిస్తున్నాయి. ఉద్యోగులకు జీతాలివ్వలేక కటకటలాడిన పరిస్థితులను అధిగమించి సహకార చట్టాన్ని, లక్ష్యాలను చిత్తశుద్ధితో అమలు చేసే స్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు ఇకపై ఈ కేంద్రాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించనున్నారు. ధాన్యం కొనుగోళ్లు కూడా దీనికే బదలాయించారు. ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, భూసార పరీక్ష కేంద్రాలు అనుసంధానంగా పనిచేస్తాయి. వీటిలో సుమారు 15రకాల సేవలు అందిస్తారు. కీలకమైన సహకార సంఘాల వ్యాపారాన్ని ఈ కేంద్రాలకు బదలాయిస్తూ అజమాయిషీని వ్యవసాయశాఖకు అప్పగించనున్నారు. దీంతో ప్రతి పంటకు వస్తున్న లక్షలాది రూపాయిల ఆదాయాన్ని సహకార సంఘాలు కోల్పోనున్నాయి. సంఘాల పనులను బదలాయించడంతో వీటి ఆర్థిక భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుందని సహకార సంఘ నిపుణులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 2,060 సహకార సంఘాలున్నాయి. 13జిల్లాల్లో 45లక్షలు మంది రైతులు వీటి ద్వారా రుణాలు పొందుతున్నారు. వీరికి ఇచ్చే రుణాలపై 7శాతం వడ్డీని సొసైటీలు వసూలు చేస్తాయి. ఒకప్పుడు దీనిలో 3శాతం సంఘాలకు ఇచ్చేవారు. 2012 తరువాత దీన్ని 1.5శాతానికి తగ్గించడంతో సంఘాలకు వచ్చే ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. ప్రత్యామ్నాయ ఆదాయం లేక కుదేలయ్యాయి. 70శాతం సంఘాలు ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితికి చేరుకున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2015నుంచి ధాన్యం కొనుగోలు చేసి విక్రయించుకునే వ్యాపారాన్ని సంఘాలకు బదలాయించారు. అలాగే ఎరువులు, పురుగు మందులు అమ్ముకునే అవకాశం కల్పించారు. దీంతో నాలుగేళ్ల నుంచి క్రమంగా ఈ సంఘాలు పుంజుకున్నాయి. కొన్నిచోట్ల డీసీసీబీ నుంచి వచ్చే వేతనాలు, రాయితీల కోసం ఎదురు చూడకుండా స్వయం ప్రతిపత్తితో నిలదొక్కుకుని రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ మౌలిక వసతుల కల్పన, గోదాముల నిర్మాణం చేపట్టి బలమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ తాజా నిర్ణయంతో మళ్లీ సొసైటీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సొసైటీలకు న్యాయం చేయాలి

ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాలు ద్వారా వచ్చే కమీషన్ తదితరాలు సొసైటీలకు ఆర్థికంగా ఉపకరిస్తాయి. ఈ వ్యాపారాలను సంఘాల నుంచి బదలాయిస్తే పరిస్థితులు తారుమారవుతాయి. రైతులకు సేవలు అందించడంలో అవరోధాలు తలెత్తుతాయి. కొన్నిచోట్ల ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితులు కూడా ఉండవు. ప్రభుత్వం నిశితంగా పరిశీలించి సొసైటీలకు న్యాయం జరిగేలా చూడాలి.

**- వీఎస్ నందమూరి, సహకార ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి**

# వారంలోగా వర్సిటీలకు ఈసీలు

- ఆశావహుల పేర్లపై నేరుగా సీఎం పరిశీలన
- సిఫారసు చిట్టాలో పలు మార్పులు, చేర్పులు
- పూర్తిస్థాయి పాలక మండళ్లు ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల(ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది. మరో వారంలో అన్ని వర్సిటీలకూ పూర్తిస్థాయి పాలక మండళ్లను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన ఈసీ మెంబర్లను జగన్ ప్రభుత్వం కొన్నాళ్ల కిందటే తొలగించింది. వర్సిటీల పాలక మండలిలో మొత్తం 15మంది సభ్యులుంటారు. వీరిలో ఆరుగురు క్లాస్-1 ఆఫీసర్లు కాగా, మిగిలిన 9 మంది క్లాస్-2 మెంబర్లు. వీరిలో వర్సిటీ కాలేజీలు, అఫిలియేటెడ్ కాలేజీల నుంచి, వివిధ రంగాలకు చెందిన విశిష్ఠ వ్యక్తులను ఎంపిక చేస్తారు. ఈసీలో ప్రస్తుతం ఆరుగురు ఎక్స్ అఫిషియో(క్లాస్-1 ఆఫీసర్లు) మెంబర్లున్నారు. వీసీ, రెక్టార్, ఉన్నత విద్యాశాఖ స్పెషల్ సీఎస్, ఆర్థికశాఖ కార్యదర్శి, కళాశాల విద్య కమిషనర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌లు ఎక్స్ అఫిషియో మెంబర్లుగా ఉంటారు. వీరందరూ శాశ్వత ప్రాతిపదికన సభ్యులుగా ఉంటారు. పాలకమండలిలోని క్లాస్-2లో మొత్తం 9 మంది ఉండాలి. దీనికి సంబంధించి ఐదుగురి పేర్లతో కూడిన జాబితా (అధికార రీత్యా)ను ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. యూనివర్సిటీ కాలేజీ నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక సీనియర్ ప్రొఫెసర్, ఒక టీచర్, అఫిలియేటెడ్ కాలేజీ నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ లెక్చరర్ ఉన్నారు. మరో నలుగురిని విశిష్ఠ వ్యక్తుల కోటా నుంచి ఎంపిక చేయాల్సి ఉంది. ఈ కోటాలో ఎంపికకు సంబంధించి పలువురు ఔత్సాహికుల పేర్లు ప్రభుత్వానికి అందాయి. సదరు కేటగిరీపై కసరత్తు జరుగుతోంది. తాజాగా ఈ కేటగిరీ వ్యక్తులపై ఇంటెలిజన్స్ విచారణ కూడా పూర్తయినట్లు సమాచారం. ఒక్కో కేటగిరీ నుంచి ఇద్దరి పేర్ల చొప్పున.. క్లాస్-2 కోసం ఎంపిక చేయాల్సిన 9 మందికి గాను మొత్తం 18 మందితో ఒక జాబితాను రూపొందించి సీఎం పరిశీలనకు పంపినట్లు తెలిసింది. క్లాస్-2 కేటగిరీలో ఎంపికలకు సంబంధించి స్వయంగా సీఎం జగన్ ఇప్పటికే పరిశీలన చేపట్టినట్లు సమాచారం.

### 50 శాతం రిజర్వేషన్

పాలకమండళ్ల పునర్వ్యవస్థీకరణలో 50% రిజర్వేషన్‌తో పాటు సామాజిక సమతూకం పాటించే విషయంపైనా సీఎం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. గత పాలకమండళ్లలో సభ్యులుగా నియమితులైన వారు ఈసీ సమావేశాలకు హాజరు కాలేదని, ఆయా వర్సిటీలకు ఒరగబెట్టిందేమీ లేదన్న సమాచారంతో ఆ కోణంలోనూ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రముఖ వ్యక్తులనే ఎంపిక చేయాలనే నియమం కాకుండా.. ఆయా వ్యక్తులు వర్సిటీల అభివృద్ధిలో ఎలా భాగస్వాములవుతారన్న దిశగా ఆరా తీస్తున్నారని తెలిసింది. ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులనే తీసుకోవాలని సీఎం ఉన్నట్లు సమాచారం.

విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈసీలు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. ఉద్యోగులు, అధ్యాపకుల నియామకాలు, పదోన్నతులు, వేతనాల పెంపు, అభివృద్ధి పనులు.. ఇలా అన్నింటికీ ఈసీ అనుమతి తప్పనిసరి. నెలల తరబడి ఈసీల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో వర్సిటీల పాలన దెబ్బతింటోంది. వర్సిటీల్లో అభివృద్ధి పనులను చేపట్టడంలో ఈసీ నిర్ణయమే కీలకం. రూ.10 లక్షలకు మించిన వ్యయంతో ఏ పనిచేయాలన్నా, కొనుగోళ్లు చేపట్టాలన్నా ఈసీ ఆమోదం ఉండాలి. రూ.10 లక్షల లోపు పనికైనా రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. 15 మందితో ఉండే పూర్తిస్థాయి ఈసీ లేకున్నా ఐదుగురు సభ్యులు(కోరం) ఉన్న ఈసీ ఆమోదం తప్పనిసరి. ప్రస్తుతం అది కూడా కొన్ని వర్సిటీల్లో లేకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం ఈసీలను నియమించాలని నిర్ణయించింది.

# పత్తి రైతు చిత్తు!

- దిగుబడి లేదు.. మద్దతు ధరా దక్కలేదు
- కొనుగోళ్లు లేక మూసివేత దిశగా సీసీఐ కేంద్రాలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొన్నారు. వర్షాలు అనుకూలించినా, పత్తి దిగుబడి సగానికి సగం తగ్గింది. ఆటుపోట్లు తట్టుకుని పంట సాగు చేసినా.. కనీస మద్దతు ధర దక్కక నష్టాలపాలయ్యామని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ యేడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తి అమ్మిన రైతులు అరుదు. పంట వేసినప్పుడున్న ధర ఉత్పత్తి మార్కెట్‌లోకి వచ్చేసరికి లేకుండా పోవడంతో పాటు బయట మార్కెట్‌లో ధర తగ్గుతూ వచ్చింది.

### నాణ్యత లేదని సీసీఐ కొనుగోళ్లు నిలిపివేత

రాష్ట్రంలో గత ఖరీఫ్‌లో 6.5లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేసినా, ఉత్పత్తి అంచనాలో 30%దాకా తగ్గింది. అయినా అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో పత్తి ధరలు పతనమయ్యాయి. సీసీఐ 43పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా అవి నామమాత్రంగానే కొనుగోలు చేశాయి. పత్తిలో నాణ్యత లేదని సీసీఐ పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఎక్కువ మంది ప్రైవేటు వ్యాపారు నిర్ణయించిన అతి తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.5550 ఉండగా బయట వ్యాపారులు క్వింటా రూ.3800 నుంచి రూ.4400 మించి ధర ఇవ్వలేదు. సాధారణంగా ఎకరానికి 18క్వింటాళ్ల దాకా వచ్చే పత్తి ఉత్పత్తి ఈ యేడు సగానికి సగం తగ్గింది. ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి రాగా, పెట్టుబడే సరుకు అమ్మినంత వరకు నష్టమే వచ్చిందని రైతులు చెప్తున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.70వేలు దాకా అయిందని, కౌళ్లే ఎకరానికి రూ.16-20 వేలు చెల్లించామంటున్నారు.

పత్తికి గులాబీ రంగు తాకిడి వల్ల దిగుబడి తగ్గిందని వాపోతున్నారు. ముగ్గురు కూలీలు క్వింటా పత్తిని తీస్తే, వెయ్యి దాకా ఖర్చు అవుతోందని, సరుకు అమ్మితే అంత ధర రావడం లేదని గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల రైతులు కొందరు పత్తి తీయించకుండా పొలాల్లోనే వదిలేశారు. ఓ వైపు దిగుబడి తగ్గగా, మరో వైపు ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కాగా సీసీఐ, మార్కెటింగ్ శాఖ నిబంధనలతో రైతులు మార్కెట్ యార్డులకు వెళ్లకుండా ఇళ్ల వద్దే వ్యాపారులకు తక్కువ ధరకు పత్తి అమ్ముకున్నారు. దీంతో నెల రోజులుగా సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు లేకుండాపోయాయి. దీంతో సీసీఐ కేంద్రాలను ఈనెలాఖరుకు మూసేయాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.

# ట్యూనా @70

తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ నుంచి భైరవపాలెం వైపు సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకి 70కిలోల ట్యూనా చేప చిక్కింది. అక్కడ నుంచి ఆటోలో ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి వేలం నిర్వహించారు. వేలంలో కాకినాడకు చెందిన వ్యాపారి దీన్ని రూ.10వేలకు దక్కించుకున్నాడు. ఇంతపెద్ద ట్యూనా చేప వలకు చిక్కడం అరుదని మత్స్యకారులు చెబుతున్నారు.

**- యు.కొత్తపల్లి**




హంస వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబామల్లికార్జునులు

## హంస వాహనంపై ఆది దంపతుల విహారం

శ్రీశైలం, ఫిబ్రవరి 16: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లు హంస వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకు ముందు విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్లకు మొట్టమొదటిసారిగా పట్టువస్త్రాలు సమర్పించారు. సోమవారం మయూర వాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.



జస్టిస్ సోమయాజులు, అడ్వొకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం


ఆలయం ముందు జస్టిస్ గోపాలకృష్ణ

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, ఫిబ్రవరి 16: పలువురు న్యాయమూర్తులు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, అడ్వొకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

# ముస్లింల పట్ల జగన్‌కు చిత్తశుద్ధి లేదు

- సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేయాలి : కేశినేని
- పిచ్చోడి రాజ్యంలా ఉంది : అయ్యన్నపాత్రుడు
- ముందుంది మొసళ్ల పండగ : వర్ల రామయ్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


షాహిన్‌బాగ్ శిబిరంలో మాట్లాడుతున్న నాని

ముస్లిం మైనారిటీల మనోభావాల పట్ల ముఖ్యమంత్రి జగన్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, సీఏఏలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేయాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని సవాల్ విసిరారు. అలా చేయలేని పక్షంలో బహిరంగంగా ఒప్పుకొంటే ఆ పని తానే చేస్తానని చెప్పారు. ఆయన ఆదివారం కడపలో సీఏఏ వ్యతిరేక జేఏసీ శిబిరమైన షాహిన్‌బాగ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహనా లోపంతో పార్లమెంటులో సీఏఏకు అంగీకారం తెలిపామని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆమాత్రం అవగాహన లేని ప్రజాప్రతినిదులు ఈ రాష్ట్రానికి అవసరమా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న వైసీపీ ఆ మూడింటికీ వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. అందుకు ప్రతిపక్షంగా తాము సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఇదిలావుండగా, జగన్ పాలన పిచ్చోడి రాజ్యాన్ని తలపిస్తోందని, ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటాడో ఎవరికీ అర్థం కావడం లేదని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కాగా, జగన్ అవినీతి బాగోతం అయిపోలేదని, ముందుంది మొసళ్ల పండగ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. అవినీతి కేసుల విచారణ పూర్తయితే ఏం జరుగుతుందో జగన్‌కు తెలుసు కాబట్టే ఢిల్లీ వెళ్లి మోదీ, అమిత్‌షాల కాళ్లు పట్టుకున్నారని విమర్శించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... తప్పుడు రాతలతో చంద్రబాబుకు అవినీతి మరక అంటించాలని 'సాక్షి' పత్రిక చూస్తోందంటూ ఆ పత్రిక ప్రతులను తగులబెట్టారు.

## జగన్ పులివెందుల పిల్లి: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): "కేంద్రం మెడలు వంచేస్తా అన్న వస్తాదు సోషల్ మీడియా పోస్టులకు భయపడడం ఏంటి? పులివెందుల పులి అంటూ డప్పు కొట్టించుకున్నారు. ఇప్పుడు పులి...పిల్లి అయ్యిందా? వైకాపా ప్రభుత్వం అమ్మ ఒడి పథకానికి బడుగు, బలహీనవర్గాలకు చెందాల్సిన రూ.6,500కోట్లు పక్కదారి పట్టించింది. ముఖ్యమంత్రి జగన్ బడుగు, బలహీనవర్గాలకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ ఒక యువకుడు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తంచేశాడు. బీసీలకు అన్యాయం చేస్తున్నారంటూ పోస్ట్ పెట్టినందుకు పులివెందులకు చెందిన తెలుగుదేశం కార్యకర్త విజయ్‌కుమార్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేస్తారా? ముసుగేసి మీడియా ముందు ప్రవేశపెడతారా? అంత పెద్ద తప్పు ఏం చేశాడు?" అని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం నాడు ట్వీట్ చేశారు. "జగన్ దగ్గర మార్కులు కోసం అధికారుల అత్యుత్సాహం తగదు. కోర్టులు చివాట్లు పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దు. విజయ్‌కుమార్‌రెడ్డికి నేను అండగా ఉంటా. ఫైనల్‌గా అర్థమైంది ఏంటంటే విజయ్‌కుమార్ పులివెందుల పులి, జగన్ పులివెందుల పిల్లి. విజయ్ పోస్ట్ చేసిన వీడియో నేను పోస్ట్ చేస్తున్నా. ఏం పీకుతారో పీక్కోండి" అంటూ లోకేశ్.. జగన్‌కు సవాల్ విసిరారు.

## చనిపోయిందనుకుంటే.. తిరిగొచ్చింది!

- రెండేళ్ల తర్వాత ఇంటికి చేరిన వృద్ధురాలు


కొడుకు శివారెడ్డితో అచ్చమ్మ

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 16: ఆ వృద్ధురాలు రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె చనిపోయి ఉంటుందని భావించారు. తీరా ఇప్పుడు ఆమె తిరిగి వచ్చేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లాలో జరిగింది. పెద్దదోర్నాల మండలం బొమ్మలాపురం గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి అచ్చమ్మకు 60 సంవత్సరాలు ఉంటాయి. రెండేళ్ల క్రితం ఒక రోజు ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆమె జాడ తెలియలేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో చనిపోయి ఉంటుందని భావించారు. సమీపంలో కొండప్రాంతానికి గడ్డికి వెళ్తే ఏదైనా మృగం దాడిచేసి ఉండవచ్చని అనుమానించారు. ఈ నేపథ్యంలో ఏడు నెలల క్రితం అచ్చమ్మ భర్త వీరయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు కూడా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమెపై ఆశలు వదులుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కర్నూలులో ఉన్నట్లు సమాచారం అందింది. అచ్చమ్మ కుమారుడు వీరనారాయణ రెడ్డి, అతని సోదరుడు శివారెడ్డి కర్నూలు వెళ్లి శనివారం రాత్రి అచ్చమ్మను ఇంటికి తీసుకువచ్చారు.

# ప్రశ్నిస్తే.. అరెస్టు చేస్తారా?

- విజయ్‌ను అక్రమంగా అరెస్టుచేశారు
- నిధులు మళ్లించిన మిమ్మల్ని ఏం చేయాలి?.. ముఖ్యమంత్రిపై టీడీపీ నేతల ఫైర్
- పోలీసులు ప్రైవేటు కేసు ఎదుర్కోక తప్పదని హెచ్చరిక

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి కోసం నిధులు మళ్లించి, బీసీలకు ముఖ్యమంత్రి జగన్ అన్యాయం చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టుపెట్టిన పులివెందుల టీడీపీ కార్యకర్త విజయ్‌కుమార్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తే విజయకుమార్‌ను అరెస్టు చేస్తారా? అని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. బీసీల సొమ్మును కాజేస్తున్న జగన్‌ను ఏం చేయాలని, అమ్మఒడి కోసం బీసీల నిధుల్ని పక్కదారి పట్టించడం దారుణమని, విజయకుమార్‌కు తాము అండగా ఉంటామని చెప్పారు. బీసీలకు జగన్ చేస్తున్న అన్యాయాన్ని బయటపెట్టినందుకు విజయకుమార్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా అరెస్టు చేశారని ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ముసుగు వేసింది విజయ్‌కు కాదని.. భావ ప్రకటనా స్వేచ్ఛకని, అక్రమ కేసులు పెడుతున్న పోలీసులు ప్రైవేటు కేసులు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. బీసీలకు అన్యాయం జరుగుతోందని పోస్టు పెట్టినందుకే అరెస్టు చేస్తే, నిజంగా అన్యాయం చేసిన జగన్‌ను ఏమి చేయాలని.. అరెస్టు చేసి, తీహార్ జైలుకు పంపాలా? అంటూ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ప్రభుత్వాన్ని నిలదీశారు. బీసీ, ఎస్టీలకు చెందాల్సిన రూ.6,500 కోట్ల నిధులను పక్కదారి పట్టించిన జగన్‌పై కేసు ఎందుకు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. అమ్మఒడి అంటూ బీసీ, ఎస్సీ నిధులను జగన్ కొట్టేశారని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ ఆరోపించారు. అన్యాయాన్ని ప్రశ్నించినందుకు అక్రమంగా అరెస్టు చేసి ఉగ్రవాదిలా ముసుగేస్తారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ ఇంత దిగజారిపోతారనుకోలేదని.. తప్పుడు కేసు పెట్టిన పోలీసులపై ప్రైవేటు కేసు పెడతామని ఆమె హెచ్చరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

## వృద్ధులకు ప్రత్యేక ఆసుపత్రులు: జస్టిస్ చలమేశ్వర్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 16: వయో వృద్ధులు సమాజాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, ప్రభుత్వం ప్రత్యేక ఆసుపత్రులు నిర్మించి వారి ఆరోగ్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సీనియర్ సిటిజన్ సమాఖ్య రాష్ట్రస్థాయి రెండో వార్షికోత్సవ సదస్సు ఆదివారం సీఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. పిల్లలు ఉద్యోగ రీత్యా దూర ప్రాంతాల్లో ఉంటున్నందు వల్ల తల్లిదండ్రులు ఒంటరిగా జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని.. ఒంటరితనంలో వారిని ఓదార్చేవారు లేక కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

## అసెంబ్లీ మాజీ స్పీకర్ అగరాల కన్నుమూత



తిరుపతి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ అగరాల ఈశ్వరరెడ్డి (87) ఆదివారం తిరుపతిలో మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. 1967, 1978లో ఆయన తిరుపతి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1980-81లో ప్రభుత్వ సంస్థల కమిటీ అధ్యక్షుడిగా, 1981-82లో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. 1982 సెప్టెంబరు 7 నుంచి 1983 జనవరి 16 వరకు స్పీకర్‌గా పనిచేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అగరాల మృతికి సీపీఐ నేత నారాయణ సంతాపం తెలిపారు.

## కావలిలో రూ.25లక్షల నకిలీనోట్ల పట్టివేత

కావలి(క్రైం), ఫిబ్రవరి16: నెల్లూరు జిల్లా కావలిలో కారులో తరలిస్తున్న రూ.25లక్షల నకిలీనోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసలుకు మూడురెట్లు నకిలీ నోట్లు ఇస్తానని విజయవాడకు చెందిన బాబు అనేవ్యక్తి నెల్లూరు జిల్లా కలిగిరి మండలం ఏఎస్ పేటకు చెందిన బక్కా మాలకొండారెడ్డి, టి.వెంకటేశ్వరరెడ్డి, వింజమూరు మండలం బొమ్మరాజుచెరువుకు చెందిన కొండలరావు, జగదీష్‌లతో పాటు వింజమూరుకి చెందిన గోశాల మాధవ, నల్లబోతుల రమేష్‌ల నుంచి రూ.8 లక్షలు తీసుకొని, ఈ నెల 14వ తేదీ రాత్రి తాడేపల్లిగూడెంలో రూ.25 లక్షల విలువైన నకిలీ నోట్లు అందచేశాడు. అయితే వాటిపై రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానంలో చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండటంతో మాట్లాడేందుకు బాబు వద్దకు బయలుదేరగా.. కావలిలో పోలీసుల తనిఖీల్లో పట్టుబట్టారు. జగదీష్, మాధవ, రమేష్‌లను అదుపులోకి తీసుకున్నామని కావలి డీఎస్పీ తెలిపారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలు త్వరలో చెల్లిస్తాం: ఆళ్ల నాని

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ బకాయిలను కొద్ది రోజుల్లో విడుదల చేస్తామని మంత్రి నాని అన్నారు. విశాఖలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపునకు రూ.100 కోట్లు విడుదలకు సంబంధించి జీవో జారీ చేశామని, ఇప్పటి వరకు ఉన్న బకాయిలను మూడు నెలల్లో చెల్లిస్తామని పేర్కొన్నారు.



వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com



# "నిలేసి చదివించే నేర్పు కనిపించడం లేదు"

**తెలుగు రచయితల్లో ప్రత్యేకమైన కథకుడు భమిడిపాటి జగన్నాథరావు గారు. త్రికాలాల్లో మనిషికి ప్రాణప్రదమైన మానవత్వం తల్లివేరుగా ఆయన కథలు అల్లుకొచ్చారు. సన్నటి ఆకుపచ్చ తీగలోంచి వికసించే పూలంతటి కోమలంగా వాటిని సృజించారు. అందుకనే కాబోలు, ఆయనలోని చేతనా సౌకుమార్యం తనని అమితంగా ఆకర్షించిందన్నారు ఇస్మాయిల్ గారు. విస్తారంగా రాయకపోయినా, మధ్యేమధ్యే విరామం పాటించినా కథల పందిరి నీడని ఆయనెన్నడూ వదిలిపెట్టలేదు.**

**తొలినాళ్ళ నుంచి కథలు చదవడం, విశిష్ట రచయితల్ని గుర్తించడం, మేలిమి కథల్ని పదుగురితో పంచుకోవడం విధిగా ఆచరించారు. ఆయన కనుగొన్న రచయితల్లో త్రిపుర గారు ప్రథముడని అంటారు. చలం, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, త్రిపుర వంటి ఇష్ట కథకుల ఔన్నత్యానికి నమస్కరిస్తూనే, యువ రచయితల్లో కొందరి రచనా కౌశలం చూసి పులకించిపోతుంటారు. గత డెబ్బై ఏళ్ళలో నాలుగు దఫాలుగా కొనసాగిన ఆయన సృజనలోంచి ముప్పై కథల్ని మాత్రమే పాఠకులకి అందుబాటులో ఉంచారు.**

**అవన్నీ గోదావరి వంతెన దాటే ప్రయాణీకులు జీవ జలాల్లోకి రాగి కాసులు విసిరే సత్యకాలపు కథలు. జీవితంలో వేదన, దుఃఖం, పోరాటమే కాకుండా ప్రేమ, శాంతి, ఆనందం కూడా ఉంటాయని రుజువు చూపిన కథలు. ఆయన కరుణార్ద్ర నేత్రాలతో, అంతఃచక్షువుతో దర్శించిన మానవ సంబంధాల్లోని సున్నితమైన కథలు. విజయవాడలో ఓ సాయంత్రం జగన్నాథరావు గారితో జరిపిన సంభాషణలో, తరతరాల కథ చుట్టూ తన జీవన గమనంతో పాటు పఠనానుభవం, రచనా నేపథ్యం గురించి అనేక సంగతులను ఇలా జ్ఞాపకం చేసుకున్నారు.**

- కృష్ణా జిల్లా గుడివాడలో 1934 జూన్ 20న పుట్టాను. అసలు ఊరు పశ్చిమ గోదావరిలోని ఆకివీడు. మా అమ్మ సుబ్బలక్ష్మి. పుస్తకాలు విరివిగా చదివేవారు. నా సాహిత్యాభిరుచికి అదొక కారణం. అన్నయ్య కుక్కుటేశ్వరరావు కూడా మంచి చదువరి. అప్పట్లో డిటెక్టివ్ నవలలు బాగా వచ్చేవి. అందులో బెంగాలీ నుంచి అనువాదాలు ఎక్కువగా ఉండేవి. అవీ, తెలుగు సాహిత్యం అమ్మ, అన్నయ్య చదివేవారు. నాతోనూ చదివించేవారు. ఆ విధంగా నా పఠనాసక్తి పెరిగింది.
- నాన్న సూర్యనారాయణ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌లో అధికారిగా చేశారు. ఉద్యోగరీత్యా ఆయనకి బదిలీలు ఉండేవి. అందువల్ల నా చదువు అమలాపురం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, భీమవరం తదితర చోట్ల కొనసాగింది. భీమవరంలో చదివిన కాలం (1945-1953) నా జీవితంలో ఎంతో విలువైనది. ఒక్క మాటలో చెప్పాలంటే భీమవరం నా జీవితాన్ని తీర్చిదిద్దింది.
- అక్కడ చదువుకున్నప్పుడు, మా స్కూలు పక్కనే ఒక లైబ్రరీ ఉండేది. దాని గురించి నేను ఎరుగను. ఓ రోజున నా మిత్రుడి వస్తువొకటి ఆ ప్రాంగణంలోకి పడిపోయింది. దానిని తీసుకోవడానికి వెళితే పుస్తకాలు కనిపించాయి. 'గ్రంథాలయం' అనే బోర్డూ కనిపించింది. ఆ గ్రంథాలయాధికారితో పరిచయం పెంచుకున్నాను. ఆయనే నాకు guide చేసి ఎన్నో పుస్తకాలను చదివించాడు. నా ఆసక్తి ఎలా ఉండేదంటే, కొన్నిసార్లు మధ్యాహ్నం స్కూలు మానేసి గ్రంథాలయంలోనే పుస్తకాలు చదువుకుంటూ ఉండిపోయేవాణ్ణి.
- ఆ రోజుల్లో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పాలగుమ్మి పద్మరాజు గారు ఉండేవారు. నా సాహిత్య, వ్యక్తిత్వాలపై ఆయన స్ఫూర్తి ఉంది. పెద్దాడ రామస్వామి అప్పట్లో మా ప్రిన్సిపల్. ఆయన Shakespeare expert. మా కాలేజీ మామిడితోటలో ఉండేది. సాయంత్రం వేళ పెట్రోమాక్స్ లైట్ల వెలుగులో షేక్స్‌పియర్ నాటకాలను ఆయన బోధించేవారు. ఈ విషయం తెలిసి ఊళ్ళో వాళ్ళు కూడా వచ్చి ఆసక్తిగా వినేవారు. దిగుమర్తి సీతారామస్వామి మాకు తెలుగు చెప్పేవారు. ఆయన రాసే పద్యాలు 'భారతి'లో అచ్చయ్యేవి. దిగుమర్తి వారి సాంగత్యం గొప్ప ఉత్తేజం.
- బీఎస్సీ అయ్యాక బెనారస్ వెళ్ళి కెమికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. అక్కడ నా ఆరోగ్యం చెడిపోవడంతో వెనక్కి వచ్చేశాను. కొత్తగా మరేదైనా కోర్స్ చేయాలనుకున్నాను. నాగపూర్ వెళ్ళి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీలో చేరాను. అప్పటికి అది కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సు. అక్కడే రెండేళ్ళు చదివాను.
- ఆ తర్వాత కొత్త కొత్త ప్రదేశాలకు తిరగాలనిపించింది. అది చేయమని, ఇది చేయమని మా నాన్న నన్ను వత్తిడి పెట్టేవారు కాదు. ఆయన్ని అందరూ gentleman అని పిలిచేవారు. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం కంటే కొంచెం ఎక్కువ. సంపన్నులం కాదు. అయినా కొన్నాళ్ళు దేశం పట్టుకు తిరిగాను. కోల్‌కతా, ముంబై, ఢిల్లీలలో కొంత కాలం ఉన్నాను. చివరికి 1963లో రేణిగుంటలోని 'తిరుపతి కాటన్ మిల్స్'లో ఉద్యోగిగా చేరాను. అక్కడ ఉన్నప్పుడు తిరుపతికి వెళ్ళి నాకు కావలసిన పుస్తకాలు తెచ్చుకుని చదువుకునేవాణ్ణి.
- త్రిపుర రాసిన గొప్ప కథ 'పాము'ని రేణిగుంటలో ఉన్నప్పుడే చదివాను. ఆ పూట భోజనం కూడా చేయలేదు.

**మహిళలపై సాగే పైకి కనపడని, కనిపించే హింసని చూడబట్టి స్త్రీవాద చైతన్యం అబ్బింది నాకు. మగవాళ్ళలో సంస్కారహీనత ఇప్పటికీ కొనసాగుతోంది. అది తప్పు అనిపించేది. అందుకే నా రచనల్లో ఆ అంశానికి ప్రాధాన్యం ఇచ్చాను. కానీ మనవాళ్ళ చర్మం దళసరి. తొందరగా చలించరు. నిజానికి చిన్నచిన్న ఉద్యోగులు, కూలిపనులు చేసేవాళ్ళలో ఎంతో సభ్యత కనిపిస్తుంది నాకు. ఆ సంస్కారం నాకెందుకు అలవడలేదో అని సిగ్గుపడేవాడిని. అయితే దానినంతటినీ కథల్లో రాయలేకపోయాను.**

## భమిడిపాటి జగన్నాథరావు

- 1951లో రచనారంగంలోకి వచ్చాను. ఆ ఏడాది ఒక కథ రాశాను. అప్పటికే మా అన్న నాతో చలం పుస్తకాలు చదివించాడు. ఆ ప్రేరణతో ఆయన లాగే రాయాలని ఆ కథ రాశాను. కానీ అలా రాయకూడదని తెలుసుకుని దాన్ని అట్టేపెట్టేశాను. కొన్నేళ్ళ తర్వాత, అంటే 1959లో ఆ కథ ఆంధ్రపత్రికలో వచ్చింది. భమిడిపాటివారి కుటుంబం అంటే హాస్యానికి ప్రసిద్ధి కదా! అందువల్ల సరదాగా రాయాలని 1952లో ఓ రెండు కథలు రాశాను. అనంతర కాలంలో నా అభిప్రాయం మారింది. ఇకమీదట lighter wayలో రాయకూడదని అనిపించింది. సరైన పద్ధతిలో రాయాలని నిశ్చయించుకున్నాను.
- మిగతా ప్రక్రియలు రాయడం చేతకాదు కనుక కథని ఎంచుకున్నాను. పదో తరగతిలో పద్యాలు రాసే ప్రయత్నం చేశాను. కానీ అది నాకు నప్పదని అనిపించింది. నవల రాసేటంత ఓపిక, జ్ఞానం నాకు లేవు. నాటకం రాయడం కష్టం. అందుకే నేను నా అభివ్యక్తికి కథని ఎన్నుకున్నాను. నాకు జీవిత చరిత్రలంటే కూడా ఆసక్తి. జీవిత చరిత్రలలో సమాజ చిత్రణ, మనుషులు పడే సాధక బాధకాలు అన్నీ ఉంటాయి. అప్పటి కాలం, పరిస్థితులను వీలైనంత వాస్తవికంగా, సత్యపూరితంగా రాసే అవకాశం వాటిలో ఉంటుంది. ఇక తెలుగులో నవలా సాహిత్యం విషయానికి వస్తే, వాసిలో తక్కువే అనుకుంటాను. కన్నడ, బెంగాలీల కన్నా మనం వెనకబడే ఉన్నామనిపిస్తుంది. పాఠకుల అభిరుచి కూడా మారింది. నాసిరకం కథలు బాగున్నాయనే ధోరణి పెరిగింది.
- రాయకుండా ఉండలేనితనం, నా ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలనే కుతూహలమే నన్ను రచనకి ప్రేరేపిస్తాయి. కొన్నాళ్ళు రచనలు కొనసాగిస్తాను. సచేతనంగానే కొంత కాలం రాయడం మానేస్తాను. దీర్ఘమైన విరామం తీసుకుంటాను. 1952 నుంచి 1968 వరకూ 17 కథలు రాశాను. ఆ తర్వాత ఎన్నో విషయాలలో రాజకీయంగా, సామాజికంగా వచ్చిన మార్పులను తెలుసుకోవడం కోసం 18 పేజీల ఉత్తరం రాశాను. ఆ రచయిత చిరునామా తెలియదు. త్రిపుర పేరు రాసి కేరాఫ్ 'భారతి' పత్రికకి పోస్ట్ చేశాను. ఆ ఉత్తరాన్ని వాళ్ళు వెంటనే త్రిపురకి పంపించారు. ఆయనతో పరిచయం ఏర్పడింది. త్రిపురకి అభిమానిగా మారాను. ఆయన నన్ను 'My first and last fan was Jagannadha Rao' అనే వారు. 'పాము' కథ కంటే ముందే 'సుబ్బారాయుడి రహస్య జీవితం' అనే కథ ఆంధ్రపత్రికలో వచ్చింది. అది చదివిన జ్ఞాపకం ఉంది. ఆ తర్వాత నేను ఆంధ్రజ్యోతి వీక్లీ అడ్రస్ ఇస్తే, దానిలో 'భగవంతం కోసం' కథ రాశారు. 'చీకటి గదులు' కథ 'భారతి'లో వచ్చింది. తెలుగు పాఠకుల్ని ఓ సుడిగాలిలా, ఓ ప్రభంజనంలా, ఊపిరాడనీయకుండా ఉగ్రుతలూపి, విచలితుల్నీ, విభ్రాంతుల్నీ చేశారు త్రిపుర గారు. శిల్పపరంగా కూడా అమోఘం, అద్వితీయమనిపించే శిల్ప పరిణతిని కథల్లో పొదిగి తెలుగు కథను పరిపుష్టం చేశారు. ఆయన దస్తూరి చాలా బాగుండేది. చక్కని ఉత్తరాలు రాసేవారు.

పుస్తకాలు చదువుతూ ఉండిపోయాను. 1968-1980 మధ్య ఏమీ రాయలేదు. 1980-1984 మధ్య ఆరు కథలు రాశాను. 1982లో 'సముద్రం' కథ రాశాను. నేను రాసిన వాటిలో ఆ కథ నాకు ఇష్టం. అంటే అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

- 1984 నుంచి మళ్ళీ కలం మూసేశాను. చదువులో పడ్డాను. 1999 వరకూ రాయలేదు. 1999 నుంచి 2003 వరకూ వరుసపెట్టి ఏడు కథలు రాశాను. అవి కూడా త్వరగానే ప్రచురితమయ్యాయి. ఈ రోజుల్లో రాసిన వాటిలో 'మంటల్లో జాబిల్లి', 'మువ్వలు', 'బంతి' కథలు కూడా నాకు తృప్తినిచ్చాయి. మిగతావి నా వరకు నేను average కథలనే అనుకుంటాను. 2003 తర్వాత తిరిగి కలం మూసేశాను. ఇటీవలే చినుకు పత్రికలో రెండు కథలు, నవ్య వీక్లీలో ఒక కథ, రచన మంత్లీలో ఒక కథ రాశాను. ఇవన్నీ కూడా 2015 వరకూ రాసినవే. ఆ తర్వాత శాశ్వతంగా నా కలం మూసేయాలని అనుకున్నాను.
- 'భమిడిపాటి జగన్నాథరావు కథలు' (1996) పేరిట 15 కథలతో ఒక సంపుటం, 'మువ్వలు' (2009) శీర్షికన 15 కథలతో మరొక పుస్తకం, 'అడుగుజాడలు' (2012) పేరుతో ఎంపిక చేసిన పది కథలతో మూడో సంకలనం వెలువడ్డాయి. నేను చేసిన కొన్ని రచనలు, నా కథలపై సహ రచయితలు రాసిన వ్యాసాలు, నా పుస్తకాలపై వచ్చిన సమీక్షలు కలిపి 'పరస్పరం' (2016) అనే పుస్తకాన్ని మిత్రులు ప్రచురించారు.
- ప్రపంచ కథాసాహిత్యంలో మపాసా, ఓ హెన్రీ, బాల్జాక్, టాల్‌స్టాయ్ నాకు ఇష్టమైన రచయితలు. తెలుగులో గురజాడ, చలం, చింతాదీక్షితులు, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, రావిశాస్త్రి, త్రిపుర, ముళ్ళపూడి, కారా అంటే ఇష్టం. ఈ తరం కథకుల్లో డాక్టర్ వి.చంద్రశేఖర్‌రావు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, ఖదీర్‌బాబు, అట్టాడ అప్పలనాయుడు వంటి పలువురు ఇష్టం. రచయితల కంటే నా చుట్టూ ఉండే జీవితమే నన్ను మిక్కిలి ప్రభావితం చేసింది.
- ఎత్తుగడ, పాత్రోచితమైన భాష, మాండలికం, కథన రీతి, సరైన ముగింపు- ఇవన్నీ కలిస్తేనే మంచి కథ అవుతుంది. మంచి భాష వాడినంత మాత్రాన మంచి కథ అయిపోదు. గొప్ప కథల్లో పాత్రలు జీవితాంతం మనల్ని వెంటాడతాయి. చదివించే కథలు ఇటీవల బాగానే వస్తున్నాయి. కానీ, ఆ రచయితల్లో నిలేసి చదివించే నేర్పు కనిపించడం లేదు. కథా రచనలో ఇంకా మార్పు వస్తే బాగుంటుంది.
- నా కథల్లో స్త్రీవాద స్పృహ ఎక్కువగానే ఉంటుంది. మా అమ్మ పడ్డ కష్టాలు, కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగకి ఆమె కళ్ళమ్మట కారే నీరు చూస్తే నాకు తెగ బాధేసేది. మా చుట్టుపక్కల ఉండే మహిళలపై సాగే పైకి కనపడని, కనిపించే హింసని చూడబట్టి స్త్రీవాద చైతన్యం అబ్బింది నాకు. మగవాళ్ళలో సంస్కారహీనత ఇప్పటికీ కొనసాగుతోంది. అది తప్పు అనిపించేది. అందుకే నా రచనల్లో ఆ అంశానికి ప్రాధాన్యం ఇచ్చాను. కానీ మనవాళ్ళ చర్మం దళసరి. తొందరగా చలించరు. నిజానికి చిన్నచిన్న ఉద్యోగులు, కూలిపనులు చేసేవాళ్ళలో ఎంతో సభ్యత కనిపిస్తుంది నాకు. ఆ సంస్కారం నాకెందుకు అలవడలేదో అని సిగ్గుపడేవాడిని. అయితే దానినంతటినీ కథల్లో రాయలేకపోయాను.
- రచయితగా కంటే పౌరుడిగా ఉండటమే నాకు ఇష్టం. నా జీవితం గడిచినంత మేరా బాగానే సాగింది. అయినా భరించలేనంత దుఃఖ సమయాలు ఉన్నాయి. నాకు ఒక్కతే చెల్లెలు. ఆమెతో అనుబంధం ఎక్కువ. ఉన్నట్టుండి చనిపోయింది. అది నా జీవితంలో తట్టుకోలేనంత విషాదం. నాకు ఇద్దరు కుమార్తెలు. ఢిల్లీలో ఉండే తెలుగు కుటుంబానికి చెందిన అబ్బాయితో రెండో అమ్మాయికి పెళ్ళయ్యింది. 1991లో ఆ దంపతులు సింగపూర్ వెళ్ళారు. అక్కడ ఉన్నప్పుడే ఆ అమ్మాయి incurable cancerతో చనిపోయింది. అది కూడా మరో తీవ్రమైన shock. నా భార్య సుశీల 2015లో కన్నుమూసింది. స్నేహితుల వల్ల, పుస్తకాల వల్ల ఆ భారాన్ని మోయగలిగాను.
- 1965లో నేను ప్రభుత్వ ఉద్యోగంలో చేరాను. సమాచార, పౌరసంబంధాల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా, గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా పనిచేసి పదవీ విరమణ చేశాను. బెజవాడలో పరిస్థితులు, వసతులపై మక్కువ కొద్దీ ఇక్కడే స్థిరపడ్డాను. ఇప్పుడు వయస్సు 85ఏళ్ళు. ఈనాటికీ చదవడమే నాకు ఇష్టం. నిత్యం చదువుతాను. సాహిత్యంలో అన్ని ప్రక్రియలకి సంబంధించిన పుస్తకాలు అందులో ఉంటాయి. కానీ నా ప్రాధాన్యం మాత్రం కథే. కథలంటే నాకు అమితమైన ఇష్టం.

**ఇప్పుడు నా వయస్సు 85 ఏళ్ళు. ఈనాటికీ చదవడమే నాకు ఇష్టం. నిత్యం చదువుతాను. సాహిత్యంలో అన్ని ప్రక్రియలకి సంబంధించిన పుస్తకాలు అందులో ఉంటాయి. కానీ నా ప్రాధాన్యం మాత్రం కథే. కథలంటే నాకు అమితమైన ఇష్టం.**



ఇంటర్వ్యూ:
■ నామాడి శ్రీధర్
■ ఒమ్మి రమేష్ బాబు

---

**'అదేం నవ్వు?' కార్టూన్ల సంపుటి**
కార్టూనిస్ట్ రాజా (మోదు రాజేశ్వరరావు) కార్టూన్ల సంపుటి 'అదేం నవ్వు?' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 19 సా.5గం.లకు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరుగుతుంది.
**పి. శ్యామ్ సుందర్**

**'ఆధునిక సాహిత్యంలో రైతు' కవి సమ్మేళనం**
'ఆధునిక సాహిత్యంలో రైతు' అంశంపై సాహిత్య కార్యక్రమం, కవి సమ్మేళనం ఫిబ్రవరి 22 సా.4.30 గం.లకు విజయవాడ బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరుగుతంది.
**నవ్యాంధ్ర రచయితల సంఘం**

**విరసం సదస్సు**
కాశీం, వీవీ, సాయిబాబా జైలు నిర్బంధాన్ని ఖండిస్తూ, సీఏఏకు వ్యతిరేకంగా నిరసనలను స్వాగతిస్తూ విరసం సదస్సు ఫిబ్రవరి 23 ఉ.10గం.లకు విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరుగుతుంది. జి.లక్ష్మీనరసయ్య, ఎన్. వేణుగోపాల్, ఖాదర్ మొహియుద్దీన్, పినాకపాణి, రివేరా తదితరులు పాల్గొంటారు.
**విప్లవ రచయితల సంఘం**

**'పక్షితనాన్ని కలగంటూ...' కవితా సంపుటి**
పక్కి రవీంద్రనాథ్ కవితా సంపుటి 'పక్షితనాన్ని కలగంటూ...' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 23 ఉ.9 గం.లకు పార్వతీపురం ఐటిడిఏ సామాజిక భవనంలో జరుగుతుంది. అట్టాడ అప్పల్నాయుడు, దర్భశయనం శ్రీనివాసాచార్య పాల్గొంటారు.
**స్నేహకళా సాహితి**

**స్వర్ణ కంకణ సత్కారం**
కవి, అనువాదకులు కోడూరు ప్రభాకరరెడ్డిని గుంటూరులోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ స్వర్ణ కంకణంతో, రజత ఫలకంతో సత్కరిస్తున్నది. సభ ఫిబ్రవరి 23 సా.6.30కి ఐటిఏ హాల్, ఐటిసి ఎదురుగా, ట్రంక్‌రోడ్, గుంటూరులో జరుగుతుంది.
**మోదుగుల రవికృష్ణ**

**'సాహితీ సౌరభాలు' సాహిత్య వ్యాసాలు**
రాజాం రచయితల వేదిక ఐదవ వార్షికోత్సవం, 'సాహితీ సౌరభాలు' - 17మంది సాహితీవేత్తల సాహిత్య వ్యాసాల సంకలనం ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 23 ఉ.9.30కు శ్రీవిద్యానికేతన్ పాఠశాల, రాజాం జరుగుతుంది. గార రంగనాథం, మండలి బుద్ధప్రసాద్, వెల్చేరు నారాయణరావు, దీర్ఘాసి విజయ భాస్కర్ పాల్గొంటారు.
**రాజాం రచయితల వేదిక**

**మాడభూషి రంగాచార్య కథా పురస్కారం**
మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కార ప్రదానం అద్దేపల్లి ప్రభ 'సీమేన్' కథా సంపుటికి ఫిబ్రవరి 25 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. శీలా వీర్రాజు, కాలువ మల్లయ్య, నెల్లుట్ల రమాదేవి, నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొంటారు.
**మాడభూషి లలితా దేవి**

---

జీవి పరిధిని
కొలత వేస్తూ
కొమ్మలను కమ్ముతూ
మెల్లని లయలా
సాగుతున్న పొగమంచు

నిలబడి పోయాం మనం...
అసీమమైన
ఆ ధావళ్యం
ఎట్టెదుట!
లోయలూ కొండలను
పల్లపు దారులను
కాలినడకల జాడలను
ఋతువు కదలికలను
అలుముకున్న
సడిలేని ఆ దుగ్ధలో...

రెల్లు ఈకలా
సన్నని జల్లు
చెంపలు నిమిరి
కలుకొలకుల సాగి
చుక్కలా చెమరించింది

గుండె మొరాయించింది

చర్మం అణువణువులో కెరలింత
సూది పోటులా చొరబడే
నిగ్గు మొనల
అకారణ కారుణ్యం కోసం....

■ సుమనస్పతి
✆ 96761 80802



---

# గది

గదులన్నీ
ఆ గదిలోకే ప్రవహిస్తాయి.

దేహంలోని రక్తం చలనాలు
గుండెవైపు సాగుతున్నట్టు,
సముద్రంలోని ఉపరితలకెరటాలు
అడగుకు చేరుకుంటున్నట్టు
నేను రోజూ గదిలోకి ప్రవేశిస్తాను.

గోడలు కట్టి
పేర్లు పెడతాంగాని
ఏ గదిలో ఉండాల్సిన వస్తువులు
అక్కన్నే స్థిరంగా ఉండవు
అప్పుడప్పుడు ఈ గదిలోనే
ప్రత్యక్షమవుతాయి.

ర్యాక్‌లో అశాంతిగా కదిలే పుస్తకం
దిండు పక్కన చేరుతుంది.
డ్రాయింగ్ రూంలోని మొనాలిసాబొమ్మ
మనసులో మెదిలి
భావాలు మారిపోతుంటాయి.

కల
ఒక శృంఖలగా మారుతుంది
అరటిగెల
తీయని ఊయెలగా ఊగుతుంది
నిద్రానిద్రలమధ్య
ఒక విచిత్రమైన వల పరుచుకుంటుంది.

ఇది వొట్టిగదికాదు
ప్రేమ తక్కువైనప్పుడు
తలపోతకు ఉక్కపోస్తుంది
ఆస్తుల విస్తీర్ణం పెరిగినప్పుడల్లా



మనస్సు ఇరుకౌతుంది.
స్పష్టంగా ఉండాల్సిన సారాంశం
సంక్లిష్ట ఛాయావృతమౌతుంది.

ఇది వొట్టిగది కాదు
ఆత్మ ద్రవీభవించే నది
నాకు నేను కనిపిస్తున్న పెన్నిధి

■ ఎన్. గోపి

---

# "రాయడం నా సామాజిక బాధ్యత"

**ఇటీవల వెలువరించిన మీ 'ఇమ్మతి' సాహిత్య వ్యాసాల సిద్ధాంత భూమిక, నేపథ్యం ఏమిటి?**



వెయ్యేండ్ల తెలుగు సాహిత్యం అంతా రెండే భాగాలుగా ఉంది. 1. చాతుర్వర్ణ కుల వ్యవస్థను కాపాడే సాహిత్యం. 2. కులవ్యవస్థను బద్ధలుకొట్టే అంబేద్కరైట్ అస్తిత్వవాద సాహిత్యం. ఈ నేపథ్యంలో అస్తిత్వవాదాలుగా లేవనెత్తిన ప్రశ్నకు, నిర్మించిన ప్రత్యామ్నాయ భావజాలానికి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. ముఖ్యంగా గడిచిన దశాబ్దంన్నర కాలంగా నాదైన దృక్కోణం నుండి దళిత, తెంగాణ, గ్లోబలైజేషన్ ఉద్యమాల సాహిత్యాన్ని విశ్లేషించే పనికి పూనుకున్నాను. అలా నేను వెలువరించిన పుస్తకాలే 'ఇమ్మతి', 'గ్లోబలైజేషన్ సాహిత్య విమర్శ' సంపుటాలు. దళిత సాహిత్యం విషయానికి వచ్చినపుడు మన సమాజంలో దళితులకు జరిగిన అన్యాయమే దళిత సాహిత్యానికి కూడా జరిగింది. కేవలం లెక్కల కోసం వేళ్ల మీద పేర్లు చెప్పే సంస్కృతి ఒకటి ఉంది. అలాంటి వారిని విమర్శిస్తూ కూర్చోవడం కంటే, దళిత రచనల్లోని తాత్విక గాఢతను గురించి, వస్తు వైవిధ్యం గురించి రాసుకోవాలనిపించింది. అలా రాసుకున్న వ్యాసాలే దశాబ్ద కాలం తరువాత పుస్తకంగా వేసుకున్నాను.

**దళిత సాహిత్యంలో మీ కథలు ఏ విధంగా భిన్నమైనవి?**

నాకంటే ముందు దళిత రచయితలు కథా సాహిత్యంలో తమదైన ముద్రను వేశారు. వారు వదిలిపోయిన వస్తువును నేను రాసే ప్రయత్నం చేస్తున్నాను. దళిత కథకు వస్తువు గ్రామీణ జీవితమే ప్రధానం. నా కాలానికి కులం ఆధునికంగా విస్తరిస్తున్న జాడలు నన్ను కలవరపరిచాయి. అట్లా నేను 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' కథలు రాయగలిగాను. మన కళ్లముందే కనిపిస్తున్న ఒక సామాజిక రుగ్మతను గురించి రాయకుండా ఎలా ఉండగలం?! నా మట్టుకు నేను కథ రాయాలంటే నాకు ఒక సత్యం సాక్షాత్కారం కావాలి. అది నలుగురిలో చర్చకు పెట్టాలి. నా కథ వల్ల కొందరైనా ఆ సమస్యను గురించి ఆలోచించాలి. అందుకే నా కథలు ఎక్కువగా సామాజిక అసమానతకే పరిమితం అయ్యాయి. ఈ విషయాన్ని పాజిటివ్‌గా తీసుకున్నవారు ఉన్నారు, నెగటివ్‌గా విమర్శించినవారు ఉన్నారు. నా కథల్ని తిట్టడం కోసమే చదివినవారు ఉన్నారు. ఒక ఆశ్చర్యకరమైన స్టేట్‌మెంట్ కూడా చేశారు. "ఈ రోజుల్లో కులం ఉంటే ఉన్నది. అందిరికీ తెలిసిన విషయమే కదా మళ్లీ దీనిపై రాయాల్సిన అవసరం ఏముంది?" అని విప్లవ శిబిరం నుండి ఒక మిత్రుడు నా కథపై సమీక్షరాస్తూ చేసిన వ్యాఖ్య అది. అలాగే ఒక అగ్రవర్ణ పాఠకురాలు నా కథల్ని చదివి "ఇవాళ్టికి కూడా మీరు ఇట్లా కులంవల్ల నలిగిపోతున్నందుకు... ఈ కులంలో పుట్టినందుకు నేను సిగ్గుపడుతున్నా" అన్నారు. ఇట్లా మిశ్రమ స్పందనలు వచ్చాయి, వస్తున్నాయి. అయినాసరే రాయడం నా సామాజిక బాధ్యత. అంబేద్కర్ కలలుగన్న కులనిర్మూలన జరిగే వరకు నా వస్తువు మారకపోవచ్చు.

**దళిత సాహిత్యం విషయానికి వచ్చినపుడు మన సమాజంలో దళితులకు జరిగిన అన్యాయమే దళిత సాహిత్యానికి కూడా జరిగింది. కేవలం లెక్కల కోసం వేళ్ల మీద పేర్లు చెప్పే సంస్కృతి ఒకటి ఉంది. అలాంటి వారిని విమర్శిస్తూ కూర్చోవడం కంటే, దళిత రచనల్లోని తాత్విక గాఢతను గురించి, వస్తు వైవిధ్యం గురించి రాసుకోవాలనిపించింది. అలా రాసుకున్న వ్యాసాలే దశాబ్ద కాలం తరువాత పుస్తకంగా వేసుకున్నాను.**



**దళిత కథకు వస్తు, శిల్ప ప్రాధాన్యతల్లో ఏది ముఖ్యం?**

దళిత జీవితమే అత్యంత కళాత్మకమైంది. దాన్ని వ్యక్తీకరించే కళారూపానికి శిల్పం పేరుతో ఆంక్షలు పెట్టడం ఎప్పటి నుంచో ఉంది. ఇది పెద్ద అడ్డంకి. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టు ఆటలో గెలవాలంటే ఆటగాళ్లను మార్చడం కాదు, ఆట రూల్స్‌ను మార్చాలి. ఈ నేపథ్యంతో కథను కొలిచే విమర్శ సూత్రాలు ఆధిపత్య ప్రాంతాల స్వభావంతో ఉన్నప్పుడు వెనుకబడిన ప్రాంతాల సాహిత్యం వారికి రుచించకపోవచ్చు. అలాగే వెనుకబడిన కులాల సాహిత్యం విషయంలో కూడా ఇదేరకమైన నిర్ణయానికి రావచ్చు. కానీ, ఇది తప్పు. సామాజిక విముక్తికి దోహదం చేయలేని ఎంత గొప్ప శిల్పంతో కూడిన రచన అయినా వృథానే. అస్తిత్వవాద సాహిత్యాలకు స్వానుభవమే గొప్ప శిల్పాన్ని ఇస్తుంది. శిల్పం కిందికులాల సాహిత్యానికి సంకెల వేయకూడదు.

పసునూరి రవీందర్ • పలకరింపు
✆ 77026 48825

బ్యూటీ

# చిన్న ప్రయోగాలతో చిరునవ్వులు పూస్తాయి!

ఏ రంగు చర్మం ఉన్న వారైనా కొన్ని చిట్కాలు పాటిస్తే అందం రెట్టింపవుతుంది. వంటింట్లో చేసే చిన్న చిన్న బ్యూటీ ప్రయోగాలే చర్మాన్ని నిగనిగలాడేలా చేస్తాయి. పైగా రసాయనాల బాధ కూడా ఉండదు. ఒకసారి మీరూ ఆ చిట్కాలు ట్రై చేయండి.

- మేడిపండు, కొబ్బరినూనె మిశ్రమాన్ని పెదవులపై రాసుకుంటే బాగా మెరుస్తాయి. అంతేకాదు ఏ కాలమైనా పెదవులు పగలవు.
- పొడిచర్మం ఉన్నవాళ్లు ఉదయం లేచిన వెంటనే కొబ్బరినీళ్లు తాగితే చర్మం తేమగా, మృదువుగా తయారవుతుంది. భోజన సమయంలో పుచ్చకాయ, కమలాఫలం, అవకాడో వంటి పండ్లు తింటే చర్మానికి కావలసినంత నీరు అందుతుంది.
- బొప్పాయి మాస్క్ చర్మం మీది మృతకణాలను పోగొట్టి చర్మాన్ని మరింత మెరిపిస్తుంది. పావు కప్పు బొప్పాయి గుజ్జు లేదా బొప్పాయి ముక్కలకు టేబుల్‌స్పూన్ తాజా పైనాపిల్ గుజ్జు కలిపి మెత్తగా చేసి ముఖానికి రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- చక్కెర వినియోగాన్ని తగ్గిస్తే చర్మం పట్టులా మృదువుగా ఉంటుంది. డైట్ నుంచి పది రోజుల పాటు చక్కెరను దూరం పెడితే చర్మ సౌందర్యం రెట్టింపవుతుంది.
- చర్మానికి బాదం నూనె రాస్తే ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది.
- సూక్ష్మ పోషకపదార్థాలు, తృణధాన్యాలను నిత్యం తీసుకుంటే చర్మం సహజసిద్ధమైన మెరుపులు చిందిస్తుంది.
- గ్రీన్ టీని టోనర్‌గా వాడడం వల్ల కాంతి విహీనంగా ఉన్న చర్మం మెరుపులీనుతుంది.
- పాలిపోయినట్టుగా ఉన్న చర్మంపై ఛమోమిలి టీ ఐస్ క్యూబ్స్‌తో రాస్తే తాజాగా మారుతుంది.



ఇలా చేయండి!

# చెప్పులు కరుస్తున్నాయా?

కరవకపోతే అవి కొత్త చెప్పులు ఎలా అవుతాయి? అయితే కాళ్లను కరిచే వాటి నోళ్లను మూసేసే చిట్కాలు పాటిస్తే, ఎలాంటి అసౌకర్యం లేకుండా కొత్త చెప్పులు, షూ ధరించవచ్చు.

- కొత్త షూ ముందరి భాగం ఇరుకుగా ఉండి, కాలి బొటనవేలిని నొక్కేస్తూ ఉంటుంది. ఇలాంటి షూ వేసుకుని ఎక్కువ దూరం నడవలేం! ఈ సమస్య తొలగాలంటే గాలి చొరబడని ప్లాస్టిక్ బ్యాగులో కొద్దిగా నీరు నింపి, షూ ముందరి భాగంలో కుక్కేసి, ఫ్రీజర్‌లో రాత్రంతా ఉంచేయాలి. గడ్డకట్టిన నీరు వ్యాకోచిస్తుంది. దాంతో మంచు ముక్కగా మారిన చోట, షూ కూడా వ్యాకోచం చెందుతుంది. మీ సమస్య తేలికగా తొలగిపోతుంది.
- కొత్త షూ లేదా చెప్పులు ఎక్కువసేపు ధరిస్తే, మడమ దగ్గర తోలు లేచిపోయి, పుండ్లు ఏర్పడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే జెల్ రూపంలోని డియోడరెంట్‌ను షూ లేదా చెప్పు లోపలి భాగంలో పూయాలి.
- కొత్త చెప్పులు 'కిర్రు కిర్రు'మంటూ దూరం నుంచే మీ రాకను చెప్పేస్తూ ఉంటాయి. ఈ ఇబ్బంది తప్పాలంటే షూలోని సోల్ అడుగున బేబీ పౌడర్ చల్లాలి. దాంతో సోల్‌కు, షూకు మధ్యన కుషన్ ఏర్పడి శబ్దం చేయకుండా ఉంటాయి.



స్ఫూర్తి



**గెలుపు... ఓటమి... రెండింటి మధ్య తేడా సన్నని గీత మాత్రమే! కానీ... ఒక గెలుపు జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఓటమి మరపురాని పాఠం నేర్పుతుంది. అది ఆటల పోటీ అయినా... జీవితమైనా! పుట్టుకతోనే గొంతు మూగబోయింది. చెవి వినికిడి శక్తిని కోల్పోయింది. అయినా ఆమె బతుకును భారంగా భావించలేదు. తన బలహీనతలను అర్థం చేసుకొని... బలమేమిటో తెలుసుకుని ఓ ప్రయత్నం మొదలుపెట్టింది. ఆ ప్రయత్నమే ఇటీవల ఆమెను కోటీశ్వరిని చేసింది. అవును... ఇప్పుడామె గెలుపు మాట్లాడుతోంది.**

# ఆమె గెలుపు మాట్లాడింది!

అవును... ఈ కథ 'కోటీశ్వరి మహిళల గేమ్ షో'లో కోటి రూపాయలు గెలుచుకున్న కౌసల్యా కార్తీక గురించే! చెవులతో వినలేదు. మాటల్లో చెప్ప లేదు. అయినా తన మేధస్సుతో గేమ్ షోలో విజేతగా నిలిచింది. ప్రపంచంలో మునుపెన్నడూ ఇలా ఏ బధిర మహిళా 'కోటి' గెలుచుకున్న సందర్భాలు లేవంటే కౌసల్య సాధించింది ఎంతటి ఘనతో వేరే చెప్పనక్కర్లేదు.

### పట్టుదలే పెట్టుబడి...

కౌసల్య సొంత ఊరు తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి పారిశ్రామిక ప్రాంతం. నాన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. అమ్మ గృహిణి. పుట్టుకతోనే కౌసల్యకు మాట పడిపోయింది. వినికిడి శక్తి లోపించింది. కానీ ఆమె అమ్మానాన్నలు పసి మనసుకు ఆ బాధ తెలియకుండా పెంచాలని చూశారు. అందుకు కావాల్సినవన్నీ చేశారు. అంతా బాగానే ఉంది. ఇంతలో ఆమెకు ఊహ తెలిసింది. బడి వయసు వచ్చింది. అసలు కథ అక్కడే మొదలైంది. అందరిలా చదువుకోవాలనీ... ఆడుకోవాలనీ కౌసల్య కూడా కలలు కన్నది. అయితే ఎలా? నలుగురిలోకి వెళితే హేళన. ఇంటి పట్టునే ఉంటే అటు కన్న వారికి ఆవేదన... తనకు మనోవేదన. ఆ వయసులోనే ఆమెలో ఎన్నో సంఘర్షణలు. వాటి నుంచే పోరాడే తత్వాన్ని అలవాటు చేసుకుంది కౌసల్య.

### అందరిలా తనూ...

బధిరురాలు కావడంతో బాల్యంలో కౌసల్య తొలుత 'సైన్ లాంగ్వేజ్' స్కూల్‌లో చేరాలనుకుంది. కానీ ఓరల్ స్పీచ్ స్కూల్‌లో చేరమని అక్కడి టీచర్ సలహా ఇచ్చారు. ఆ సూచన మేరకు ప్రాథమిక తరగతులు స్థానిక పాఠశాలలో చదివింది. ఆ తరువాత అందరూ చదివే సాధారణ స్కూలుకే వెళ్లింది. ఆరంభంలో అక్కడ టీచర్ చెప్పే పాఠాలు ఆమెకు ఏమాత్రం అర్థం అయ్యేవి కావు. ఎంతో ఇబ్బంది పడింది. కానీ ఆత్మస్థయిర్యం



కోల్పోలేదు. పట్టుదలగా ప్రయత్నించింది. తోటి విద్యార్థులూ సహకరించారు. ఇంటికి వచ్చాక వాళ్ల నాన్న పాఠాలు చదివి వివరించేవారు. అవి కౌసల్యకు అర్థమయ్యేవి కావు. విడమరిచి చెప్పే సమయం ఆయనకూ ఉండేది కాదు. దీంతో ఆయన కౌసల్య వాళ్ల అమ్మకు చెబితే, ఆమె వివరించేవారు. అలా అమ్మ పెదవుల కదలికలను బట్టి పాఠం అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది కౌసల్య.



### కౌసల్యను అర్థం చేసుకున్నా...

పెళ్లి చూపులకు వెళ్లినప్పుడే కౌసల్యను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పుడు తను నాకు ఏమి చెప్పిందో తెలియలేదు కానీ... ఆ తరువాత బాగా అర్థం చేసుకోగలిగాను. నాకు తనలో నాకు బాగా నచ్చింది కల్మషం లేని మనసు, తెలివితేటలు. కాలేజీ వరకు ఏబీసీడీలు తెలియని తను డిగ్రీ ఇంగ్లిష్ మీడియంలో చదివిందంటే నాకెంతో ఆశ్చర్యం కలిగింది. ఇప్పుడు తనకు ఇంగ్లిష్ బాగా వచ్చు. కౌసల్య ఎందులోనూ ఎవరికీ తీసిపోదు. కానీ బయటకు ఎక్కడికన్నా వెళ్లినప్పుడు కొంత మంది తనను దూరం పెడతారు. ఎవరూ పట్టించుకోరు. ఇది కౌసల్యనే కాదు, నన్నూ బాధిస్తుంది. అయితే దాని నుంచి బయటపడేందుకు భర్తగా నేను చేయగలిగింది చేస్తాను. మానసికంగా, నైతికంగా తనకు మద్దతు ఇస్తాను. ధైర్యం నింపుతాను. అన్నింటికీ మించి తనలో ఆత్మవిశ్వాసం పాళ్లు ఎక్కువ. అందుకే 'కోటీశ్వరి'లో విజయం సాధించగలిగింది. ఈ గెలుపు మేము అస్సలు ఊహించలేదు. తన శక్తి ప్రపంచానికి తెలిసినందుకు మాకు ఎంతో సంతోషంగా ఉంది.

**- బాల మురుగన్,** కౌసల్య భర్త

### చదువులో టాపర్...

మొదట్లో పాఠాలు అర్థం చేసుకోవడానికి ఎంతో ఇబ్బంది పడ్డ కౌసల్య... ఆ తరువాత చదువులో అద్భుతంగా రాణించింది. పదో తరగతి దాకా నాగర్‌కోయిల్ బధిర పాఠశాలలో తమిళ మీడియంలోనే చదివిన ఆమెకు లెవెన్త్ స్టాండర్డ్‌కు వచ్చేవరకు ఏబీసీడీలు కూడా తెలియవు. అయితే సంకల్పం గట్టిదైతే ఎంతటి లక్ష్యమైనా దరిచేరక మానదని నిరూపించింది. ప్రైవేటు క్లాసులకు వెళ్లి ఇంగ్లిష్ నేర్చుకుంది. కోవిల్‌పట్టిలో బీఎస్సీ ఇంగ్లిష్ మీడియంలో చదివిన ఆమె... యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఆ విజయం ఆమెలాంటి ఎంతో మంది అమ్మాయిలకు ఆత్మస్థయిర్యాన్ని ఇచ్చింది. డిగ్రీ అవ్వగానే ఎంఎస్సీ, ఆ తరువాత ఎంబీయే చేసిన కౌసల్య అక్కడా టాపర్‌గానే ముగించింది. అదే స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం కూడా సంపాదించింది. ప్రస్తుతం మదురైలో ఉంటున్న ఆమె అక్కడి జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది.

### బిడ్డ ఏడుపు వినలేని క్షణం...

మంచి చదువు, ఉద్యోగం వచ్చాయి. తన కాళ్లపై తాను నిలబడగలుగుతోంది. కౌసల్యకు ఇక పెళ్లి చేయాలని ఆమె తల్లితండ్రులు నిర్ణయించారు. రెండేళ్ల కిందట బాల మురుగన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ప్రస్తుతం అతడు మదురై రెవెన్యూ విభాగంలో విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (వీఏఓ). పెళ్లి చూపుల సమయంలో అతడికి తన గురించి చాలా విషయాలు చెప్పే ప్రయత్నం చేసింది కౌసల్య. అవేవీ అర్థం కాలేదు కానీ...





### ఇది నా అదృష్టం...

కౌసల్య తన అంకితభావం, విషయపరిజ్ఞానంతో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ షో ద్వారా ఆమెను కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆమె విజయాన్ని ఆస్వాదిస్తున్నాను. కౌసల్య విజయం నిజమైన స్ఫూర్తినిస్తుంది. ఎందరికో ప్రేరణగా నిలుస్తుంది. ఈ గెలుపు ఆమె జీవితాన్ని మరో ఎత్తుకు తీసుకువెళుతుందని ఆశిస్తున్నా.

**- రాధికా శరత్‌కుమార్**

ఆమె మనసు తెలుసుకున్నాడు బాల మురుగన్. కౌసల్య తెలివితేటలూ అతడికి బాగా నచ్చాయి. దీంతో పెళ్లికి ఓకే చెప్పేశాడు. అలా ఒక్కటైన వారికి ఇప్పుడు ఏడాది పిల్లాడు. అబ్బాయి పుట్టగానే వాడి ఏడుపు కౌసల్యకు వినిపించలేదు. అన్నేళ్లూ ఎంతో ఆత్మవిశ్వాసంతో పరుగులు తీసిన ఆమెకు ఆ సందర్భంలో బాధ కలిగింది... పిల్లాడి ఏడుపు వినలేకపోతున్నానని! "ఇప్పుడిప్పుడే వాడు నన్ను 'అమ్మా' అని పిలుస్తుంటే... వాడి పెదవుల కదలిక ద్వారా ఆ మాట తెలుసుకోగలుగుతున్నా. కానీ వాడి గొంతు ఎలా ఉంటుందని మా అమ్మను అడుగుతూనే ఉంటాను" అంటున్నప్పుడు కౌసల్య కళ్లు చెమర్చుతాయి.

### అలా కోటి గెలుచుకుంది...

నాడు చదువు... నేడు ఉద్యోగం, కుటుంబ బాధ్యతలను ఎంతో సమర్థంగా నిర్వర్తిస్తున్న కౌసల్యను ఓ పత్రికా ప్రకటన ఆకర్షించింది. 'కలర్స్' తమిళ ఛానల్‌లో ప్రసారమయ్యే 'కోటీశ్వరి' గేమ్ షోలో ఔత్సాహికులు పాల్గొనవచ్చనే ప్రకటన అది. ఆ షోలో పాల్గొనే వారంతా మహిళలే. అది చూసి దరఖాస్తు చేసింది. నిర్వాహకుల నుంచి పిలుపు వచ్చింది. మొట్టమొదటిసారిగా ఓ బధిర మహిళ ఇలాంటి గేమ్ షోలో పాలుపంచుకుంటోంది. అందుకే కౌసల్యకు సహకరించేందుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు నిర్వాహకులు. రాధిక అడిగే ప్రశ్నలను ఆమె పెదవుల కదలిక ద్వారా అర్థం చేసుకొంటూ, తన సమాధానాలను బోర్డుపై రాసి చూపించింది. ఎన్నో క్లిష్టమైన ప్రశ్నలకు సైతం సులువుగా బదులిచ్చి కోటి రూపాయల బహుమతే కాదు.. కోట్ల మంది హృదయాలను కూడా గెలుచుకుంది.

### పాఠశాలకు కొంత విరాళంగా...

బహుమతిగా వచ్చిన మొత్తంలో కొంత తాను చదువుకున్న నాగర్‌కోయిల్ బధిర పాఠశాలకు విరాళంగా ఇస్తానని కౌసల్య చెప్పింది. "చిన్నప్పటి నుంచి ప్రతి విషయంలో నేను కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వచ్చింది. వాళ్లిచ్చిన ధైర్యం, ఆత్మవిశ్వాసంతోనే నా లక్ష్యాలను చేరుకోగలిగాను. ఇప్పుడు నేను కోటీశ్వరిని. ఇటలీ, స్విట్జర్లాండ్‌లు చూడాలన్నది నా చిన్న కల. ఈ డబ్బుతో దాన్ని కూడా నెరవేర్చుకొంటాను. ఓ ఇల్లు కొనుక్కొంటాను" అంటూ కోటి గెలిచిన సందర్భంగా కౌసల్య భావోద్వేగానికి లోనైంది. కౌసల్యకు వాళ్ల నాన్నే రోల్‌మోడల్. ఎప్పుడు, ఎక్కడ ఎలా ఉండాలో నేర్పిన వాళ్లమ్మ తనకు జీవితం. ఈ గెలుపు ఇన్నేళ్ల ఆమె పరిశ్రమకు తగిన గుర్తింపు. ఆమె జీవితానికి సరికొత్త మలుపు. మౌనంగా ఎదగమని నవతరానికి పిలుపు.

● **హనుమా**

న్యూస్ మేకర్

**స్వాతంత్ర్యేచ్ఛ, వామపక్ష భావాలు నిండిన కుటుంబం. ప్రజాసమస్యలపై పోరాడే నైజం... పేరులోనే తిరుగుబాటు. ఇదీ పార్లమెంట్ సభ్యురాలు విప్లవ్ ఠాకూర్ నేపథ్యం. రాజ్యసభలో ఇటీవల ప్రభుత్వ ధోరణుల్ని నిలదీసి, సాక్షాత్తూ ప్రధానమంత్రిని కడిగేసి ఆమె వార్తల్లోకెక్కారు.**

# ప్రసంగ విప్లవం

"మీరు చేస్తున్నదల్లా భారతదేశాన్ని విడగొట్టే ప్రయత్నం, అంతకు మించి మీరు చేసిందేమీ లేదు" అంటూ విప్లవ్ ఠాకూర్ ఇటీవల రాజ్యసభలో చేసిన గర్జన అధికార పక్షాన్ని ఉలిక్కిపడేలా చేసింది. "అవును! ఆ మాటలు నా మనసులో నుంచి వచ్చాయి. దేశంలో సామాజిక కల చిరిగి చెల్లాచెదురైపోతున్న తీరు చూసి నాలో కలిగిన బాధే ఆ మాటలు పలికించింది. నా పది నిముషాల ప్రసంగం తరువాత అధికార పార్టీ నాయకులు కొందరు నాతో మాట్లాడారు. 'మీరు మమ్మల్ని బాగా భయపెట్టారు' అని వాళ్లు చెప్పారు" అన్నారు విప్లవ్ ఠాకూర్.

### అమ్మ బాటలో...

పార్లమెంట్‌లో పదునైన ప్రసంగాలకు విప్లవ్ ఠాకూర్ పెట్టింది పేరు. నమ్మినదాన్ని నిర్భయంగా చెప్పే ధైర్యం, పోరాడే తత్త్వం ఆమెకు పుట్టుకతోనే వచ్చాయి. విప్లవ్ తండ్రి కామ్రేడ్ పరస్ రామ్ అవిభక్త కమ్యూనిస్ట్ పార్టీలో పేరున్న నాయకుడు. ఆమె తల్లి సరళా శర్మ స్వాతంత్ర్య సమరయోధురాలు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ నుంచి పంజాబ్ శాసనసభకు ఎన్నికయ్యారు. పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు చేపట్టారు. తండ్రి నుంచి పోరాట స్ఫూర్తినీ, తల్లి నుంచి ప్రజాస్వామిక విలువలనూ విప్లవ్ అందిపుచ్చుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జన్మించిన ఆమె పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. పద్దెనిమిదేళ్ళ వయసులోనే ఠాకూర్ హర్నామ్ సింగ్‌తో ఆమెకు వివాహం అయింది. వారికి ఇద్దరు కుమార్తెలు. సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే విప్లవ్ తన తల్లి బాటలో ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించారు. 42 వయసులో తొలిసారిగా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పని చేశారు. ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ వ్యవహరించారు. 2006, 2014లో రాజ్యసభకు ఎంపికైన విప్లవ్ అనేక కమిటీల్లో సభ్యురాలిగా పని చేశారు. రెండేళ్ళపాటు హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బాధ్యతలు నిర్వహించారు. డెబ్భై ఆరేళ్ల విప్లవ్‌కు పుస్తకాలు చదవడం, రచనలు చేయడం, ట్రెక్కింగ్, స్కయింగ్‌లాంటి అనేక అభిరుచులు ఉన్నాయి.



### చిన్నప్పుడు నెహ్రూతో విందు!

దేశ తొలి ప్రధాని నెహ్రూపై లేని అవకాశాలను కల్పించుకొని మరీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు విమర్శలు చేస్తున్నారని విప్లవ్ ఆరోపణ. "నెహ్రూను కించపరచడానికి బీజేపీ నాయకత్వం ప్రయత్నించిన ప్రతిసారీ నాకు కోపం వస్తుంది" అని అంటారామె. విప్లవ్‌కు నెహ్రూ ఆదర్శ నాయకుడు. "నేను నెహ్రూను 1957లో తొలిసారి కలుసుకున్నాను. అప్పుడు నా వయసు 13 ఏళ్ళు. పంజాబ్ శాసనసభను ప్రారంభించడానికి ఆయన వచ్చారు. అప్పుడే కాంగ్రెస్ టిక్కెట్టు మీద మా అమ్మ ఎన్నికయ్యారు. నెహ్రూకూ, శాసనసభ్యులకూ గవర్నర్ విందు ఇచ్చారు. దానికి నన్నూ, నా సోదరినీ మా అమ్మ తీసుకువెళ్ళారు. అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ కైరోన్ మమ్మల్ని నెహ్రూకు పరిచయం చేశారు. ఆ సాయంత్రం మిగిలిన వారందరికన్నా నాతో, నా సోదరితోనే నెహ్రూ ఎక్కువ సమయం గడిపారు. నెహ్రూతో ఫొటో దిగాలని మహిళా శాసన సభ్యులు పోటీపడ్డారు. వారిని వరుసలో నిలబడాలని నెహ్రూ చెప్పారు. అప్పటికీ వాళ్ళు ఒకరినొకరు తోసేసుకుంటూ ఉండడంతో "వరుసలో ఉండడం మీకు తెలీదు. మీరు శాసనసభ్యులు ఎలా అయ్యారు?" అని ఆయన ప్రశ్నించారు. మా వైపు తిరిగి 'రండి పిల్లలూ! నాతో రండి' అని పిలిచారు" అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని విప్లవ్ గుర్తు చేసుకున్నారు.

### ఈ పాలకులు విడదీస్తున్నారు!

మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి విధేయురాలైన విప్లవ్ ప్రజా సమస్యలపై రాజ్యసభలో అనేకసార్లు గళమెత్తారు. అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వాన్ని ధైర్యంగా నిలదీసేవారు. నూలుపై సబ్సిడీ విషయంలో మోదీ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందంటూ గతంలో ఆమె చేసిన ఆరోపణలు సంచలనం కలిగించాయి. "ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో సిల్కు నూలుపైనా, మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కాటన్ నూలుపైనా సబ్సిడీలు ఇస్తున్నారు. కానీ హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రధానంగా వచ్చే ఉన్ని నూలుపై సబ్సిడీ నిలిపివేశారు. దీనివల్ల పేద మహిళలు, చేనేత కార్మికులు దెబ్బతింటున్నారు" అంటూ రాజ్యసభలో కొన్నాళ్ళ కిందట ధ్వజమెత్తారు. ప్రస్తుత పాలకులు ప్రజలను విడదీస్తున్నారన్నది ఆమె ఆరోపణ.

### తెల్లగా ఉంటేనే అందమా?

అలాగే "ఫెయిర్‌నెస్ క్రీమ్‌ల ప్రకటనలు మహిళలను కించపరుస్తున్నాయి. వాటివల్ల మహిళల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటోంది. కాబట్టి వాటిని నిషేధించాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ఆమె వివరణ ఇస్తూ "భారతదేశంలో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రజలు వేర్వేరు రంగుల చర్మం కలిగి ఉంటారు. 'తెల్లగా ఉండడమే అందం' అనే ఫెయిర్‌నెస్ క్రీమ్‌ల ప్రకటనలు మహిళల మనసుల్లో ఒక కాంప్లెక్స్‌ను పెంచుతాయి. చర్మం రంగు తక్కువగా ఉన్నవారు ఆత్మన్యూనతకు గురవుతారు" అని చెప్పారు. విశేషం ఏమిటంటే- పార్లమెంట్‌కు ఆమె ఠంచనుగా హాజరవుతారు. సభలో ఆమె హాజరు 92 శాతానికి పైనే! జాతీయ సగటు 79 శాతం కన్నా ఇది చాలా ఎక్కువ. అలాగే ఆమె సభలో వేసిన ప్రశ్నలు, పాల్గొన్న చర్చలు కూడా జాతీయ సగటు కన్నా ఎంతో హెచ్చు. "సభలో నేను ముందుగా రాసుకున్న దాన్ని ఎప్పుడూ చదవలేదు. అప్పటికప్పుడు మాట్లాడడాన్నే ఇష్టపడతాను. ఇక మాట్లాడే అంశాలంటారా, ఈ ప్రభుత్వ హయాంలో వాటికి కొరతే లేదు" అంటారు విప్లవ్.



### ఎవరు ద్రోహులు?

సీఏఏని వ్యతిరేకిస్తున్న వారు 'దేశద్రోహులు' అంటూ అధికార పార్టీ నాయకులు ప్రకటనలు, నెహ్రూ కోసమే దేశ విభజన జరిగిందని ప్రధాని మోదీ ఆరోపణల నేపథ్యంలో... రాజ్యసభలో తాజాగా చేసిన ప్రసంగంలో ప్రధానిపై నేరుగానే విమర్శలు సంధించారు విప్లవ్ ఠాకూర్. "ఈ ఆరేళ్ళలో మీరు చేసిందేమిటి? మీరు చేస్తున్నదల్లా దేశాన్ని విభజించే ప్రయత్నం... దేశాన్ని విడదీసే ప్రయత్నం మాత్రమే! ఇక 'ద్రోహి' అనే పదానికి నిర్వచనం ఏమిటో ఈ రోజు మాకు చెప్పాలి. 'ద్రోహి' అని ఎవరిని అంటారు? భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడాన్ని కమ్యూనిస్ట్ పార్టీ వ్యతిరేకించింది. నాలుగేళ్ళు నిషేధానికి గురైంది. కానీ నెహ్రూ, అప్పటి ప్రభుత్వం వాళ్ళను ద్రోహులు అనలేదు. నెహ్రూకు వ్యతిరేకంగా లోక్‌సభలో వాజ్‌పేయి మాట్లాడేవారు. ఆయనను ద్రోహి అని ఎవరూ అనలేదు. కానీ ఈ రోజు మీ ప్రధాన మంత్రికీ, మీ హోం మంత్రికీ, మీ విధానాలకూ వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్ళు ద్రోహులైపోతారు. వాళ్ళను పట్టుకుంటారు, జైల్లో పెడతారు. ఆరేళ్ళ పిల్లల్ని కూడా మీరు వదలడం లేదు. ఆరేళ్ళలో మీరు చేసినంతగా పాకిస్థాన్ నామ జపం డెబ్భై ఏళ్ళలో మేము ఎప్పుడూ చెయ్యలేదు. మీకు ఏ సందర్భం వచ్చినా పాకిస్థాన్ ప్రస్తావనే! మీరు (మోదీ) పాకిస్థాన్‌కు (నవాజ్ షరీఫ్ పుట్టినరోజు సందర్భంగా ఆకస్మికంగా) వెళ్ళి బిర్యానీ తిన్నారు. ఆహ్వానం లేకుండా వెళ్ళి వచ్చిన మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇక, కశ్మీర్ విషయంలో మాట్లాడే, తీర్మానం చేసే హక్కు యూరోపియన్ యూనియన్‌కు లేదని ఒకవైపు అంటారు. మరి వాళ్ళ ఎంపీలను ఆహ్వానించి, కశ్మీర్‌కు ఎందుకు తీసుకువెళ్ళారు? వాళ్ళను పిలిచి, జోక్యం చేసుకొనేలా చేసిందీ మీరే కానీ ఇతరులు కాదు కదా! ఈ దేశాన్ని విభజించకండి. సమైక్యంగా ఉంచండి. మనది లౌకికవాదం. మనం ధర్మాన్ని నమ్ముతాం. కానీ మీరు ఏ ధర్మం గురించి మాట్లాడుతున్నారు? ఏ రాముడి గురించి మాట్లాడుతున్నారు? ప్రజలలో వినిపించిన మాటలతో ఆయన సీతను అడవికి పంపాడు. (వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్న ప్రజలతో) మీరు కనీసం మాట్లాడడం కూడా లేదు. (అయోధ్యలో) ఆలయం కట్టండి, తప్పనిసరిగా కట్టాల్సిందే! కానీ రాముడి ఆదర్శాలను కూడా అనుసరించండి. వట్టి మాటలూ, ప్రసంగాలూ కట్టిపెట్టండి" అంటూ విరుచుకుపడ్డారు.

**సీఏ.. చార్టర్డ్ అకౌంటెన్సీ. వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆయా రంగాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల ప్రాముఖ్యం పెరిగింది. ఆకర్షణీయమైన వేతనాలతో సీఏలను రిక్రూట్ చేసుకోవడానికి జాతీయ, అంతర్జాతీయ, ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు పోటీపడుతున్నాయి. దీంతో ఈ కోర్సును చదవాలనుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సీఏలో ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్ అనే మూడు దశలు ఉంటాయి. ఇటీవల వెలువడిన ఫౌండేషన్ కోర్సు ఫలితాల్లో తెలుగు విద్యార్థులు జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. ఆ విద్యార్థుల సక్సెస్ స్టోరీ వారి మాటల్లోనే..**

# సీఏ ఫౌండేషన్‌లో మెరిసిన తెలుగు విద్యార్థులు

## ఎక్కువ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు చదివాను



**పొట్నూరు ప్రవంత్**
43వ ర్యాంక్

మాది శ్రీకాకుళం. నాన్న గోవిందరాజులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. 10వ తరగతిలో 9.7 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. ఇంటర్మీడియెట్ (ఎంపీసీ)లో 975 మార్కులు సాధించాను. మా మామయ్య శివ స్ఫూర్తితో సీఏలో చేరాను. సీఏ ఫౌండేషన్ కోర్సులో జాతీయ స్థాయిలో 43వ ర్యాంక్ వచ్చింది. సీఏ ఫౌండేషన్ కోసం ఎక్కువగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు చదివాను. ఇది చాలా ఉపయోగపడింది. సబ్జెక్టులలో మ్యాథ్స్‌కు అధిక సమయం కేటాయించాను. కోచింగ్ పూర్తయ్యాక చాలా రివిజన్ ఎగ్జామ్స్ రాశాను. అవి కఠినంగా ఉండేవి. దాంతో ఫైనల్ పరీక్ష పెద్ద కష్టంగా అనిపించలేదు. ప్రతి సబ్జెక్ట్‌ను కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా చదివాను. ఏ అంశాన్ని, సబ్జెక్ట్‌ను వాయిదా వేయకుండా ఎప్పుడు చదవాల్సింది అప్పుడే పూర్తి చేసేవాణ్ని. చదివేటప్పుడు ఏవైనా సందేహాలు ఉంటే ఫ్యాకల్టీ ద్వారా నివృత్తి చేసుకునే వాడిని. అకౌంట్స్‌కు సంబంధించిన అన్ని లెక్కలను ఒక నోట్ బుక్‌లో ప్రాక్టీస్ చేస్తూ సన్నద్ధమయ్యాను. సీఏ ఫౌండేషన్ చదువుతున్నప్పుడు ఏ రోజు కష్టంగా అనిపించలేదు. చాలా మంది భావిస్తున్నట్లు సీఏ కోర్సు అనుకున్నంత కష్టం కాదు. ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదివితే ఈ కోర్సు సులభమే అని చాలామంది వారి ఫలితాల ద్వారా నిరూపించారు.

## రివిజన్ ఎగ్జామ్స్ చాలా ఉపయోగపడ్డాయి



**ఆర్. తనయ్ నాయుడు**
38వ ర్యాంక్

మాది అమలాపురం. నాన్న మాచర సత్తిరాజు చిన్న వ్యాపారి. మావయ్య శ్రీకాంత్ స్ఫూర్తితో 8వ తరగతిలోనే సీఏ చేయాలని నిర్ణయించుకున్నా. పదో తరగతిలో 10కి 10 పాయింట్లు వచ్చాయి. ఇంటర్మీడియెట్ (ఎంపీసీ)లో 959 మార్కులను సాధించాను. సీఏ ఫౌండేషన్ పెద్ద కష్టమేమీ కాదు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ర్యాంక్ తెచ్చుకోవచ్చు అనే నమ్మకం ఉండేది. అదే నిజమైంది. సీఏ ఫౌండేషన్ కోర్సులో జాతీయ స్థాయిలో 38వ ర్యాంక్ వచ్చింది. లా సబ్జెక్ట్ కొద్దిగా కష్టంగా అనిపించేది. దాంతో దానికి ఎక్కువ సమయం కేటాయించాను. ఐసీఏఐ స్టడీ మెటీరియల్, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ క్షుణ్నంగా చదివాను. రివిజన్ ఎగ్జామ్స్ చాలా ఉపయోగపడ్డాయి. చాలా మంది సీఏ కఠినమైన కోర్సు అనుకుంటారు. కాకపోతే పట్టుదల, కృషి, విశ్వాసంతో సీఏ కోర్సును పూర్తి చేయడం కష్టమేమీ కాదు.

## కష్టమైన సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం



**రెడ్డి భవాని**
50వ ర్యాంక్

మాది చిత్తూరు జిల్లా పుంగనూరు. నాన్న సుబ్రమణ్యం ఆచారి వ్యవసాయం చేస్తారు. 10వ తరగతిలో 10కి 10 పాయింట్లు వచ్చాయి. ఏడో తరగతి నుంచి నాన్న సీఏలో చేరమని ప్రోత్సహించేవారు. ఇంటర్మీడియెట్ (ఎంఈసీ)లో 958 మార్కులను సాధించాను. రోజుకు 9 - 10 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాను. కష్టమైన సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం తీసుకున్నాను. సిలబస్ పూర్తయిన తరవాత నిర్వహించిన రివిజన్ ఎగ్జామ్స్ సీఏ ఫౌండేషన్‌లో ర్యాంకు సాధనకు చాలా ఉపయోగపడ్డాయి. సీఏ ఫౌండేషన్ కోర్సులో జాతీయ స్థాయిలో 50వ ర్యాంక్ వచ్చింది. సిలబస్‌ను ఎక్కువ సార్లు రివిజన్ చేస్తే ర్యాంకు సాధించే అవకాశాలు అధికమవుతాయి. సీఏ కోర్సులో చేరాలనుకునే వారికి ఓర్పు, కష్టపడేతత్వం, స్వీయనియంత్రణ తప్పనిసరిగా ఉండాలి.

## మాక్ ఎగ్జామ్స్ ఉపకరించాయి



**కోలార్ వెంకటేశ్ హర్షవర్ధిని**
50వ ర్యాంకు

మాది అనంతపురం జిల్లా హిందూపురం. నాన్న వెంకటేశ్ వ్యాపారి. 10వ తరగతిలో 9.8 పాయింట్లు వచ్చాయి. ఇంటర్మీడియెట్ (ఎంఈసీ)లో 10కి 10 గ్రేడ్ పాయింట్లను సాధించాను. మొదట్లో మెడిసిన్ చేద్దామనుకున్నా. అయితే నాన్న సలహాతో సీఏలో చేరా. సీఏలో చేరిన మొదట్లో చాలా భయం ఉండేది. ఇన్‌స్టిట్యూట్ వారు క్లాస్‌లో గతంలో ర్యాంకులు సాధించిన వారి వీడియోలను ప్రదర్శించేవారు. ఇవి ఎంతో ప్రేరణనిచ్చాయి. దాంతో నాలో నమ్మకం పెరిగింది. ప్రణాళిక ప్రకారం సీఏ ఫౌండేషన్‌కు ప్రిపేర్ అయ్యాను. ఏరోజు అంశాలను ఆ రోజే చదివాను. మాక్ ఎగ్జామ్స్ రాయడం ఉపకరించింది. వాటి ఫలితాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా సీఏ ఫౌండేషన్ కోర్సులో జాతీయ స్థాయిలో 50వ ర్యాంక్ వచ్చింది. సబ్జెక్టులలో.. లా సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం కేటాయించా. రివిజన్ ఎగ్జామ్స్ అన్నీ రాశాను.
సీఏ ఫౌండేషన్ కోసం ప్రతి సబ్జెక్ట్‌ను ఒక వ్యూహం ప్రకారం చదివాను. వీకెండ్ ఎగ్జామ్స్‌లో వచ్చిన మార్కులను విశ్లేషించుకుంటూ ప్రిపేర్ అయ్యాను. రోజుకు 8 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాను. తరగతిలో పాఠాలు చెప్పేటప్పుడు ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకున్నాను. మొదట్లో అకౌంట్స్, మర్కంటైల్ లా కష్టంగా అనిపించేవి. ఐసీఏఐ వారి స్టడీ మెటీరియల్‌ను పూర్తిగా చదివా. ప్రతి అంశాన్ని, సబ్జెక్ట్‌ను వాయిదా వేయకుండా చదివాను.

## ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేకంగా నోట్స్



**కె. వెంకట సాయి**
43వ ర్యాంక్

మాది పశ్చిమ గోదావరి జిల్లా వల్లూరుపల్లి. నాన్న కోళ్ల సూర్యారావు వ్యవసాయం చేస్తుంటారు. 10వ తరగతిలో 9.8 పాయింట్లు వచ్చాయి. ఇంటర్మీడియెట్ (ఎంఈసీ)లో 965 మార్కులను సాధించాను. 8వ తరగతిలో ఉన్నప్పుడు మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మోహన్, యండమూరి వీరేంద్రనాథ్ మా స్కూల్‌కి వచ్చారు. అప్పుడు వారు సీఏ కెరీర్ గురించి వివరించారు. అదే స్ఫూర్తిగా సీఏ కోర్సులో చేరాను. కోచింగ్‌లో రోజు క్లాస్‌కు హాజరై నిబద్ధతతో సబ్జెక్ట్ వినేవాడిని. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్ లైన్‌బై లైన్ చదివాను. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేకంగా నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. రివిజన్ ఎగ్జామ్స్ చాలా ఉపకరించాయి. సీఏ ఫౌండేషన్‌లో జాతీయ స్థాయిలో 43వ ర్యాంక్ సాధించడానికి రివిజన్ ఎగ్జామ్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయి. పట్టుదల, కష్టపడేతత్వం, ప్రణాళిక ప్రకారం చదివితే సీఏ కోర్సును పూర్తి చేయడం సులభమే. సబ్జెక్ట్‌ను బట్టీపట్టకుండా కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా చదివితే సబ్జెక్ట్ త్వరగా వస్తుంది.

# ఉపాధ్యాయ కెరీర్‌కు మరో అర్హత.. సీటెట్



**దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి సాటి మరేదీ రాదని కచ్చితంగా చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ టీచర్ల భర్తీ కోసం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)కి హాజరు కావాలంటే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) లేదా సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్)లో నిర్దేశించిన విధంగా అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సీటెట్ - జూలై 2020 కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సీటెట్ పరీక్ష విధానం, సంబంధిత వివరాలను తెలుసుకుందాం..**

ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవాలనుకునే వారికి కొన్ని ప్రమాణాలు ఉండాలనే ఉద్దేశంతో టెట్ / సీటెట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఇందుకోసం రాష్ట్ర పరిధిలో టెట్, జాతీయ స్థాయిలో సీటెట్ ఉంటుంది. సీటెట్‌కు హాజరు విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. గతంలో క్వాలిఫై అయినవారు స్కోర్‌ను మరింత పెంచుకునేందుకు తిరిగి సీటెట్ పరీక్ష రాయొచ్చు. నూతన నిబంధనల మేరకు డిగ్రీతోపాటు బీఈడీ చేసిన అభ్యర్థులు ప్రైమరీ టీచర్ పోస్టుల (ఎస్‌జీటీ)కు పోటీపడొచ్చు. ఈ క్రమంలో సీటెట్ పేపర్-1 పరీక్ష రాయొచ్చు. మరోవైపు 6వ తరగతి నుంచి 8వ తరగతికి బోధించే టీచర్ పోస్టులకు డిగ్రీతోపాటు బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు, డిగ్రీతో డీఈడీ పూర్తయిన వారు, ఇంటర్మీడియెట్‌తో నాలుగేళ్ల బీఈఎల్ఈడీ పూర్తి చేసిన వారు లేదా ఫైనల్ ఇయర్ వారు, ఇంటర్మీడియెట్‌తో ఇంటిగ్రిటెడ్ బీఈడీ (బీఏబీఈడీ, బీఎస్సీ బీఈడీ) పూర్తి చేసిన వారంతా అర్హులే. వీరంతా సీటెట్ పేపర్-2కు హాజరు కావచ్చు. ఈ పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు.

### పరీక్ష విధానం

సీటెట్‌లో రెండు పేపర్లు.. పేపర్-1, పేపర్-2 ఉంటాయి. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే వారు పేపర్ - 1, 6 నుంచి 8వ తరగతి వరకు బోధించే వారు పేపర్-2ను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రతి పేపర్‌లో 150 ప్రశ్నలు, 150 మార్కులు ఉంటాయి. వీటికి 150 నిమిషాల్లో (2 గంటల 30 ని.) సమాధానాలను గుర్తించాలి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ / హిందీ మాధ్యమంలో ఉంటుంది.

- పేపర్-1లో అడిగే సబ్జెక్టులు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగీ (30 ప్రశ్నలు, 30 మార్కులు), లాంగ్వేజ్ - 1 (30 ప్రశ్నలు, 30 మార్కులు), లాంగ్వేజ్ - 2 (30 ప్రశ్నలు, 30 మార్కులు), మ్యాథమెటిక్స్ (30 ప్రశ్నలు, 30 మార్కులు), ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (30 ప్రశ్నలు, 30 మార్కులు).
- పేపర్-2లో అడిగే సబ్జెక్టులు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగీ (30 ప్రశ్నలు, 30 మార్కులు), లాంగ్వేజ్ - 1 (30 ప్రశ్నలు, 30 మార్కులు), లాంగ్వేజ్ - 2 (30 ప్రశ్నలు, 30 మార్కులు), మ్యాథమెటిక్స్ - సైన్స్ (60 ప్రశ్నలు, 60 మార్కులు) లేదా సోషల్ స్టడీస్ (60 ప్రశ్నలు, 60 మార్కులు).
- పేపర్-1, పేపర్-2లలో లాంగ్వేజ్ - 1, లాంగ్వేజ్ - 2 కింద తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గారో, గుజరాతీ, కన్నడ, తమిళం, ఖాసీ, మలయాళం, మణిపురి, మరాఠీ, మిజో, నేపాలీ, ఒరియా, పంజాబీ, టిబెటన్ భాషలు ఉన్నాయి. ఇందుల్లోంచి ఏవైనా రెండు భాషలను ఎంచుకోవచ్చు.
- పేపర్-2కు హాజరయ్యే మ్యాథమెటిక్స్ / బయో సైన్స్ / ఫిజికల్ సైన్స్ అభ్యర్థులు-మ్యాథమెటిక్స్ - సైన్స్ విభాగాన్ని ఎంచుకోవాలి.
- మ్యాథమెటిక్స్ - సైన్స్‌లో మొత్తం 60 ప్రశ్నల్లో మ్యాథ్స్ నుంచి 30 ప్రశ్నల్లో కంటెంట్ నుంచి 20, పెడగాగీ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. సైన్స్‌లోని 30 ప్రశ్నల్లో కంటెంట్ నుంచి 20, పెడగాగీ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. సోషల్ స్టడీస్‌లోని 60 ప్రశ్నల్లో 40 కంటెంట్ నుంచి (భూగోళశాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్థికశాస్త్రం), పెడగాగీ నుంచి 20 ప్రశ్నలు వస్తాయి.

### ప్రయోజనాలు

- రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టెట్‌తో పోల్చినప్పుడు మాధ్యమం మినహా సిలబస్, పరీక్ష విధానం దాదాపుగా ఒకే విధంగా ఉంటుంది. ఇందులో మెరుగైన మార్కులను సాధించడం ద్వారా టీఆర్‌టీతో భర్తీ చేసే ఉపాధ్యాయ పోస్టులకు పోటీపడే అర్హతను పొందొచ్చు.
- ఫలితాలు వెల్లడించినప్పటి నుంచి సీటెట్ స్కోర్ ఏడేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. సంబంధిత స్కోర్‌ను సూచించే సర్టిఫికెట్‌ను కూడా జారీ చేస్తారు.
- సీటెట్‌లో అర్హత సాధిస్తే రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా కెరీర్ ప్రారంభించవచ్చు.
- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయ సమితి, సెంట్రల్ టిబెటన్ స్కూల్స్, ఆర్మీ స్కూల్స్, కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే అన్ని రకాల పాఠశాలల్లో కెరీర్ ప్రారంభించాలంటే సీటెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి.
- సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలో పని చేయాలంటే సదరు టీచర్లు సీటెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- న్యూఢిల్లీ (ఎన్‌సీటీ పరిధి), కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ నియంత్రణలో ఉండే అన్ని పాఠశాలల్లో పనిచేయాలంటే సీటెట్‌లో అర్హత పొంది ఉండటం తప్పనిసరి.

### ముఖ్య సమాచారం

- అర్హత: పేపర్-1: 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ / తత్సమానంతోపాటు డీఈడీ / బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ / డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్) / బీఈడీ / తత్సమానం.
- పేపర్-2: 50 శాతం మార్కులతో డిగ్రీ / సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్‌తోపాటు బీఈడీ / బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) / డీఈడీ / తత్సమానం.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 24, 2020
- రాత పరీక్ష తేదీ: జూలై 5, 2020
- వెబ్‌సైట్: https://ctet.nic.in/

# చిట్టి

### విశేషం



## మోయలేని పుస్తకం!

రోజూ స్కూల్‌కు పుస్తకాల బ్యాగ్‌ను తీసుకెళుతుంటారు కదా! పది, పదిహేను పుస్తకాలున్నా మోసుకెళ్లిపోతుంటారు. అయితే హంగేరీలోని ఓ చిన్నగ్రామంలో ఉన్న ఒక పుస్తకాన్ని మాత్రం ఎవ్వరూ మోయలేరు? ఎందుకో తెలుసా? ఆ పుస్తకం బరువు 1,420 కేజీలు. అవును! మీరు చదివింది నిజమే. 346 పేజీలున్న ఈ పుస్తకాన్ని యంత్రంపై కాకుండా చేత్తో తయారుచేశారు. దీనికి ప్రపంచంలోనే చేత్తో తయారుచేసిన అతిపెద్ద పుస్తకంగా గుర్తింపు ఉంది. హంగేరీలోని సిన్‌పెట్రీ అనే చిన్న గ్రామంలో ఉందీ పుస్తకం. కాగితం తయారీదారులైన బెలా వర్గా, గాబర్ వర్గా అనే ఇద్దరు వ్యక్తులు ఈ పుస్తకాన్ని తయారుచేశారు. ఆ పుస్తకాన్ని స్థానికంగా ఉన్న పేపర్ మిల్లులో సందర్శకుల కోసం ప్రదర్శనకు ఉంచారు. ఇంతకీ... అతిపెద్ద పుస్తకంగా గుర్తింపు పొందిన ఈ బుక్‌లో ఏముందో తెలుసా? స్థానికంగా పెరిగే వృక్షాలు, జంతువుల సమాచారాన్ని ఇందులో బొమ్మలతో సహా పొందుపరిచారు.

### దారి కనుక్కోండి



### పోలికలు కనుక్కోండి?

ఇక్కడ తొమ్మిది బొమ్మలు ఉన్నాయి. వీటిలో ప్రతి మూడు బొమ్మల మధ్య అడ్డం, నిలువు, ఐ మూలగా ఉన్న పోలికలు కనుక్కోండి?



### పదాలు సరిచేయండి



x-yra
sela
ozo
beyfoard

### బొమ్మ గీయండి



### డైలీ సుడోకు - 282

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | | | | 3 | |
| 5 | | | | | | | 9 | 8 |
| 8 | | | 1 | | 3 | | | |
| | 5 | 6 | 2 | 3 | | | | |
| | | | 7 | | 4 | | | |
| | | | | 6 | 5 | 7 | 2 | |
| | | | 8 | | 2 | | | 1 |
| 6 | 4 | | | | | | | 7 |
| | 8 | | | | | 2 | | |

**సుడోకు- 281 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 1 | 5 | 4 | 6 | 7 | 9 | 2 | 3 |
| 7 | 9 | 3 | 2 | 5 | 1 | 4 | 6 | 8 |
| 6 | 2 | 4 | 9 | 8 | 3 | 5 | 1 | 7 |
| 4 | 3 | 9 | 6 | 7 | 5 | 2 | 8 | 1 |
| 2 | 7 | 8 | 3 | 1 | 9 | 6 | 5 | 4 |
| 1 | 5 | 6 | 8 | 4 | 2 | 7 | 3 | 9 |
| 3 | 6 | 7 | 1 | 2 | 4 | 8 | 9 | 5 |
| 9 | 4 | 2 | 5 | 3 | 8 | 1 | 7 | 6 |
| 5 | 8 | 1 | 7 | 9 | 6 | 3 | 4 | 2 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ వరుసలోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

# పవన్ తర్వాత చిరంజీవితో...


చిరంజీవి


హరీశ్ శంకర్

ఇప్పటివరకూ దర్శకుడు హరీశ్ శంకర్ ఏడు చిత్రాలు తెరకెక్కిస్తే... అందులో నాలుగు మెగా హీరోలవే! పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కించిన 'గబ్బర్ సింగ్' ఆయన ప్రయాణంలో మేలు మజిలీ. ఆ సినిమా కమర్షియల్ దర్శకుడిగా హరీశ్ శంకర్‌కు పెద్ద పేరు తీసుకొచ్చింది. ఇప్పుడు మరోసారి పవన్‌తో సినిమా చేయడానికి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. 'గబ్బర్ సింగ్' కాంబినేషన్‌లో చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పవన్ చేస్తున్న 'పింక్' రీమేక్, క్రిష్ చిత్రం పూర్తయిన తర్వాత హరీశ్ శంకర్ చిత్రం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత చిరంజీవితో హరీశ్ శంకర్ ఓ సినిమా చేయనున్నారు. ఇటీవల ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. పవన్‌తో చేయబోయే చిత్రకథ పూర్తి చేసిన ఆయన, ప్రస్తుతం చిరంజీవితో చేయబోయే చిత్రకథపై దృష్టి సారించారు! ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి ఓ చిత్రం చేస్తున్నారు. ఆ తర్వాత 'లూసిఫర్' రీమేక్‌లో నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. అది పూర్తయ్యే లోపు, పవన్ సినిమా పూర్తి చేసి చిరు చిత్రం కోసం హరీశ్ శంకర్ సిద్ధమవుతారని సమాచారం.

# 'గల్లీ బాయ్'కు 13 అవార్డులు


పూజా హెగ్డే


అలియా భట్

చిత్ర పరిశ్రమ ప్రతిష్టాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రధానోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. 65వ అవార్డ్ వేడుకకు ఈ ఏడాది అస్సోంలోని గువాహటిలో ఉన్న ఇందిరా గాంధీ అథ్లెటిక్ స్టేడియం వేదికైంది. బాలీవుడ్‌లో గత ఏడాది ఉత్తమ ప్రతిభ కనబర్చిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు అవార్డులు అందజేశారు. రణ్‌వీర్ సింగ్, అలియా భట్ జంటగా నటించిన 'గల్లీ బాయ్' సినిమా ఏకంగా 13 అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడిగా రణ్‌వీర్ సింగ్, ఉత్తమ నటిగా అలియాభట్, ఉత్తమ దర్శకురాలిగా జోయా అక్తర్ అవార్డులను గెలుచుకున్నారు. క్రిటిక్స్ కేటగిరీలో 'శాండ్ కీ ఆంఖ్' చిత్రానికిగానూ తాప్సీ, భూమి ఫడ్నేకర్, 'ఆర్టికల్ 15'కు ఆయుష్మాన్ ఖురానా బ్లాక్ లేడీ షీల్డ్‌ను అందుకున్నారు. దర్శక నిర్మాత రమేశ్ సిప్పీను జీవిత సాఫల్య పురస్కారం వరించింది. కరణ్‌జోహార్, నటుడు విక్కీ కౌశల్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మాధురీ దీక్షిత్, పూజా హెగ్డే, రణ్‌వీర్ సింగ్, కార్తీక్ ఆర్యన్ డ్యాన్సులతో అలరించారు.

**అందుకే కంగనాకు అవార్డ్ రాలేదు: రంగోలీ**

ఉత్తమ నటిగా అలియా భట్‌కు, డెబ్యూ హీరోయిన్‌గా అనన్యా పాండేకు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు వరించడం పట్ల కంగనా రనౌత్ సోదరి రంగోలీ చందేల్ ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. అలియా భట్, అనన్యా పాండే కన్నా ఉత్తమ ప్రతిభ కనబర్చిన నాయికలు బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎందరో ఉన్నారని ఆమె ట్వీట్ చేశారు. బాలీవుడ్ మూవీ మాఫియా గురించి కంగనా ఎన్నోసార్లు స్పందించిందనీ, అందుకే తనకు, తాను నటించిన చిత్రాలకు అవార్డులు ఇవ్వలేదని రంగోలీ ఆరోపించారు. "ఉత్తమ సహాయ నటిగా అనన్యా పాండే కన్నా 'పటాఖా' చిత్రంలో నటించిన రాధిక మదన్‌కు అవార్డు ఇచ్చి ఉంటే కొత్త టాలెంట్స్‌ను ప్రోత్సహించినట్లు ఉండేది. అలాగే 'మణికర్ణిక'లో ఝలకరిభాయ్ పాత్ర పోషించిన అంకితకు ఉత్తమ సహాయ నటిగా గుర్తించి ఉండాల్సింది" అని ఆమె పేర్కొన్నారు.


అనన్యా పాండే


తాప్సీ


మాధురీ దీక్షిత్, రణ్‌వీర్ సింగ్



ప్రేమికుల రోజున...

# తనతో డిన్నర్‌కి వెళ్లా!

\- రష్మిక



రష్మిక... చలాకీ అమ్మాయి! తెర మీద, తెర వెనుక... ఎక్కడున్నా హుషారుగా ఉంటారు. ఎటువంటి అరమరికలు లేకుండా మాట్లాడతారు. నితిన్‌కి జోడీగా ఆమె నటించిన చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ నిర్మాత. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రష్మిక చెప్పిన సంగతులు...

**నేను కుక్క బిస్కెట్లు తినను!**

"నేను ఒక్కసారి చిన్న ముక్క (కుక్క బిస్కెట్) తిన్నా. అయితే... నితిన్ చెప్తాడనుకోలేదు. అదంత వైరల్ అవుతుందనుకోలేదు. సాధారణంగా తిండి అనే కాదు, చాలా విషయాల్లో ప్రయోగాలు చేస్తా. అయితే... డాగ్ బిస్కెట్స్ తింటాననే అంశం మీద ఎన్నో ట్రోల్స్ వచ్చాయి. ప్లీజ్... ఆపేయండి! నేను కుక్క బిస్కెట్లు తినను."

**తనకు పెళ్లయ్యే వరకూ...**

"ప్రేమికుల రోజు ఉదయమే జిమ్‌కి వెళ్లొచ్చా. వృత్తిపరమైన పని ఒక్కటీ లేదు. ఇంటికి వెళ్లి రొమాంటిక్ సినిమా చూద్దామని హాలీవుడ్ సినిమా చూడడం మొదలుపెట్టా. 20 మినిట్స్ చూడలేకపోయా. ఎవరో కథ చెప్పడానికి వస్తే విన్నాను. నా వాలంటైన్ డే అంత బోరింగ్! రాత్రి నా ఫ్రెండ్, డిజైనర్ శ్రావ్య వర్మతో డిన్నర్‌కి వెళ్లా. మేం ఇద్దరం సింగిల్‌గా ఉన్నంతవరకూ కలిసి డిన్నర్‌కి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. గతేడాదీ ప్రేమికుల రోజున తనతో డిన్నర్‌కి వెళ్లా. ఈ ఏడాదీ వెళ్లా. వచ్చే కొన్నేళ్ల వరకూ... కనీసం తనకు పెళ్లయ్యేవరకూ తనతో కలిసి డిన్నర్‌కి వెళ్తా."

**వెంకీ... నేనూ సింగిల్**

"'భీష్మ'లో నా పేరు చైత్ర. భీష్మ ఆర్గానిక్స్ కంపెనీలో పని చేస్తా. సినిమా క్యాప్షన్ ఏమో... 'సింగిల్ ఫరెవర్'! కానీ, నితిన్ పెళ్లికి సిద్ధమవుతున్నారు. వెంకీ కుడుముల, నేనూ కూర్చుని 'మనమే సింగిల్' అనుకున్నాం. సినిమాలో అనంత నాగ్‌గారు భీష్మ! మా ఇద్దరిదీ కర్ణాటక కావడంతో మేం కన్నడలో మాట్లాడుకునే వాళ్లం. ఆయనతో నాలుగైదు రోజులు షూటింగ్ చేశానంతే!"

**మార్చిలో అల్లు అర్జున్‌తో...**

"అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందే సినిమా షూటింగులో మార్చిలో జాయిన్ అవుతా. డేట్స్ అడ్జస్ట్ చేయలేక హిందీ 'జెర్సీ' వదులుకున్నా."

**హీరో అయినా...పవన్ అభిమానే!**

"నేను కాలేజీలో ఉన్నప్పుడు 'అ.. ఆ' చూశా. చిత్రసీమలోకి వెళితే... అటువంటి సినిమా చేయాలనుకున్నా. ఇప్పుడు నితిన్‌తో చేశా. 'భీష్మ' సెట్‌లోకి వెళ్లినప్పుడు 'నితిన్ సీనియర్. చాలా సినిమాలు చేశారు. ఎలా ఉంటారో? అనుకున్నా. కానీ, ఆయన కాలేజీ బాయ్‌లా సరదాగా ఉన్నారు. దాంతో కంఫర్టబుల్‌గా షూటింగ్ చేశాం. మాటల మధ్యలో తాను చిన్నప్పట్నుంచీ పవన్‌కల్యాణ్ అభిమాని అని నితిన్ చెప్పారు. హీరో అయినా... పవన్ అభిమానిగా ఉండడం గ్రేట్."

**ఆవులు... బాతులు... కోళ్లు ఉన్నాయి!**

"కూర్గ్‌లోని మా ఇంటిలో ఆవులు, బాతులు, కోళ్లు ఉన్నాయి. మాకు వ్యవసాయ భూములు, కాఫీ తోటలూ ఉన్నాయి. నాకు వ్యవసాయం తెలుసు. 'భీష్మ'లో ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి వెంకీ కుడుముల బాగా చెప్పాడు. రైతు సమస్యలను, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని వాళ్ల సమస్యలను హృద్యంగా ఆవిష్కరించాడు. అలాగని, లెక్చర్లు ఇవ్వలేదు. ఇదొక ఫన్ ఫిల్మ్. మొదట ఈ కాన్సెప్ట్ గురించి స్నేహితులకు చెబితే... ఆసక్తి కనబరచలేదు. టీజర్ వచ్చాక బావుందన్నారు. తన జీవితంలో ఆర్గానిక్ ఫార్మింగ్ భాగమైన వ్యక్తి ప్రయాణమే ఈ సినిమా."

**నో చెప్పా...50 కథలకు!**

"ఇప్పుడు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే... 50, 60 కథలు రిజెక్ట్ చేశా. నాకు వచ్చిన కథల్లో మంచివి ఎంపిక చేసుకున్నా. కష్టపడ్డా. అంతే కానీ... అదృష్టం కాదు. ఇంతకు ముందు ఈ పాత్ర చేస్తే... కొత్తగా ఉంటుందా? లేదా? అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు విభిన్న పాత్రల కోసం చూస్తా."

**ఐటీవాళ్లకు ఏమీ దొరకలేదు!**

"మా ఇంటిపై ఐటీ రైడ్ జరిగిన మాట నిజమే. అధికారులు వచ్చారు. చూశారు. వాళ్లకు ఏమీ దొరకలేదు. కూర్గ్‌లో మా నాన్న వ్యాపారవేత్త. నేను సినిమాలు చేస్తున్నా. అందుకని, ఏదో ఊహించి వచ్చారేమో! దాని వల్ల నేను కూర్గ్ వెళ్లాల్సి వచ్చింది. నేను 'ఐటీ రైడా? ఎందుకు? ఏం లేదు కదా! ఏమైంది?' అని అడిగా."

## అటు మాసు... ఇటు క్లాసు!


రచితా రామ్, కల్యాణ్‌దేవ్

కల్యాణ్‌దేవ్, రచితా రామ్ జంటగా పులి వాసు దర్శకత్వంలో రిజ్వాన్, ఖుషి నిర్మిస్తున్న సినిమా 'సూపర్ మచ్చి'. టాకీ పార్ట్, రెండు పాటలను చిత్రీకరించారు. మార్చిలో గోవాలో రెండు పాటలను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ప్రేమకథ మిళితం చేసిన చక్కటి కుటుంబ కథా చిత్రమిది. అటు మాస్ ప్రేక్షకులతో పాటు ఇటు క్లాస్, కుటుంబ ప్రేక్షకులకు నచ్చే పాత్రలో కల్యాణ్ దేవ్ కనిపిస్తారు. హీరోకి మద్దతుగా నిలిచే పాత్రలో వీకే నరేశ్ నటించారు. ఆయనతో పాటు రాజేంద్రప్రసాద్ కాంబినేషన్‌లో హీరో సీన్లు నవ్విస్తాయి. తమన్ హిట్ పాటలు ఇచ్చారు. ఆడియో బ్లాక్‌బస్టర్ అవుతుంది" అన్నారు.

## విభిన్న కథతో...


నోయెల్

నోయెల్, రతన్, విశాఖ ప్రధాన పాత్రధారులుగా లక్ష్మీశ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం '14'. సుబ్బారావు రాయన, శివకృష్ణ నిచ్చెన మెట్ల నిర్మాతలు. ఇటీవల ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రాహుల్ సిప్లిగంజ్ విడుదల చేశారు. "విభిన్నమైన కథతో రూపొందుతున్న చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. '14' టైటిల్ వెనుక కథేంటి అనేది సినిమా చూస్తేనే అర్థమవుతుంది. చిత్రీకరణ తుది దశలో ఉంది" అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయినాథ్, సంగీతం: ఎర్త్ సౌండ్స్.

## చీమ సినిమా వేరు!


అమిత్, ఇందు

"మనుషుల్లో మంచి మనుషులు వేరు, చిన్న చిత్రాల్లో మా చీమ సినిమా వేరు. ఒక వెరైటీ, నావెల్టీ పాయింట్‌తో తెరకెక్కించాం. అదేంటో ఈ నెల 21న థియేటర్లలో చూడండి" అని దర్శకుడు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు అన్నారు. అమిత్, ఇందు జంటగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'చీమ ప్రేమ మధ్యలో భామ'. మాగ్నమ్ ఓపస్ ఫిల్మ్ పతాకంపై ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ నిర్మించారు. శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఈతరం యువతీయువకులు ప్రేమ విషయంలో ఎంత పరిణితితో ఉన్నారో చెప్పే చిత్రమిది. కాలం మారినా స్వచ్ఛమైన ప్రేమ మారలేదని చెప్పే ప్రయత్నమే మా సినిమా" అన్నారు. సుమన్, హరిత, రమ్య చౌదరి తదితరులు నటించిన ఈ చిత్రానికి రవి వర్మ సంగీత దర్శకుడు.

## ముగ్గురు అమ్మాయిలతో... పులిహోర కలిపెనులే!


సీరత్ కపూర్, సిద్ధూ జొన్నలగడ్డ

హీరో పేరు కృష్ణ. అతనిదో సమస్య! అదేంటంటే... మిగతా చిత్రాల్లో చూపించినట్టు వింత ఆరోగ్య సమస్య కాదు! ప్రేమ సమస్య!! అబ్బాయిగారు ముగ్గురు అమ్మాయిలను ప్రేమించాడు. పులిహోర బాగా కలిపాడు. తర్వాత ఏమైంది? అనేది సినిమాలో చూడమంటున్నారు రవికాంత్ పేరేపు. 'క్షణం' తర్వాత అతను దర్శకత్వం వహించిన చిత్రం 'కృష్ణ అండ్ హిజ్ లీల'. సిద్ధూ జొన్నలగడ్డ హీరో. శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, శాలినీ వడ్నికత్తి హీరోయిన్లు. దగ్గుబాటి రానా సమర్పణలో సురేశ్ ప్రొడక్షన్స్, వయాకామ్18 మోషన్ పిక్చర్స్ సంస్థలు నిర్మించాయి. ఇటీవల వెంకటేశ్ ఈ సినిమా టీజర్ విడుదల చేశారు. హేమచంద్ర రచించి పాడిన 'పులిహోర' ట్రాక్... టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "రాంగ్ టైమ్ రిలేషన్‌షిప్స్‌తో సతమతమయ్యే యువకుడి కథతో రూపొందిన చిత్రమిది. హీరో పాత్ర స్వభావాన్ని తెలిపే విధంగా హేమచంద్ర చక్కటి పాట రాసి, పాడాడు. శ్రీచరణ్ పాకాల మంచి సంగీతం అందించారు" అన్నారు. మే 1న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాణ సంస్థలు తెలిపాయి.

## ప్రేమ, పర్యవసానాలు..


నిఖిల్, సిమ్రన్ సానియా, ఉపేందర్

నిఖిల్ దేవాదుల, ఉపేందర్, సిమ్రాన్ సానియా కీలక పాత్రధారులుగా 15, 18, 24 ఏళ్ల వయసులలో ప్రేమ, దాని పర్యవసానాలు ఇతివృత్తంతో తెరకెక్కుతున్న చిత్రం '15-18-24'. మాడుపూరి కిరణ్ కుమార్ దర్శకత్వంలో స్రవంతి ప్రసాద్, కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా పోస్టర్‌ను మెహరీన్ ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే ప్రేమకథ ఇది. కథానుగుణంగా కులుమనాలి, గోవా, కేరళ, రామోజీ ఫిలింసిటీలోని పలు అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం. విజయ్ మాస్టర్ నేతృత్వంలో తీసిన భారీ యాక్సిడెంట్ సన్నివేశం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.






## పోటీని ఎదుర్కొనేందుకు మారుతీ సిద్ధం

న్యూఢిల్లీ: కొత్త కంపెనీల నుంచి పోటీని ఎదుర్కొనేందుకు మారుతీ సుజుకీ సిద్ధమతోంది. 'పోటీని ఎదుర్కొంటూనే, మార్కెట్ వాటా కాపాడుకోవడం మా లక్ష్యం' అని కంపెనీ ఎండీ, సీఈఓ కెనిచి అయుకవా అన్నారు. దక్షిణ కొరియా కార్ల దిగ్గజం కియాతోపాటు, చైనాకు చెందిన ఎంజీ మోటార్స్, గ్రేట్‌వాల్ మోటార్స్, హైమా ఆటోమొబైల్స్ వంటి కంపెనీలు త్వరలో భారత మార్కెట్లో ప్రవేశించబోతున్నాయి. ఈ నేపథ్యంలో అయుకవా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ప్రస్తుతం దేశీయ కార్ల మార్కెట్‌లో మారుతీకి 50.59 శాతం వాటా ఉంది. మారుతీకి పోటీ కొత్తేమీ కాదని అయుకవా అన్నారు. కొత్త మోడల్స్‌తోపాటు ఖాతాదారులతో సంబంధాలను పటిష్ఠం చేయడం ద్వారా మార్కెట్‌పై మరింత పట్టు సాధిస్తామన్నారు. ఇందుకోసం సేల్స్ అండ్ సర్వీస్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని కంపెనీ భావిస్తోంది.

# క్రమంగా ఐటీ మినహాయింపుల తగ్గింపు

**సరళమైన విధానం కోసమే ప్రత్యామ్నాయ శ్లాబ్‌ల ప్రతిపాదన**

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్నుకు సంబంధించి రెండో ప్రత్యామ్నాయ శ్లాబ్ విధానం ప్రతిపాదించడం పన్ను వ్యవస్థను మరింత సరళం చేసే ప్రక్రియలో భాగంగానే జరిగిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ ప్రతిపాదనలపై భిన్న వర్గాల్లో అపోహలు తొలగించేందుకు ప్రధాన నగరాల్లో నిర్వహిస్తున్న అవగాహనా సమావేశాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎలాంటి మినహాయింపులు లేని సరళమైన పన్ను విధానం అందుబాటులో తేవడానికి తాము కృషి చేస్తున్నట్టు చెప్పారు. అయితే మినహాయింపులు పూర్తిగా తొలగించేందుకు ఎలాంటి కాలపరిమితి పెట్టుకోలేదన్నారు. ఆ ప్రక్రియ అంతా అంచెలవారీగా జరుగుతుందని ఆమె వెల్లడించారు. రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే దీనిపై మరింతగా వివరణ ఇస్తూ క్రమక్రమంగా ఐటీ మినహాయింపులన్నీ తొలగించి పన్ను రేట్లు తగ్గించడం తమ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వానికి పన్ను రాబడులు పెరిగితే పన్ను శ్లాబ్‌లు మరింతగా తగ్గుతాయని, పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గుతుందని ఆయన అన్నారు.

### ఆరోగ్య వసతుల విస్తరణకే సెస్

విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై 5 శాతం సెస్ విధించడంపై వచ్చిన ప్రశ్నకు స్పందిస్తూ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వైద్య మౌలిక వసతులు నిర్మించడానికి ఆ నిధులు ఉపయోగిస్తామని, దేశీయంగా ఆ యంత్ర పరికరాల తయారీని ప్రోత్సహించడానికి కూడా ఆ చర్య దోహదపడుతందని ఆర్థిక మంత్రి అన్నారు. యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్లపై (ఏపీఐ) దిగుమతులపై ఫార్మా రంగం ఆధారనీయత తగ్గించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు ఏపీఐల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న మన దేశం తదుపరి ఆ స్థానం కోల్పోయిందంటూ తిరిగి ఆ స్థానం పొందేలా చర్యలు తీసుకోవాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. పెట్టుబడుల కొరతతో అల్లాడే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలను ఆదుకునేందుకు వారికి అదనపు వర్కింగ్ కాపిటల్ అందించే ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు.

### రేపు కరోనా వైరస్ ప్రభావంపై సమావేశం

వాణిజ్య రంగం పైన, మేక్ ఇన్ ఇండియా పైన కరోనా వైరస్ ప్రభావాన్ని సమీక్షించేందుకు ఆర్థిక శాఖ మంగళవారం సమావేశం ఏర్పాటు చేసింది. భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, ఈ కారణంగా చైనాలో కరోనా వైరస్ విజృంభణ వల్ల ఏర్పడిన పరిస్థితి భారత్ ఎగుమతులు విస్తరించడానికి మంచి అవకాశం అవుతుందని ఆర్థిక మంత్రి ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

వాణిజ్య ప్రతినిధులందరూ ఈ సమావేశంలో పాల్గొనవచ్చునని, ఒకవేళ రాలేని పరిస్థితి ఉంటే తమ అభిప్రాయాలు fmo@nic.inకు ఈ-మెయిల్ చేయాలని ఆమె సూచించారు.

### జిల్లా స్థాయిలో జీఎస్‌టీ అవగాహనా సదస్సులు

జీఎస్‌టీ విషయంలో ప్రభుత్వం ఎన్ని వివరణలు ఇచ్చినా ఇంకా ఎన్నో అనుమానాలు, అపోహలు ఉన్నాయని ఈ ప్రక్రియ ద్వారా తనకు అర్థమైందని, ఇక నుంచి జీఎస్‌టీ బృందం మొత్తం జిల్లా ప్రధాన కేంద్రాలకు తరలివెళ్లి ఎవరికి ఎలాంటి అపోహలున్నా తొలగించే ప్రయత్నం చేయాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియ రాష్ట్ర రాజధానుల స్థాయికే పరిమితమైందని, దాన్ని జిల్లా స్థాయిలకు కూడా చేర్చాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు జీఎస్‌టీలో అవసరమైన మార్పులు చేస్తూనే ఉన్నామని, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న సరళీకృత జీఎస్‌టీ విధానంలో మరిన్ని సాంకేతిక లోపాలు తొలగిపోతాయని ఆమె హామీ ఇచ్చారు. జీఎస్‌టీ విధానంలో ఉన్న ప్రతీ లోపాన్ని సవరించి దాన్ని ఒక ఆదర్శనీయమైన పన్ను విధానంగా మార్చాలన్నదే తమ లక్ష్యమని ఆమె చెప్పారు.

# రాష్ట్రాలపై ఎలాంటి వివక్ష లేదు

**ఆర్థిక సంఘం సిఫారసుల మేరకే నిధులు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆర్థిక సంఘం సిఫారసుల మేరకే రాష్ట్రాలకు పన్నుల్లో వాటా కేటాయింపు జరుగుతోందని, నిధుల తగ్గింపులకు సంబంధించిన నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిది కాదని నిర్మలా సీతారామన్ అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించడం లేదన్నదాంట్లో వాస్తవం లేదన్నారు. నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలకు స్పందిస్తూ ఏ రాష్ట్రం పట్ల ఎలాంటి వివక్షత లేదన్నారు. దేశంలో ఒక రాష్ట్రం తగ్గి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పెరిగాయని, ఆ కారణంగానే పన్నుల్లో రాష్ట్రాల వాటాను 42 శాతం నుంచి 41 శాతానికి తగ్గించి, ఆ మొత్తాన్ని కొత్త కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించినట్టు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం చేసిన సూచనలనే తాము పాటిస్తున్నామని చెప్పారు. పన్ను వసూళ్లలో మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న చర్చ వచ్చిందని, 15 ఆర్థిక సంఘం ఇందుకు సంబంధించిన సూచనలు కూడా చేస్తుందని తెలిపారు.

రాష్ట్రాలు తమకు రావాల్సిన నిధులు ఇవ్వాలని కోరడం కూడా సమంజసమేనన్నారు.

అన్ని రాష్ట్రాలు తమ వంతు వాటాను సమకూర్చుతూనే ఉన్నాయని, తాము ఏ రాష్ట్రాన్నీ తక్కువ చేసి చూడటం లేదని చెప్పారు. అన్ని రాష్ట్రాలతో సామరస్యంగా ఉండటమే తమ విధానమని చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గలేదన్నారు. ఈ పథకానికి డిమాండ్ ఆధారంగా నిధుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. డిమాండ్‌లో హెచ్చుతగ్గులు ఉంటాయంటూ డిమాండ్ పెరిగితే కేటాయింపులు కూడా పెరుగుతాయని చెప్పారు.

### సెస్ వసూళ్లు తగ్గడం వల్లనే..

జీఎస్‌టీ పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, జీఎస్‌టీ సెస్ వసూళ్ల తగ్గడం వల్లనే ఈ జాప్యం జరుగుతోందని ఆమె స్పష్టం చేశారు. ఇది తెలంగాణ సహా ఏ ఒక్క రాష్ట్రానికీ పరిమితం కాదని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని తాను పార్లమెంట్ లోనూ వెల్లడించినట్టు చెప్పారు. సెస్ వసూళ్లకు అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.

# 92శాతం మంది రిటర్న్‌ల దాఖలు

న్యూఢిల్లీ: రూ. 2 కోట్ల పైగా టర్నోవర్ ఉన్న పన్ను చెల్లింపుదారుల్లో 92 శాతం మంది 2017-18కి వార్షిక రిటర్నులను దాఖలు చేశారని జీఎస్‌టీ నెట్‌వర్క్ తెలిపింది. 2017, జూలై 1న జీఎస్‌టీ పన్ను మొదలైనప్పటి నుంచీ.. జీఎస్‌టీకింద నమోదైన వ్యాపారాలకు సంబంధించి జీఎస్‌టీఆర్-9, జీఎస్‌టీఆర్-9సీని దాఖలు చేయడం ఇదే తొలిసారి. భారీ పన్ను చెల్లింపుదారుల్లో 91.3 శాతం మంది తమ వార్షిక రిటర్నులను, 92.3 శాతంమంది జీఎస్‌టీఆర్-9సీని ఈ నెల 12 కల్లా దాఖలు చేశారని జీఎస్‌టీఎన్ వెల్లడించింది. రూ. 2కోట్ల వరకూ టర్నోవర్ ఉన్న పన్ను చెల్లింపుదారులకు వార్షిక రిటర్న్ దాఖలు ఆప్షనల్ కాగా.. ఆపై ఆదాయం ఉంటే మాత్రం కచ్చితంగా రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అటువంటి వారు మొదట జీఎస్‌టీఆర్-9ను, అనంతరం జీఎస్‌టీఆర్-9సీని ఫైల్ చేయాల్సి ఉంటుంది.

## రష్యాతో 'ఇంధన' బంధం

న్యూఢిల్లీ: ద్వైపాక్షిక ఇంధన బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని భారత-రష్యాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా దీర్ఘకాలిక ప్రాతిపదికపై రష్యా దూర ప్రాచ్యం నుంచి పెద్ద మొత్తంలో ముడి చమురు దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోంది. ఈ ఏడాది అక్టోబరులో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల మధ్య జరిగే శిఖరాగ్ర సదస్సులో ఈ మేరకు ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఢిల్లీలోని రష్యా రాయబార కార్యాలయవర్గాలు చెప్పాయి. ఈ సంవత్సరం భారత్‌కు 20 లక్షల టన్నుల ముడి చమురు సరఫరా చేసేందుకు రష్యా ఇటీవలే అంగీకరించింది. పశ్చిమాసియాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ఇతర దేశాల నుంచీ ముడి చమురు దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోంది.

## డీఎల్‌ఎఫ్ 2 వేల కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికం ముగిసేసరికి రూ. 4,866 కోట్లున్న నికర రుణాన్ని తగ్గించుకునేందుకై రూ. 2,000 కోట్లు సమీకరించాలని రియల్టీ సంస్థ డీఎల్‌ఎఫ్ యోచిస్తోంది. ఇప్పటికే ఉన్న లేదా నూతన భాగస్వాములకు భూముల్ని విక్రయించనుంది. ఈ మేరకు పెట్టుబడిదారుకు ప్రణాళికల్ని వివరించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 16వ తేదీకి.. | | విజయవాడ | 413 |
| హైదరాబాద్ | 401 | విశాఖపట్నం | 417 |
| 17వ తేదీకి.. | | వరంగల్ | 404 |
| చిత్తూరు | 448 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 413 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 54 | విజయవాడ | 60 |
| వరంగల్ | 54 | గుంటూరు | 60 |
| మహబూబ్‌నగర్ | 54 | ఒంగోలు | 62 |
| కరీంనగర్ | 55 | చిత్తూరు | 74 |
| కర్నూలు | 54 | నెల్లూరు | 74 |
| విశాఖపట్నం | 60 | అనంతపురం | 62 |
| గోదావరి | 54 | | |

# నేడు బకాయిలు చెల్లించనున్న టెల్కోలు!

**ఎంత చెల్లిస్తారనే దానిపై సస్పెన్స్**



న్యూఢిల్లీ: ఏజీఆర్ బకాయిలపై టెలికాం కంపెనీలు (టెల్కోలు) దారికొస్తున్నాయి. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, టాటా టెలిసర్వీసెస్ సోమవారం కొంత బకాయిలు చెల్లించే అవకాశం ఉందని సమాచారం. సుప్రీం కోర్టు ఆదేశం ప్రకారం ఈ కంపెనీలు టెలికాం శాఖ(డాట్)కు ఏజీఆర్ కింద రూ.1.47 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఇందులో ఎంత మొత్తాన్ని ఈ కంపెనీలు సోమవారం చెల్లిస్తాయనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ నెల 20కల్లా ఏజీఆర్ బకాయిల కింద రూ.10,000 కోట్లు చెల్లించేందుకు ఎయిర్‌టెల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆర్థిక కష్టాలు ఉన్నా తాము ఎంత చెల్లించాలనే విషయాన్ని లెక్కిస్తున్నట్టు వొడాఫోన్ ఐడియా ప్రకటించింది. ఈ నెల 14న సుప్రీం కోర్టు ఆదేశంతో ఈ గడువు ఇక ఎంత మాత్రం పొడిగించే అవకాశంలేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు పుట్టెడు ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలని కంపెనీలు ప్రశ్నిస్తున్నాయి. ఈ బకాయిలు చెల్లించి వచ్చే నెల 17న ఆయా కంపెనీల ఎండీలు, డైరెక్టర్లు కోర్టులో స్వయంగా హాజరు కావాలని సుప్రీం కోర్టు ఈ నెల 14న ఆదేశించింది. దీంతో ఈ గండం నుంచి ఎలా గట్టెక్కాలో టెల్కోలకు పాలుపోవడం లేదు.

### టీడీశాట్‌ను ఆశ్రయించనున్న నాన్-టెల్కోలు

మరోవైపు ఏజీఆర్ బకాయిలు చెల్లించేందుకు నాన్ టెలికాం కంపెనీలు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీనిపై టెలికాం వివాదాల పరిష్కారం మరియు అప్పిలేట్ ట్రైబ్యునల్ (టీడీశాట్)ను ఆశ్రయించాలని భావిస్తున్నాయి. దీనిపై ఈ వారమే టీడీశాట్‌ను ఆశ్రయిస్తామని ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్) సీఎండీ సుశీల్ చంద్ర మిశ్రా చెప్పారు. గత ఏడాది అక్టోబరు 24న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏజీఆర్ బకాయిలు చెల్లించాల్సి వస్తే ఓఐఎల్‌పై రూ.48,500 కోట్ల భారం పడుతుంది. పవర్‌గ్రిడ్, గెయిల్ ఇండియా వంటి నాన్-టెలికాం కంపెనీలూ ఇదే వైఖరితో ఉన్నట్టు సమాచారం. టెలికాం సేవలు తమ ప్రధాన వ్యాపారం కానందున, తమ మొత్తం ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఏజీఆర్ బకాయిలు లెక్కించడం సరికాదన్నది ఈ కంపెనీల వాదన.

## తగ్గిన బంగారం దిగుమతులు

**ఏప్రిల్-జనవరిలో రూ. 1.74 లక్షల కోట్లు**

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి కాలానికి గాను బంగారం దిగుమతులు దాదాపు 9 శాతం వరకు తగ్గి రూ.1.74 లక్షల కోట్లకు పడిపోయాయి. గత ఏడాది ఇదే కాలానికి బంగారం దిగుమతులు రూ. 1.9 లక్షల కోట్లుగా ఉన్నాయి. దిగుమతులు తగ్గడంతో భారత వాణిజ్య లోటు రూ.9.5 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఈ లోటు రూ. 11.6 లక్షల కోట్లుగా ఉంది. గత ఏడాది జూలై నుంచి బంగారం దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. అక్టోబరు, నవంబరులో మాత్రం కాస్త వృద్ధి కనిపించినా.. తిరిగి డిసెంబరులో 4 శాతం, ఈ ఏడాది జనవరిలో 31.5 శాతం మేర పడిపోయాయి. ఏడాదికి సుమారు 800 నుంచి 900 టన్నుల బంగారం దిగుమతి చేసుకుంటూ.. భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ద్రవ్య లోటుపై దిగుమతుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచింది. ఈ కారణంగా ఆభరణాల రంగంలోని వ్యాపారులు ఇతర దేశాలకు తమ వ్యాపారాలను మార్చుకుంటున్నారని పరిశ్రమవర్గాలంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి కాలానికి రత్నాభరణాల ఎగుమతులు రూ.1.79 లక్షల కోట్లకు తగ్గాయి.

## బీపీసీఎల్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం

**ఈ నెలాఖరులో ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు**



### ఇవీ ప్రత్యేకతలు

ప్రస్తుతం మన దేశ వార్షిక చమురు శుద్ధి సామర్థ్యం 24.94 కోట్ల టన్నులు. అందులో బీపీసీఎల్ వాటా 15 శాతం. పెట్రోలియం ఉత్పత్తుల రిటైల్ మార్కెట్‌లోనూ కంపెనీకి 21 శాతం వాటా ఉంది. దేశంలోని 250 విమాన ఇంధనం (ఏటీఎఫ్) డిపోల్లోనూ అయిదో వంతు బీపీసీఎల్‌వే. దీంతో సౌది ఆరామ్‌కోతో పాటు అనేక బహుళ జాతి ఆయిల్ కంపెనీలూ బీపీసీఎల్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీపీసీఎల్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన పత్రాలకు ఆర్థిక, పెట్రోలియం, న్యాయ, కంపెనీ వ్యవహారాలు, పెట్టుబడుల ఉపసంహరణ శాఖల మంత్రుల కమిటీ (ఐఎంజీ) ఆమోదం తెలిపింది. కొద్ది మంది మంత్రులతో కూడిన మరో మంత్రుల కమిటీ ఈ పత్రాలను ఆమోదించాల్సి ఉంది. త్వరలోనే ఈ పని పూర్తవుతుందని అంచనా. ఇవన్నీ పూర్తయితే ఈ నెలాఖరులోగా ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) బిడ్లు, ప్రాథమిక సమాచార అవగాహన (పీఐఎం) పత్రాలు జారీ చేస్తామని అధికార వర్గాలు చెప్పాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) పీఎస్‌యూల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.2.10 లక్షల కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం నెరవేరాలంటే బీపీసీఎల్ ప్రైవేటీకరణ తప్పనిసరి. బీపీసీఎల్‌లో ప్రభుత్వానికి 53.29 శాతం వాటా ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీ షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.03 లక్షల కోట్లు. ఈ లెక్కన 53.29 శాతం వాటా అమ్మకంతో ప్రభుత్వానికి రూ.54,000 కోట్ల వరకు సమకూరతాయి. ప్రభుత్వ వాటా కొనుగోలు చేసే కంపెనీ ఓపెన్ ఆఫర్ ద్వారా మరో 26 శాతం షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

## జోరు పెంచిన ఎఫ్‌పీఐలు

**ఫిబ్రవరిలో రూ.24,617 కోట్ల పెట్టుబడులు**



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ తర్వాత విదేశీ సంస్థాగత మదుపరు(ఎఫ్‌పీఐ)లు మళ్లీ భారత మార్కెట్‌లో పెట్టుబడుల జోరు పెంచాయి. ఈ నెల 3-14 మధ్యకాలంలో ఈ సంస్థలు, భారత క్యాపిటల్ మార్కెట్‌లో రూ.24,617 కోట్ల నికర పెట్టుబడులు పెట్టాయి. ఇందులో రూ.14,191 కోట్లు రుణ పత్రాల మార్కెట్‌లో, రూ.10,426 కోట్లు ఈక్విటీ మార్కెట్‌లో మదుపు చేశాయి. బడ్జెట్‌లో కంపెనీలపై డివిడెండ్ పంపిణీ పన్ను (డీడీటీ) తొలగించడం ఈ సంస్థలను బాగా ఆకర్షించింది. ద్రవ్య, పరపతి విధానానికి సంబంధించి సర్దుబాటు వైఖరి అవలంబిస్తామన్న ఆర్‌బీఐ వైఖరితో రుణ పత్రాల మార్కెట్‌లోనూ జోరు పెంచాయి.

### ఎంఎఫ్‌ల్లో తగ్గిన ఈక్విటీ పెట్టుబడులు

డిసెంబరు 2019తో ముగిసిన త్రైమాసికంలో ఈక్విటీ షేర్లలో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడులు తగ్గాయి. ఈ కాలానికి ఎంఎఫ్‌లు ఈక్విటీ మార్కెట్‌లో రూ.11,837 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశాయి. సెప్టెంబరు 2019తో ముగిసిన త్రైమాసికంలో నమోదైన రూ.23,874 కోట్లతో పోలిస్తే ఇది 50 శాతం తక్కువ. జీడీపీ వృద్ధి రేటు నీరసించడం, కంపెనీల షేర్ల విలువ అధికంగా ఉన్నాయనే భయాలు ఇందుకు ప్రధాన కారణం. అయితే డిసెంబరు, 2019తో ముగిసిన త్రైమాసికంలో ఎంఎఫ్‌ల ఈక్విటీ పెట్టుబడుల మొత్తం ఆరు శాతం పెరిగి రూ.7.7 లక్షల కోట్లకు చేరింది.

## టెక్ వ్యూ: నిరోధం 12250



వి. సుందర్ రాజా

నిఫ్టీ నెగిటివ్ ట్రెండ్‌లో ప్రారంభమై మైనర్ అప్‌ట్రెండ్ సాధించి 12250 వరకు వెళ్లినా శుక్రవారం రియాక్షకు గురయింది. ఈ స్వల్పకాలిక నిరోధం వద్ద నిలదొక్కుకోలేకపోవడం వల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. వారం మొత్తం నిఫ్టీ సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణిలోనే ట్రేడయి చివరికి గత వారం స్థాయిలోనే క్లోజయింది. కదలికలు గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమ పరిమితంగానే ఉన్నందు వల్ల ట్రెండ్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇంతకు ముందు ఆకస్మిక పునరుజ్జీవం సాధించి 600 పాయింట్లకు పైగా లాభపడినందు వల్ల కన్సాలిడేషన్ ట్రెండ్ కొనసాగింది. గత కొన్ని వారాలుగా అప్రమత్త అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. ప్రధాన నిరోధ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోతోంది. కొద్ది రోజుల పాటు మరింతగా ఆటుపోట్లు, కన్సాలిడేషన్‌కే ఆస్కారం ఉంది. అయితే వీక్లీ చార్టుల్లో గత రెండు వారాల్లో నిలకడ ధోరణి కనిపిస్తున్నందు వల్ల తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు సైతం లేదు.




**బుల్లిష్ స్థాయిలు:** మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయి 12160 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12250. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ అవకాశం ఉంటుంది.

**బేరిష్ స్థాయిలు:** కరెక్షన్‌లో పడితే మద్దతు స్థాయి 12000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ తప్పదు.

**బ్యాంక్ నిఫ్టీ:** బ్యాంక్ నిఫ్టీ 31000 వద్ద బలహీనంగా క్లోజయింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే కనీసం రెండు రోజుల పాటు ఈ స్థాయిలో నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 31500 కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత పురోగమించే ఆస్కారం ఉంటుంది.

**స్వల్పకాలిక వ్యూహం:** నిఫ్టీ 12150 కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక బై పొజిషన్లు శ్రేయస్కరం.

**పాటర్న్:** 12000 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు. 12250 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. మార్కెట్ మరోసారి 20, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది.

**టైమ్:** ఈ సూచి ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉంది.

**టాటా కెమికల్స్ (రూ.767) కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

| | | |
|---|---|---|
| రూ.770 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.800 | రెండో నిరోధం రూ.830 |
| రూ.750 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.725 | రెండో మద్దతు రూ.700 |

**సోమవారం స్థాయిలు**
నిరోధం: 12160, 12210
మద్దతు: 12060, 12000
www.sundartrends.in

## ఆస్ట్రో ట్రెండ్: 12300 పైన బుల్లిష్

**(ఫిబ్రవరి 17-21 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 12113 (+15)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12256-11191 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 15 పాయింట్ల లాభంతో 12113 వద్ద పాజిటివ్‌గా ముగిసింది.

- జనవరి 27-31 తేదీల నడుమ ఏర్పడిన పరిధి 12217-11946. ఇది మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 12165, 12130, 11932, 11675 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం 100, 200 డిఎంఏలకన్నా పైన ఉంది. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌ను సూచిస్తోంది. ఈ వారాంతంలో 12300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి : 12300** **బ్రేక్‌డౌన్ స్థాయి : 11900**

**నిరోధ స్థాయిలు : 12250, 12325 (12185 పైన బుల్లిష్)**

**మద్దతు స్థాయిలు : 12050, 11875 (12025 దిగువన బేరిష్)**

**ఇన్వెస్టర్లకు సూచన...**

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**గ్రహగతులు**

- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2 నుంచి తులలోని ఉత్తరాషాఢ పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- కుంభంలోని ధనిష్ఠ పాదం 4 నుంచి శతభిషం పాదం 1 మధ్యలో రవి సంచారం
- కుంభంలోని శతభిషం పాదం 3-4 మధ్యలో బుధ సంచారం
- మీనంలోని రేవతి పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- ధనుస్సులోని మూల పాదం 2-3 మధ్యలో కుజ సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో మకర నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3-4 మధ్యలో వృశ్చిక నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 2లో రాహువు, ధనుస్సులోని మూల పాదం 4లో కేతువు సంచారం

### మిడ్ సెషన్ మెరుగు (సోమవారానికి)

**తిథి :** మాఘ బహుళ నవమి **నక్షత్రం :** జ్యేష్ఠ

**అప్రమత్తం :** కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు :** 10.54

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 2.20 వరకు మెరుగ్గా నిలిచి తదుపరి చివరి వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12155, 12190**

**మద్దతు స్థాయిలు : 12075, 12040**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి

## గూగుల్.. ఏ ఎండకు ఆ గొడుగు!




ఇది గూగుల్‌లో కనిపిస్తున్న జమ్మూకశ్మీర్ పటం. మన దేశం నుంచి గూగుల్‌లో వెతికితే జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగానే కనిపిస్తోంది. అదే పాకిస్థాన్ సహా ఇతర దేశాల నుంచి గూగుల్‌లో సెర్చ్ చేస్తే జమ్మూకశ్మీర్ సరిహద్దును 'చుక్క'లతో చూపించారు. అంటే విదేశీయుల దృష్టిలో ఇది 'వివాదాస్పద' ప్రాంతం. గూగుల్ ద్వంద్వ వైఖరిని అమెరికా పత్రిక ఒకటి బయట పెట్టింది. తాము ఏ దేశ వాదనలకు అనుగుణంగా ఆ దేశ సరిహద్దులను చూపిస్తామని గూగుల్ ప్రతినిధి తెలిపారు.

## ఎక్కడి నుంచైనా ఓటు వేయొచ్చు!!



▸▸ ఐఐటీ మద్రాస్-ఈసీ సంయుక్త భాగస్వామ్యంతో పరిశోధనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశంలో ఎక్కడి నుంచైనా ఓటువేసే వెసులుబాటును కల్పించే సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కసరత్తు చేస్తోంది. ఈ ప్రాజెక్టుపై ఐఐటీ మద్రాస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈసీ పరిశోధనలు జరుపుతోంది. ఇందుకు అధునాతన 'బ్లాక్ చైన్' టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ సందీప్ సక్సేనా వెల్లడించారు. 'ఒకవేళ ఈ పరిజ్ఞానం ఆచరణయోగ్యంగా ఉందని భావిస్తే.. ఓటర్ల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తాం. అనంతరం దాన్ని ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో చేర్చుతూ చట్టాల్లో మార్పులు చేస్తాం' అని చెప్పారు.

దేశంలో ఎక్కడి నుంచైనా ఓటు వేయదలిచిన వారు.. ఎక్కడైతే ఓటు వేయాలని అనుకుంటున్నారో అక్కడి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆమేరకు విజ్ఞప్తితో దరఖాస్తు చేసుకోవాలి. ఆపై అధికారులు నిర్దేశించిన పోలింగ్ స్టేషన్‌కు నిర్ణీత సమయంలోగా వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఈ క్రమంలో తొలుతగా 'టూ-వే బ్లాక్ చైన్ రిమోట్ పద్ధతిలో ఓటరు వ్యక్తిగత సమాచారం వాస్తవికమైందేనా? కాదా? అనేది నిర్ధారిస్తారు. ఇందుకోసం అత్యంత సురక్షితమైన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నెట్‌వర్క్(ఈఆర్‌ఓ-నెట్)కు చెందిన బయోమెట్రిక్, వెబ్ కెమెరాలను వినియోగిసా_రు. ఓటరు సమాచారం నిజమని తేలగానే అతడి పేరిట ఒక ఈ-బ్యాలట్(స్మార్ట్ కాంట్రాక్ట్) పేపర్ జారీ అవుతుంది. దీని ఆధారంగా ఓటు నమోదు చేసుకోగానే.. ఆ బ్యాలట్ వివరాలు ప్రత్యేక కోడ్‌లోకి మారుతాయి. ఈ ప్రక్రియను ఎన్‌క్రిప్షన్ అంటారు. ఇది జరిగిన వెంటనే ఒక బ్లాక్‌చైన్ హ్యాష్ ట్యాగ్ జనరేట్ అయి, సదరు ఓటరుకు చెందిన వాస్తవిక పోలింగ్ స్టేషన్‌కు బదిలీ అవుతుంది. ఫలితంగా అక్కడి అభ్యర్థి/రాజకీయ పార్టీ ఖాతాలో ఓటు జమవుతుంది.

## వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దు

▸▸ పార్టీ నేతల కట్టడిలో బీజేపీ అధిష్ఠానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఇప్పటికే ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, బిహార్ ఎన్నికలు ముందుండటంతో.. వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా తమ పార్టీ నేతలను కట్టడి చేయాలని బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు అధిష్ఠానం స్పష్టమైన సూచనలు చేస్తోంది. ముస్లింల విద్యా కేంద్రమైన దేవ్‌బంద్‌ను ఉగ్రవాద కేంద్రంగా అభివర్ణించినందుకు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా నోటీసులివ్వడం ఇందులో భాగమేనని అంటున్నారు.

## కాశీ మహాకాళ్ ఎక్స్‌ప్రెస్‌లో మహా శివుడికి సీటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: జ్యోతిర్లింగాలు కొలువైన ఓంకారేశ్వర్ (ఇండోర్), మహా కాళేశ్వర్ (ఉజ్జయిని), కాశీ విశ్వనాథ్ (వారాణసీ) మధ్య నడిచే కాశీ మహాకాళ్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం ప్రధాని మోదీ వారాణసీలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు ఐదో బోగీలో 64వ నంబరు సీటును మహా శివుడికి రిజర్వ్ చేయడం విశేషం. భక్తికొద్దీ ఇలా చేసినా.. దీనిని శాశ్వతంగా కొనసాగించే ఆలోచన ఉందని అధికారులు చెబుతున్నారు. మంద్రస్థాయిలో వినిపించే భక్తి సంగీతం, బోగీకి ఇద్దరు ప్రైవేటు గార్డుల రక్షణ, పూర్తి శాకాహార భోజనం తదితర ప్రత్యేకతలున్న ఈ ఏసీ రైలు వారాణసీ-ఇండోర్ మధ్య వారానికి మూడుసార్లు తిరుగుతుంది. ఇది ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడవనున్న మూడో కార్పొరేట్ రైలు.

## డిస్కమ్‌ల బకాయిలు.. రూ.88,177 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: తెలంగాణ, ఏపీ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లోని విద్యుదుత్పత్తి సంస్థలకు డిస్కమ్‌లు భారీగా బకాయి పడ్డాయి. 2019 డిసెంబరు నాటికి అవి రూ.88,177 కోట్లు పైనే చెల్లించాల్సి ఉంది. ఇందులో 25.45 శాతం స్వతంత్ర ఉత్పత్తిదారుల వాటానే ఉండటం గమనార్హం.

## యూపీలో యువతిపై పోలీసుల అత్యాచారం

గోరఖ్‌పూర్, ఫిబ్రవరి 16 : ఓ యువతి (20)పై ఇద్దరు పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో నాలుగు రోజుల క్రితం ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితులపై కేసు నమోదైంది.

## ప్రేమ వద్దన్నందుకు తల్లినే హతమార్చింది!

ఘజియాబాద్, ఫిబ్రవరి 16: తన ప్రేమకు అడ్డుపడినందుకు ఓ కూతురు (15) కన్న తల్లినే హతమార్చింది. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో తన ప్రియుడితో కలిసి పదో తరగతి విద్యార్థిని ఈ ఘాతుకానికి పాల్పడింది. హతురాలు శశిమాల (44) ఢిల్లీలో హెడ్ కానిస్టేబుల్. ఆమె కుమార్తె కొంతకాలంగా జితేంద్ర అనే అబ్బాయిని ప్రేమిస్తోంది. ఇందుకు శశిమాల అభ్యంతరం తెలిపింది. దీంతో ప్రియుడితో కలిసి తాడుతో ఆమె గొంతు బిగించి హత్య చేసింది.

## భీమ్ ఆర్మీ భారీ ర్యాలీ.. 23న భారత్ బంద్


భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పదోన్నతుల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పునకు నిరసనగా ఆదివారమిక్కడ భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీ మండీ హౌజ్ నుంచి జంతర్ మంతర్ వరకు సాగింది. ఈ నెల 23న భారత్ బంద్‌కు ఆజాద్ పిలుపునిచ్చారు.

## అనుమతి పొందాక ప్రదర్శన: నిరసనకారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 : అధికారుల నుంచి అనుమతి పొందాక పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో చర్చించడానికి ఆయన నివాసం వైపు ర్యాలీగా వెళ్తామని షాహీన్‌బాగ్ నిరసనకారులు తెలిపారు. ఆదివారం ప్రదర్శన నిర్వహిస్తామని ప్రకటించిన ఆందోళనకారులు.. పోలీసుల అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు.

## కేవీల్లో 5,949 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయాల్లో (కేవీ) 5,949 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దశలవారీగా వీటిని భర్తీ చేస్తున్నామని కేంద్ర మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంత్ వెల్లడించారు. దేశంలో మొత్తం 1225 కేవీలు ఉండగా, వీటికి మొత్తం 48,236 టీచింగ్ పోస్టులు మంజూరు చేశామని, ఇందులో ఇంకా 5,949 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని రాజ్యసభకు మంత్రి తెలియజేశారు.

## దేశంలో మత సామరస్యం: వెంకయ్య



కోల్‌కతా, ఫిబ్రవరి 16: భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశం ప్రతీక అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. దేశంలో భిన్న భావాలు ఉన్నప్పటికీ అన్ని మతాలవారూ శాంతియుతంగా సామరస్యంతో జీవిస్తున్నారని తెలిపారు. ఆదివారం కోల్‌కతాలో రోటరీ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొరుగు దేశాలన్నింటితోనూ భారత్ సత్సంబంధాలను కోరుకుంటోందన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రపంచదేశాలన్నీ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. చట్టసభల సభ్యులు నిర్మాణాత్మక పద్ధతిలో చర్చలు జరపాలని సూచించారు. 'ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది. ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తాయి. సభ వాయిదా పడుతుంది' అంటూ చమత్కరించారు. మాతృభాషను మరువకూడదని యువతకు పిలుపునిచ్చారు.

## భార్యను ఏకే-47తో కాల్చి చంపిన పోలీసు

మోగా, ఫిబ్రవరి 16: పంజాబ్‌లో ఓ హెడ్‌కానిస్టేబుల్, తన భార్యను తన ఏకే-47 సర్వీసు రైఫిల్‌తో కాల్చి చంపాడు. అదే తుపాకీతో అత్తింటి తరఫువారిలో మరో ముగ్గురిపై కాల్పులు జరిపి హత్యచేశాడు. అత్తింటివారితో గొడవకు దిగి.. విచక్షణ కోల్పోయిన కుల్విందర్ సింగ్ (54) అనే హెడ్ కానిస్టేబుల్ పాల్పడిన దాష్టీకమిది. ఈ ఘటనలో సింగ్ భార్య రజ్విందర్ కౌర్ (47), అత్త సత్వీందర్ (65), బావమరిది జస్కర్మ్ (40), మరదలు ఉపీంద్రజిత్ (32) మృతిచెందారు. 10ఏళ్ల బాలికకు గాయాలయ్యాయి.

## దేశద్రోహ కేసులో కశ్మీర్ విద్యార్థులకు బెయిల్

బెంగళూరు, ఫిబ్రవరి 16 : దేశద్రోహ కేసులో హుబ్బళ్లిలో అరెస్టయిన ముగ్గురు కశ్మీరీ విద్యార్థులకు బెయిల్ లభించింది. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆ విద్యార్థులు.. సోషల్ మీడియాలో పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. పుల్వామా ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరులను కీర్తించడంతో వారిని అరెస్టు చేశారు.

## మహారాష్ట్రలో బీజేపీ ఒంటరి పోరు: నడ్డా

ముంబై, ఫిబ్రవరి 16: ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం 'అసహజ.. అవాస్తవమైనది'గా బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా అభివర్ణించారు. భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

# సీఏఏ, 370పై వెనక్కి తగ్గం

(మొదటిపేజీ తరువాయి)

వేగంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. 67 ఎకరాల భూమిని ట్రస్టుకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం వారాణసీలో ప్రధాని పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో రూ.1254 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 50 ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దీంతోపాటు ఐఆర్‌సీటీసీకి చెందిన మహాకాళ్ ప్రైవేటు ఎక్స్‌ప్రెస్ రైలును వీడియో లింకు ద్వారా ప్రారంభించారు. ఈ రైలు దేశంలోని మూడు జ్యోతిర్లింగ క్షేత్రాలైన వారాణసీ, ఉజ్జయిని, ఓంకారేశ్వర్‌లను కలుపుతూ నడవనుంది. ఇక వారాణసీలో 430 పడకల సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రిని ప్రధాని ప్రారంభించారు. నియోజకవర్గంలో రూ.2500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

### ప్రజల వల్లే నమామి గంగా విజయవంతం

అంతకుముందు ప్రధాని వారాణసీలో అడుగు పెడుతూనే శ్రీ జగద్గురు విశ్వారాధ్య గురుకుల శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19 భాషల్లోకి అనువదించిన శ్రీ సిద్ధాంత్ శిఖామణి గ్రంథాన్ని, మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని డిజిటైజేషన్ చేయడం ద్వారా యువతకు అందుబాటులోకి తీసుకురావడం, వారిలో ప్రేరణ కలిగించడం శుభపరిణామమన్నారు. ఇక పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు, స్వచ్ఛభారత్ మిషన్‌ను దేశం నలుదిశగా వ్యాపింపజేసేందుకు కృషి చేస్తున్నవారిని ప్రధాని అభినందించారు. దేశ ప్రజలు భారత్‌లో తయారయ్యే వస్తువులనే ఉపయోగించాలని పిలుపునిచ్చారు. గంగానది ప్రక్షాళనకు చేపట్టిన నమామి గంగా ప్రాజెక్టు.. ప్రజల భాగస్వామ్యం వల్లే విజయవంతమయిందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు రూ.7 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్లు, మరో రూ.21 వేల విలువైన పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ హస్తకళా సంకుల్‌లో 'కాశీ ఏక్.. రూప్ అనేక్' పేరుతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, హస్తకళల ప్రదర్శనను ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఉత్తరప్రదేశ్ నలుమూలల నుంచి 10 వేల మందికి పైగా కళాకారులు రూపొందించిన వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్, కర్ణాటక సీఎం యడియూరప్ప పాల్గొన్నారు.


వారాణసీలోని జంగంవాడీ మఠంలో ప్రధాని మోదీని ఆశీర్వదిస్తున్న పూజారులు

### దీన్‌దయాళ్ విగ్రహం ఆవిష్కరణ

వారాణసీలో ఏర్పాటు చేసిన ఆరెస్సెస్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్మారక కేంద్రాన్ని, 63 అడుగుల పంచలోహ విగ్రహాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఆవిష్కరించారు. స్మారక కేంద్రాన్ని జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. దీన్‌దయాళ్ ఆత్మ మనల్ని ఎల్లప్పుడూ ప్రేరేపిస్తుందని, ఆయన మనకు అంత్యోదయ మార్గాన్ని చూపించారని మోదీ అన్నారు. సమాజంలో చిట్టచివర ఉన్నవారి అభివృద్ధే అంత్యోదయ అని, దీనిని ఆచరణలో చూపేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## 'కెమ్ చో' కాదు.. 'నమస్తే ట్రంప్'!

▸▸ మెగా ఈవెంట్ పేరు మార్చిన కేంద్రం



న్యూఢిల్లీ, వాషింగ్టన్, ఫిబ్రవరి 16: తొలిసారిగా భారత్‌కు విచ్చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన కోసం ప్రభుత్వం సిద్ధమవుతోంది. రెండు రోజుల పర్యటన కోసం ట్రంప్ ఈనెల 24న భారత్‌కు రానున్నారు. ఆయన రాక సందర్భంగా నిర్వహించనున్న మెగా ఈవెంట్ పేరును కేంద్రం 'నమస్తే.. ప్రెసిడెంట్ ట్రంప్'గా మార్చింది. టైమ్స్ ఆఫ్ ఇండియా కథన ప్రకారం అంతకు ముందు దీనికి 'కెమ్ చో ట్రంప్' అనే పేరు పెట్టారు. జాతీయ విధానంలో భాగంగా ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ట్రంప్ ఫిబ్రవరి 24న అహ్మదాబాద్‌కు విచ్చేస్తారు. అక్కడి నుంచి ఆయన టూర్ మొదలువుతుంది. ఈ సందర్భంగా భారీ రోడ్‌షో ఏర్పాటు చేయనున్నారు. అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి సబర్మతీ ఆశ్రమం వరకూ.. ఆ తర్వాత ఇందిరా బ్రిడ్జ్ మీదుగా మొతేరా స్టేడియం వర కూ మొత్తం 22 కిలోమీటర్ల మేర ఈ రోడ్ షో సాగుతుంది. అక్కడ కొత్తగా నిర్మించిన స్టేడియం ప్రారంభోత్సవం తర్వాత ప్రధాని మోదీ, ట్రంప్ మాట్లాడతారు.

### ఇండో-అమెరికా సంబంధం బలమైనది

భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధం బలమైనదని, ఇందులో ఎలాంటి సందేహం లేదని అమెరికా అత్యున్నత దౌత్యవేత్త అలీస్ వెల్స్ వెల్లడించారు.

## ఫడణవీస్ ఏదో దాచాలనుకున్నారు

▸▸ ఎల్గర్ పరిషత్ కేసుపై శరద్ పవార్



ముంబై, ఫిబ్రవరి 16: మహారాష్ట్రలోని గత ఫడణవీస్ ప్రభుత్వం 'ఏదో దాచాలని' అనుకున్నందునే ఎల్గర్ పరిషత్ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు కేంద్ర ప్రభుత్వం అప్పగించిందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ ఆరోపించారు. ఎల్గర్ పరిషత్ కేసును దర్యాప్తు చేసే హక్కు కేంద్రానికి ఉన్నా రాష్ట్ర అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

### సీఏఏపై పవార్‌తో అవగాహనా యుద్ధం: ఫడణవీస్

సీఏఏపై ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌తో తమ పార్టీ అవగాహనా యుద్ధాన్ని చేస్తోందని, రాజకీయ పోరాటంతోనే దానిని ఎదుర్కోవాల్సి ఉందని మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. ముంబైలోని బీజేపీ సదస్సులో ఆయన మాట్లాడారు. సీఏఏ ద్వారా కొన్ని నిర్దిష్ట వర్గాల పౌరసత్వం రద్దవుతుందనే తప్పుడు సమాచారంతో ఉద్దేశపూర్వకంగానే గందరగోళాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. శివసేనలో ధైర్యం మిగిలి ఉంటే సావర్కర్‌పై ఆరోపణలు చేస్తూ రాసిన కాంగ్రెస్ కథనాలను ప్రచురించిన షిదోరీ మేగజైన్‌ను నిషేధించాలని ఫడణవీస్ డిమాండ్ చేశారు.

### మోదీ-షాలు అజేయులు కాదు: శివసేన ఎంపీ

ముంబై, ఫిబ్రవరి 16: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు అజేయులు కారని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అజేయంగా కనిపించిన బీజేపీ.. ఢిల్లీ ఎన్నికల్లో పేకమేడలా కూలిపోయిందని ఆయన పేర్కొన్నారు. కానీ మతానికి అర్థం దేశభక్తి కాదని చెప్పారు. మోదీ, కేజ్రీవాల్ ఇద్దరూ స్వార్థపరులేనని, మోదీకి భారీ స్థాయిలో అహంకారమని, దేశాన్ని మొత్తం జయించాలని కేజ్రీవాల్ కోరుకున్నా.. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత తన పరిమితులను గ్రహించారని శివసేన పత్రిక 'సామ్నా'లో ఆయన రాసిన కాలమ్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

# మోదీ ఆశీస్సులు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

కోవింద్.. సీఎంగా కేజ్రీవాల్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఢిల్లీ పీఠంపై వరుసగా మూడోసారి కొలువుదీరిన అనంతరం కేజ్రీవాల్.. 'భారత్ మాతా కీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. పాలన సాఫీగా సాగేందుకు కేంద్రంతో సామరస్యంతో సాగుతామని పేర్కొన్న ఆయన.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు కోరడం విశేషం. 'ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించాను. ఇతర పనుల కారణంగా ఆయన రాలేకపోవచ్చు. అందుకని ఈ వేదికపై నుంచి విజ్ఞప్తి చేస్తున్నా. ఢిల్లీ అభివృద్ధిలో మాకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ ఆశీర్వాదం కావాలి' అని అన్నారు. తనను ఢిల్లీ పుత్రుడిగా అభివర్ణించుకున్న కేజ్రీ.. ఎన్నికల ప్రచారంలో విమర్శలు చేసిన ప్రత్యర్థులను క్షమించినట్లుగా ప్రకటించారు. 'ఈ విజయం ఢిల్లీ వాసులందరిది. మీరు ఎవరికి ఓటు వేశారన్నది ఇక అప్రస్తుతం. మీరంతా నా కుటుంబ సభ్యులు. వివక్షకు తావు లేకుండా అందరికోసం పనిచేస్తా. నేను ఆప్ సీఎంనే కాదు. బీజేపీ సీఎంను. కాంగ్రెస్ సీఎంను. ప్రతిఒక్కరి సీఎంను కూడా' అని కేజ్రీ పేర్కొన్నారు. 'హమ్ హోంగే కామ్యాబ్ (మనం విజయం సాధిస్తాం) అని పాడుతూ ప్రసంగాన్ని ముగించారు. కేజ్రీవాల్‌ను ట్విటర్ ద్వారా అభినందించిన మోదీ.. ఐదేళ్ల పాలన దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. దీనికి.. 'ఢిల్లీని దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలిపేలా కలిసి పనిచేద్దామంటూ' కేజ్రీ ప్రతి జవాబిచ్చారు.


ఢిల్లీ సీఎంగా రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కేజ్రీవాల్

### ప్రత్యేక అతిథులుగా ఢిల్లీ 'నిర్మాతలు'

కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారానికి దాదాపు 50 మంది 'ఢిల్లీ నిర్మాతలు' ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. అయితే, వీరంతా నగర రోజువారీ కార్యకలాపాలతో జీవనం వెళ్లదీస్తున్న షబీనా నాజ్ (సామాజిక కార్యకర్త), లజ్వంతి (పారిశుధ్య కార్మికురాలు), అరుణ్ కుమార్, గీతా దేవి (బస్ మార్షల్స్), గజరాజ్ సింగ్ (కండక్టర్) వంటి అతి సామాన్యులు కావడం విశేషం. 'మినీ మఫ్లర్ మ్యాన్' అవ్యాన్ తోమర్ (4) కూడా తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నాడు.

## మాంద్యంతో ఉద్యోగిని తొలగిస్తే .. 9 నెలల భరోసా ఇవ్వాలి

▸▸ రాజ్యసభలో ప్రయివేటు బిల్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఆర్థిక మాంద్యం, యజమాని దివాళా తదితర కారణాలతో ఉద్యోగులను తొలగించాల్సి వస్తే వారికి కనీసం 9 నెలల గడువు కల్పించేలా చట్టంలో మార్పులు చేయనున్నారు. ఈ మేరకు బీజేపీ ఎంపీ రాకేశ్ సిన్హా ఓ ప్రైవేటు మెంబర్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ తొలిదశ సమావేశాల్లోనే ప్రవేశపెట్టిన ది టెర్మినేటెడ్ ఎంప్లాయీస్(వెల్ఫేర్) బిల్లు-2020 ప్రకారం.. మాంద్యం, యజమాని దివాళా, సంస్థలో సాంకేతిక మార్పులు, కోర్టు ఆదేశం తదితర కారణాలతో ఎవరినైనా ఉద్యోగం నుంచి తొలగించాల్సి వస్తే కనీసం 9 నెలలు లేదా మరోచోట ఉద్యోగం లభించే వరకు(ఏది ముందు జరిగితే అది) వారికి నిరుద్యోగ ప్రయోజనాలు కల్పించాల్సి ఉంటుంది.

## రాజీనామాకు సిద్ధపడ్డ మన్మోహన్

▸▸ రాహుల్ నాన్‌సెన్స్ వ్యాఖ్యలపై అహ్లూవాలియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా 2013లో రాహుల్‌గాంధీ చేసిన 'నాన్‌సెన్స్ ఆర్డినెన్స్' వ్యాఖ్యలతో యూపీఏలో దుమారం రేగినప్పుడు... ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజీనామాకు సిద్ధపడినట్లు ప్రణాళికాసంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లూవాలియా చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరస్థులుగా రుజువైనప్పుడు... సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే.. ఆ తీర్పును హైకోర్టులో మూడు నెలల్లో సవాలు చేయడం ద్వారా వారు ఆ పదవుల్లో కొనసాగేలా యూపీఏ ప్రభుత్వం అప్పట్లో ఆర్డినెన్స్ తెచ్చింది. 'ఆ సమయంలో ప్రధాని మన్మోహన్‌తోపాటు నేను కూడా అమెరికా పర్యటనలో ఉన్నాను. రాజీనామా చేయాలా అని నన్ను అడిగారు' అని అహ్లూవాలియా అన్నారు. దీన్ని 'బ్యాక్ స్టేజ్ : ఏ స్టోరీ బిహైండ్ ఇండియాస్ హైగ్రోత్ ఇయర్స్' అనే తన పుస్తకంలో ప్రస్తావించారు.

# 69వేల మందికి కరోనా

▸▸ 1655 మంది మృతి.. 28 దేశాలకు వ్యాప్తి

▸▸ భారతీయులకూ కొవిడ్-19 నెగెటివ్

న్యూఢిల్లీ, బీజింగ్, ఫిబ్రవరి 16: కొవిడ్-19 వైరస్ కేవలం నెలన్నర వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా 69 వేల మందికి సోకింది. అందులో 68500 మంది బాధితులు ఒక్క చైనాలోనే ఉన్నారు. మిగతా 500 మంది 28 దేశాల్లో కొవిడ్-19 బారిన పడ్డారు. ఆ 500 మందిలో 355 మంది జపాన్ తీరంలో నిలిచి ఉన్న 'డైమండ్ ప్రిన్సెస్' నౌకలోని వారే. క్వారంటైన్‌గా మార్చిన ఆ నౌకలో తాజాగా మరో ఇద్దరు భారతీయులకు ఆ వైరస్ సోకింది. దీంతో 138 మంది భారతీయులున్న ఆ నౌకలో ఇప్పటిదాకా ఐదుగురు ఆ వైరస్ బారిన పడినట్టయింది. నౌకలో ఉన్న భారతీయుల్లో.. కొవిడ్ నెగెటివ్ వచ్చినవాందరినీ మన దేశానికి చేర్చడానికి అవసరమైన సాయం చేస్తామని టోక్యోలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఇక.. చైనాలో ఇప్పటిదాకా 1665 మంది ఈ వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. కాగా కొద్దిరోజుల క్రితం వూహాన్ నుంచి భారత్‌కు తరలించి ఐటీబీపీ క్వారంటైన్‌లో ఉంచి 406 మంది భారతీయులకూ కొవిడ్-19 పరీక్ష నెగెటివ్ వచ్చింది. కరోనా గురించి ప్రపంచానికి తెలిపిన ఇద్దరు 'సిటిజన్ జర్నలిస్టు'లు కనిపించకుండా పోయారు. వారి పేర్లు.. ఫాంగ్ బిన్, చెన్ క్విషి.



### మాంసాహారులపై కోపావతారమే కరోనా

మాంసం తినేవారిపై దేవుడు ధరించిన కోపావతారమే కరోనా (కొవిడ్-19) వైరస్ అని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్యక్షుడు స్వామి చక్రపాణి అన్నారు. "కరోనా.. వైరస్ కాదు. అది మూగజీవాలను కాపాడే అవతారం. అవి మనకు మృత్యుసందేశాన్ని ఇవ్వడానికి, మూగజీవాలను తినేవారికి శిక్ష వేయడానికి వచ్చాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.

### కరోనా లక్షణాలతో ముగ్గురు గాంధీలో చేరిక

జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉండడంతో.. కొవిడ్-19 భయంతో ముగ్గురు వ్యక్తులు ఆదివారం గాంధీ ఆస్పత్రిలో చేరారు. వారిని ఐసోలేషన్‌లో ఉంచిన వైద్యులు.. రక్తనమూనాలను సేకరించి పరీక్షకు పంపారు.



జామియా వర్సిటీ లైబ్రరీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి వీడియో ఫుటేజీ

## నెట్‌లో జామియా దాడి వీడియో

▸▸ విడుదల చేసిన కో-ఆర్డినేషన్ కమిటీ

▸▸ లైబ్రరీలో లచదువుకుంటున్న విద్యార్థులపై పారామిలటరీ లాఠీచార్జి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: జామియా మిలియా ఇస్లామియా వర్సిటీలో రెండు నెలల క్రితం విద్యార్థులపై పారామిలటరీ పోలీసుల దాడికి సంబంధించిన వీడియో బయటపడింది. 48 సెకన్ల నిడివిగల ఈ వీడియోను జామియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆదివారం ట్విటర్‌లో పోస్ట్ చేసింది. క్యాంపస్‌లోని ఓల్డ్ రీడింగ్ హాల్లో విద్యార్థులు చదువుకుంటుండగా లోపలికి చొచ్చుకువచ్చిన పోలీసులు విద్యార్థులపై లాఠీలు ఝుళిపించారు. డిసెంబరు 15న జరిగిన ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ఆ రోజే వివరణ ఇచ్చారు. జామియా క్యాంపస్ వద్ద సీఏఏకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులు, పోలీసులపై రాళ్లు రువ్వి తప్పించుకునేందుకు వర్సిటీలోకి పరుగులు తీశారని, వారిని అదుపులోకి తీసుకునేందుకే తాము లోపలికి ప్రవేశించామని చెప్పారు. ఘటనపై వెలువడిన తాజా వీడియో తమ దృష్టికి వచ్చిందని, దర్యాప్తులో భాగంగా దీనిపైనా విచారణ చేస్తామని స్పెషల్ సీపీ (ఇంటెలిజన్స్) ప్రవీణ్ రంజన్ తెలిపారు. దాడి ఘటనపై విచారణ జరుపుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కు ఈ వీడియోను యూనివర్సిటీ వర్గాలు పంపాయని వెల్లడించింది. అయితే ఈ వీడియోను తాము విడుదల చేయలేదని జామియా ఇస్లామియా వర్సిటీ స్పష్టం చేసింది. మరోవైపు విద్యార్థులపై దాడికి సంబంధించిన ఈ వీడియోను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ట్విటర్‌లో షేర్ చేశారు. 'లాఠీ దెబ్బల నుంచి తప్పించుకునేందుకు ఓ విద్యార్థి ముఖానికి పుస్తకం అడ్డుగా పెట్టుకున్నా ఢిల్లీ పోలీసులు బ్యాటన్లతో విరుచుకుపడ్డారు' అని ట్వీట్ చేశారు. లైబ్రరీలోకి కొందరు విద్యార్థులు ఆదరబాదరగా ప్రవేశిస్తున్న దృశ్యాలు.. ఓ విద్యార్థి మాస్క్ ధరించిన దృశ్యాలు వీడియోలో ఉన్నాయని పలువురు నెటిజన్లు వ్యాఖ్యానించారు. పోలీసులపై రాళ్లు రువ్వి తప్పించుకున్న వాళ్లే లైబ్రరీలో కూర్చొని ఉండొచ్చనే సందేహం వ్యక్తం చేశారు.



# తిరుమలకు లైట్‌మెట్రో!

- తెరపైకి నూతన ప్రతిపాదన
- హైదరాబాద్ మెట్రో ఎండీతో టీటీడీ చైర్మన్ చర్చలు
- పరిశీలించి నివేదిక ఇవ్వాలని వినతి

తిరుమల, ఫిబ్రవరి 16: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల క్షేత్రానికి లైట్‌మెట్రో ఏర్పాటు చేస్తే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్న నూతన ప్రతిపాదన తెరపైకి వచ్చింది. శ్రీవారి దర్శనార్థం లక్షలాది భక్తులు వస్తున్న తరుణంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా టీటీడీ ఈ తరహా ఆలోచన చేస్తోంది. ఇటీవల శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన హైదరాబాద్ మెట్రో రైల్వే ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మధ్య ఈ దిశగా పలు అంశాలు చర్చకు వచ్చాయి.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా!

పెరుగుతున్న రద్దీని దృష్టిలోపెట్టుకుని రవాణాపరంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండకూడదని టీటీడీ వివిధ రకాల ఆలోచనలు చేస్తోంది. తిరుమల కొండకు మెట్రో రైలు ఏర్పాటు అంశాన్ని సుబ్బారెడ్డి లేవనెత్తగా కొండల్లో మెట్రో రైలు మార్గం సాధ్యం కాదని తేల్చిచేస్తూనే లైట్‌మెట్రో భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి అభిప్రాయపడినట్లు తెలిసింది. తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్‌నుంచి శ్రీవారిమెట్ల మీదుగా తిరుమలకు లైట్ మెట్రో సౌకర్యవంతంగా ఉంటుందనే చర్చ జరిగింది. అలానే తిరుపతి విమానాశ్రయం నుంచి అమరరాజ సంస్థ మీదుగా పాపనాశనం ద్వారా తిరుమలకు కూడా లైట్ మెట్రో మార్గం సులభతరంగా ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. దీంతో.. లైట్ మెట్రో ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై పరిశీలించి తమకు నివేదిక ఇవ్వాలని సుబ్బారెడ్డి కోరారు. ఇదిలావుండగా, తిరుమల కొండకు గతంలో రోప్‌వే అంశం తెరపైకి రాగా... అది ఆగమశాస్త్ర విరుద్ధమనే వాదన అప్పట్లో బలంగా వినిపించడంతో ఆ ప్రతిపాదనపై వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. తాజాగా లైట్ మెట్రో ప్రతిపాదనపై ప్రభుత్వం, టీటీడీ బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయి? ఆగమపండితులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.





# పర్యాటకానికి 'కరోనా' దెబ్బ

- విదేశీ ప్రయాణాలు రద్దు
- వేసవి సీజన్ బుకింగ్స్ నిల్
- దారుణంగా పడిపోయిన వీసాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చైనా సహా పలు దేశాలను కుదిపేస్తున్న కరోనా వైరస్ పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. విదేశాలకు వెళ్లేవారు ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. వాస్తవానికి పర్యాటక రంగానికి విదేశీ ప్రయాణికులతోనే అధిక ఆదాయం వస్తుంది. ఇప్పుడు ఆ ప్రయాణాలు గణనీయంగా తగ్గిపోవడంతో తమ పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారిందని ట్రావెల్ ఏజెన్సీలు వాపోతున్నాయి. అదేవిధంగా ట్యాక్సుల రూపంలో ప్రభుత్వానికి కూడా ఆదాయం తగ్గిపోయింది. విశాఖ నుంచి సింగపూర్‌కి స్కూట్ ఎయిర్‌లైన్స్, మలేషియాకు ఎయిర్ ఏషియాలు వారానికి 4 రోజులు విమానాలు నడుపుతున్నాయి. ఎయిర్ ఇండియా విమానం దుబాయ్‌కి రోజూ నడుస్తోంది. విదేశీ ప్రయాణం చేసేవారంతా మూడు నెలల ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. కొన్ని నెలల ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకుంటాయి. కరోనా వైరస్ గురించి తెలిసిన నాటి నుంచి బుకింగ్స్ భారీగా పడిపోయాయి. విశాఖ నుంచి వెళ్లేవారే కాకుండా విదేశాల నుంచి వచ్చేవారి సంఖ్య కూడా తగ్గిపోయింది. చైనాను మినహాయిస్తే ఆసియా దేశాలైన జపాన్, తైవాన్, కాంబోడియా, సింగపూర్, మలేషియాల నుంచి వారానికి 100 నుంచి 150 మంది విదేశీ ప్రయాణికులు నగరానికి వస్తారు. ఇప్పుడు వారి సంఖ్య 20కి మించి ఉండడం లేదు. ఇండియా నుంచి సింగపూర్, మలేషియాలకు వెళ్లడానికి జారీచేసే వీసాల సంఖ్య కూడా దారుణంగా పడిపోయింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి సింగపూర్ ఎంబసీ వారానికి 40 వేల నుంచి 50 వేల వీసాలు జారీ చేస్తుంది. అదే మలేషియా ఎంబసీ అయితే 60 వేల నుంచి 70 వేల వీసాలు జారీ చేస్తుంది. గతవారం సింగపూర్‌కి 8 వేల కంటే ఎక్కువ వీసాలు ఇవ్వలేదని పర్యాటకవర్గాలు చెబుతున్నాయి. విశాఖ నుంచి విదేశాలకు వెళ్లేవారి సంఖ్య వారానికి 2 వేల వరకు ఉంటుంది. ఇప్పుడు ఆ సంఖ్య 200కి పడిపోయింది.

### హాలీడే ప్రకటించాలి

శ్రీకాకుళానికి చెందిన వాసవి క్లబ్ సభ్యులు మలేషియా వెళ్లడానికి టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. శనివారం బయల్దేరాల్సి ఉంది. కానీ, కరోనా భయంతో టిక్కెట్లు రద్దు చేసుకున్నారు. ఇలా రోజూ క్యాన్సిలేషన్లు తప్పితే బుకింగ్స్ ఉండడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పర్యాటక రంగానికి హాలీడే ప్రకటించాలి.

- పి.మురళీకృష్ణ, ఎండీ, ట్రావెల్ ఐక్యు



పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

# లాయర్లతోనే సమాజ ప్రక్షాళన

- న్యాయవాదులు రాజకీయాల్లోకి రావాలి
- మీ మేధస్సును పెట్టుబడిగా పెట్టండి: పవన్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో న్యాయవాదులు చాలా కీలక పాత్ర పోషించారని, ఇవాళ సమాజ ప్రక్షాళన కోసం న్యాయవాదులు అంతే బలంగా నిలబడాల్సిన అవసరం ఏర్పడిందని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం లీగల్ విభాగంతో ఆయన సమావేశమైయారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు రాజకీయాల్లోకి వస్తే తప్ప సమాజంలో మార్పు రాదని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, పటేల్ తదితరులను స్ఫూర్తిగా తీసుకొని సమాజహితం కోసం న్యాయవాదులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సామాన్యుడికి అండగా నిలవాలనే సదుద్దేశంతోనే జనసేన పార్టీని పెట్టినట్టు గుర్తుచేశారు. ఇవాళ ఓటమి తర్వాత కూడా పార్టీ బలంగా నిలబడిందంటే దానికి కారణం సామాన్యులేనన్నారు. చిన్న చిన్న పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బుల్లో సగం పార్టీ కోసం ఖర్చు చేసి బతికించారన్నారు. పార్టీకి అండగా ఉన్న వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటివారికి లీగల్ విభాగం రక్షణ కవచంలా మారాలని కోరారు. న్యాయం అందని సామాన్యుడి పక్షాన మనం అండగా నిలబడాలన్నారు. పార్టీ కోసం విలువైన కాలం, శ్రమ, మేధస్సును పెట్టుబడిగా పెట్టాలని కోరారు. "సినిమా హీరో అయ్యాక వేలకోట్లు సంపాదించి, మనవలు పుట్టిన తర్వాత రాజకీయాల్లోకి రాలేదు. సమాజానికి సేవ చేసే సత్తా ఉన్నప్పుడే రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాలు నా రిటైర్మెంట్ ప్లాన్ కాదు. అంబేడ్కర్ సేవలు ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చాను. డబ్బుంటే చాలు నాయకులు అయిపోవచ్చు అనుకుంటున్నారు. కానీ చదువుకున్న వాళ్లు, విజ్ఞత ఉన్న మీలాంటి వాళ్లు రాజకీయాల్లోకి వస్తే సమాజంలో ఎంతో కొంత మార్పు తీసుకురావచ్చు' అన్నారు.

### రాజంపేట ఇన్‌చార్జిగా వెంకటరమణ

కడప జిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మలిశెట్టి వెంకటరమణను పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ సందర్భంగా అధినేతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసి గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాటిచ్చారు.

# పరువు గంగపాలు!

(మొదటి పేజీ తరువాయి)

విఘాతం కలగకుండా చూడాల్సింది పోయి.. ఇలా ప్రవర్తిస్తే ఎలాగంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. సదరు కంపెనీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలని ఆదేశిస్తూ లేఖలు రాసింది.

### ఇదీ నేపథ్యం

పోలవరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా దాదాపు 150 మీటర్ల లోతులో డయాఫ్రమ్ వాల్ నిర్మించడానికి ప్రపంచంలో మూడు కంపెనీలకే సామర్థ్యం ఉందని జలవనరుల శాఖ ఇంజనీర్లు గుర్తించారు. వాటిలో జర్మనీకి చెందిన బావర్ కంపెనీ ముందంజలో ఉందని తేల్చారు. ఇదే విషయాన్ని అప్పటి ప్రధాన కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌స్ట్రాయ్‌కు వెల్లడించి, ఆ కంపెనీతో ఒప్పందం చేసుకోవాలని సూచించారు. దీంతో బావర్ కంపెనీ, ఎల్ అండ్ టీతో ఒప్పందం చేసుకున్నారు. డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించేందుకు అవి ట్రాన్స్‌స్ట్రాయ్‌తో సబ్‌కాంట్రాక్టు చేసుకున్నాయి. ఈ పనులకు సంబంధించి ప్రభుత్వం ట్రాన్స్‌స్ట్రాయ్‌కు బిల్లులు చెల్లిస్తుంటే అవి సకాలంలో బావర్‌కు చేరడం లేదు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించకపోతే పనులు నిలిపివేస్తామని ఆ కంపెనీ హెచ్చరించింది. దీంతో జలవనరులశాఖ ప్రత్యేకంగా ఎస్క్రో అకౌంట్‌ను తెరిచి, నేరుగా సబ్‌కాంట్రాక్టు సంస్థలకు చెల్లింపులు జరిపేలా ఒప్పందం చేసుకున్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి రూ.422కోట్ల అంచనా వ్యయంతో ఒప్పందం చేసుకున్నారు. బావర్ సంస్థ సకాలంలోనే పనులు పూర్తిచేసినా ఇంకా రూ.91.10కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదు. దీనిపై కంపెనీ ప్రతినిధులు పలుమార్లు జలవనరులశాఖకు వినతిపత్రాలు ఇచ్చారు. అయితే ప్రభుత్వం నుంచి చెల్లింపులపై వారికి ఎలాంటి హామీ లభించేదు. పైగా పాత కాంట్రాక్టు సంస్థలు అధిక మొత్తాలకు పనులు చేపట్టాయని, అందులో అవినీతి జరిగిందంటూ దర్యాప్తు కోసం కమిటీలు వేయడంతో ఆందోళనకు గురైన బావర్ యాజమాన్యం... ఏపీ ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదంటూ జర్మనీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి సమాచారం అందడంతో ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. పోలవరం ప్రాజెక్టులో బావర్ కంపెనీ చేపట్టిన పనులకు డబ్బులు ఇవ్వడం లేదంటూ గతేడాది అక్టోబరులో డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి రాజేంద్ర రత్నూకు జర్మనీ రాయబారి ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన డీపీఐఐటీ.. బావర్ కంపెనీకి బకాయిపడిన రూ.91.10కోట్లు వెంటనే చెల్లించాలంటూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రత్యేక రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్‌కు లేఖలు రాసింది. దీనిపై స్పందన లేకపోవడంతో ఈనెల 7న గత అంశాలను గుర్తుచేస్తూ బావర్ కంపెనీకి తక్షణమే బిల్లులు చెల్లించాలంటూ మళ్లీ లేఖ రాశారు. అయినా రాష్ట్రప్రభుత్వం మాత్రం నిధుల కొరతను సాకుగా చూపుతోంది. బావర్ కంపెనీకి ట్రాన్స్‌స్ట్రాయ్ ఎందుకు చెల్లించలేదో తమకు తెలియదంటోంది. బావర్, ట్రాన్స్‌స్ట్రాయ్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్ జరిగి ఎస్క్రో అకౌంట్ ఏర్పడిన విషయంపై మాత్రం స్పష్టమైన సమాధానం చెప్పలేకపోతోంది. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు రీయింబర్స్ చేస్తే ట్రాన్స్‌స్ట్రాయ్‌కు చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.91.10కోట్లు ఇస్తామని జలవనరులశాఖ చెబుతోంది. రీయింబర్స్ చేసిన రూ.1,780కోట్ల నుంచి ఎందుకు చెల్లించలేదన్న ప్రశ్నకూ సమాధానం లేదు.

### మెడ్‌టెక్‌లోనూ బకాయిలు

మెడ్‌టెక్ సిటీలో ఎలక్ట్రోమాగ్నటిక్ ఇంటర్‌ఫియరెన్స్ అండ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ, బయోమెడికల్ టెస్టింగ్ సేవలకు గాను జర్మన్ కంపెనీ టీయూవీ రీయిన్‌లాండ్‌తో 2017 జూన్ 16న రూ.86,85,00,000 చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇంకా రూ.29,41,33,731 చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించకపోగా, పనులు చేయకుండా తాత్కాలికంగా కంపెనీని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో టీయూవీ రీయిన్‌లాండ్ జర్మనీ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. ఈ అంశంపైనా డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శితో గత అక్టోబరులో జరిగిన భేటీలో జర్మనీ రాయబారి వివరించారు. ఈ బకాయిని కూడా వెంటనే చెల్లించాలంటూ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ, ఏపీ భవన్ ఆర్సీ ప్రవీణ్ ప్రకాశ్‌కు ఈనెల 7న డీపీఐఐటీ రాజేంద్ర రత్నూ లేఖ రాశారు. అయినా ఎలాంటి కదలికా లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ప్రభుత్వం మారినా అభివృద్ధి ఆగకూడదు: బీజేపీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అభివృద్ధి కుంటుపడకూడదని బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులో కేంద్రం అడిగిన ఆడిట్ వివరాలు అందిస్తే తదుపరి నిధులను కేంద్రం మంజూరు చేస్తుందని చెప్పారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. బీజేపీ మహిళా మోర్చ జాతీయ ఇన్‌చార్జి పురందేశ్వరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. రాజధాని సమస్య కేవలం 29 గ్రామాల సమస్య కాదని, అది రాష్ట్ర అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు.

# బీజేపీకి స్నేహహస్తం?

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం నుంచి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు పొందాలని జగన్ భావిస్తున్నారన్నది వారి తాజా అంచనా. రాజ్యసభలో తమ సంఖ్యాబలం ఆరుకు పెరుగుతుందని, వీరంతా బీజేపీకి అండగా నిలబడతారని, అవసరమైతే కొత్తగా వచ్చి చేరే నాలుగులో కమలనాథుల కోసం ఒకటి, రెండు సీట్లు త్యాగం చేయడానికైనా సిద్ధమేనని ఆయన ప్రతిపాదించినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే రాజ్యసభ సీట్ల కోసం మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ అయిన కొద్దిసేపటికే జగన్‌తో హోం మంత్రి అమిత్ షా చర్చలు జరపడం గమనార్హం. అయితే రాజ్యసభలో బలం పెంచుకునేందుకు వైసీపీ సహకారం తీసుకోవడం రాజకీయంగా తమకు ప్రయోజనం చేకూరుస్తుందా, లేదా అనే విషయమై పార్టీ అధిష్ఠానం ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఖాళీ అయ్యే 51 సీట్లలో బీజేపీ, కాంగ్రెస్‌కే ఎక్కువ సీట్లు వచ్చినప్పటికీ ఈ పార్టీల సంఖ్యాబలం పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి 18 సీట్లు ఖాళీ అవుతుండగా, ఆ పార్టీ నుంచి 13 మంది మాత్రమే మళ్లీ ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ సభ్యులు 11 మంది రిటైర్ అవుతుండగా, తిరిగి 10 మందే ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుంచి అయిదుగురు, వైసీపీ నుంచి నలుగురు, బిజూ జనతాదళ్, టీఆర్ఎస్, ఆర్‌జేడీ, జేడీ(యూ), ఎన్‌సీపీల నుంచి ఇద్దరు చొప్పున, శివసేన, డీఎంకే, జేఎంఎంల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎన్నిక కానున్నారు. కాగా, సీబీఐ కోర్టులో తనపై పెరుగుతున్న ఒత్తిడి నుంచి వెసులుబాటు కల్పించడం, రాష్ట్రంలో తాను తీసుకున్న మండలి రద్దు, హైకోర్టు తరలింపు నిర్ణయాలకు వేగవంతంగా ఆమోద ముద్ర వేయడం వంటివాటితో పాటు ఆర్థిక చేయూత కోసం కేంద్రానికి జగన్ స్నేహహస్తం చాపారని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అందులో భాగంగానే రాజ్యసభలో పెరగనున్న తమ బలాన్ని ఫణంగా పెట్టేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నాయి. అయితే ఈ విషయంలో అధిష్ఠానం ఆచితూచి స్పందిస్తుందని, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. బిజూ జనతాదళ్ తమకు కేంద్రంలో అండగా ఉన్నా కూడా ఒడిశాలో తాము రాజకీయంగా బలోపేతమయ్యే ప్రయత్నాలు మానుకోలేదని వివరించారు. ఇదే వైఖరి వైసీపీ విషయంలో కూడా అనుసరించే అవకాశాలు లేకపోలేదన్నారు.

తమ అవసరాల రీత్యా ప్రాంతీయ పార్టీలు స్నేహహస్తం చాపడం సహజమేనని, వాటిని ఎంత మేరకు అనుమతించాలన్న విషయంలో మోదీ, షా తగిన నిర్ణయం తీసుకుంటారని స్పష్టంచేశారు. అలవికాని కోర్కెలను అంగీకరించే అవకాశాలు ఎంతమాత్రం లేవన్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాల ప్రకారం రూ.55,549 కోట్లు కేంద్రం విడుదల చేసే అవకాశాలు లేవన్నారు. కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన మొత్తానికే కట్టుబడి ఉంటామని, ముంపు ప్రాంతాల్లో పునరావాస చర్యలకు నిధులు మంజూరు చేయడం కష్టమని అభిప్రాయపడ్డారు. మండలి రద్దు, హైకోర్టు తరలింపుపై వేగవంతమైన నిర్ణయాలు కూడా సాధ్యం కాకపోవచ్చని వివరించారు.

## జాబితాలో ఎవరెవరు?

- ఏప్రిల్‌లో కేంద్ర మంత్రివర్గ విస్తరణ?

కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఆలోచనను ప్రధాని మోదీ ఏప్రిల్‌కు మార్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొత్త రాజ్యసభ సభ్యులు ఎన్నికైన తర్వాతే మంత్రివర్గంలో మార్పులు చేపట్టాలని ఆయన భావిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. షాంఘాయ్‌లో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.వి.కామత్, సీనియర్ జర్నలిస్టు స్వపన్ దాస్ గుప్తాలను మంత్రివర్గంలోకి తీసుకుంటారని ఊహాగానాలు వెలువడ్డాయి. స్వపన్‌దాస్ గుప్తా ఇప్పటికే రాజ్యసభలో నామినేటెడ్ సభ్యుడు కాగా, కామత్‌కు ఎక్కడి నుంచి రాజ్యసభ సీటు ఇస్తారన్న విషయం చర్చనీయాంశమైంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో బీజేపీ సీట్ల సంఖ్య తగ్గిపోతున్న రీత్యా అక్కడనుంచి రిటైరవుతున్న వారిలో ముఖ్యులను ఇంకెక్కడినుంచైనా సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీకి చెందిన కేంద్ర మంత్రి రాందాస్ అథావలే, మాజీ మంత్రి విజయ్ గోయల్, సీనియర్ ఎంపీ సీపీ ఠాకూర్, మాజీ మంత్రి దిలీప్‌సింగ్ జుదేవ్ బంధువు రణవిజయ్ సింగ్ జుదేవ్ తదితరులను తిరిగి రాజ్యసభకు ఎలా ఎన్నుకోవాలన్న విషయంపై బీజేపీ తర్జనభర్జన పడుతోంది. మంత్రివర్గానికి కొత్త రూపురేఖలు తెచ్చేందుకు వివిధ రంగాలకు చెందిన మరి కొందరు ప్రముఖులను రాజ్యసభ ద్వారా ఎన్నుకోవాలని కూడా మోదీ భావిస్తున్నట్లు తెలిసింది. దీనిపై మరో రెండు వారాలకు గానీ స్పష్టత రాదని భావిస్తున్నారు. గతంలో ఏపీ నుంచి నిర్మలా సీతారామన్ రాజ్యసభకు ఎన్నికవగా, ఆమె పదవీకాలం పూర్తయిన తర్వాత బీజేపీ రెండోసారి కర్ణాటక నుంచి సీటు ఇచ్చింది. 2016లో ఏపీ నుంచి బీజేపీ అభ్యర్థి సురేశ్ ప్రభును రాజ్యసభకు ఎన్నుకున్నారు. అయితే నాడు ఎన్డీఏలో టీడీపీ భాగస్వామి కావడంతో బీజేపీ తన అభ్యర్థులకు రాష్ట్రం నుంచి సీట్లు ఇప్పించుకోగలిగింది. ఇప్పుడు ఎన్డీఏలో భాగస్వామి కాకపోయినప్పటికీ రాజ్యసభ సీట్ల ద్వారా జగన్ బీజేపీని మచ్చిక చేసుకోవాలనుకుంటుండటం కొంత భిన్నమైన రాజకీయ వాతావరణానికి తెరతీసిందన్నది రాజకీయ విశ్లేషకుల మాట!

## బాలకృష్ణ సతీమణి సంతకం ఫోర్జరీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, ఏపీలోని హిందూపూరం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర సంతకం ఫోర్జరీ చేసిన బ్యాంకు ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వసుంధరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బంజారాహిల్స్ బ్రాంచిలో ఖాతా ఉంది. ఆమె ఇటీవల మొబైల్ యాప్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు బ్యాంకు అధికారులకు సమాచారం అందింది. దీన్ని ధ్రువీకరించుకునేందుకు బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్లు ఫణీంద్ర, శ్రీనివాస్ శనివారం ఆమెకు ఫోన్ చేశారు. తాను యాప్ కోసం ఎలాంటి దరఖాస్తు చేయలేదని ఆమె సమాధానం ఇవ్వడంతో.. దరఖాస్తు ఫారాలపై సంతకం చేసిందెవరనే కోణంలో వారు విచారణ జరిపారు. బ్యాంకులో కొత్తగా చేరిన అకౌంటెంట్ కొర్రి శివ ఈ పని చేసినట్టు నిర్ధారించారు. అతడే వసుంధర సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. విషయాన్ని ఆమెకు చెప్పడంతో.. వసుంధర తరఫున ఆర్థిక లావాదేవీలు చూసే వెలగల సుబ్బారావు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## రైతన్నకు 2 వేల కోట్లు బాకీ

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముకుంటే ఇన్నాళ్లు ఆగాల్సిన పరిస్థితి ఉండేది కాదని వాపోతున్నారు. డబ్బు చేతికొస్తే రెండో పంటకు పెట్టుబడులకు ఉపయోగపడతాయని రైతులు ఆశిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 1710 కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరిగింది. గత మూడు నెలల్లో 3,97,189 మంది రైతుల నుంచి 40,80,579 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సేకరించింది. ఈ మొత్తానికి రూ.7,421.32 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.5,381.20 కోట్లు జమ చేసింది. ఇంకా రూ.2,044.12 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో తూర్పు గోదావరి జిల్లా రైతులకు అత్యధికంగా రూ.573 కోట్లు చెల్లించాల్సి ఉంది. విజయనగరం జిల్లా రైతులకూ రూ.433 కోట్లు దాకా ఇవ్వాల్సి ఉంది. శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల రైతులకు పెద్ద మొత్తంలో చెల్లింపులు జరగాల్సి ఉంది. నిధుల కొరత వల్లే చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని పౌరసరఫరాల శాఖ సిబ్బంది చెబుతున్నారు.

**జిల్లాల వారీగా రైతులకు చెల్లించాల్సిన సొమ్ము (రూ.కోట్లలో)**

| | |
|---|---|
| శ్రీకాకుళం | 430.94 |
| విజయనగరం | 433.19 |
| విశాఖపట్నం | 10.75 |
| తూర్పుగోదావరి | 573.08 |
| పశ్చిమగోదావరి | 160.87 |
| కృష్ణా | 333.42 |
| గుంటూరు | 73.68 |
| ప్రకాశం | 13.22 |
| నెల్లూరు | 1.09 |
| చిత్తూరు | 4.76 |
| కడప | 5.12 |

## మైనారిటీలకు వైసీపీని దూరం చేసే కుట్ర: బొత్స



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఎన్డీఏతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ టీడీపీ ప్రచారం చేసిందని, దీనివల్ల వైసీపీ నుంచి ముస్లిం మైనారిటీలను దూరం చేయాలని కుట్ర పన్నిందని పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీతో కలుస్తామని తాను విశాఖ మీడియా సమావేశంలో చెప్పలేదన్నారు. మేము బీజేపీతో కలుస్తామన్నట్లుగా బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి చెప్పడం... వైసీపీతో కలిస్తే తాము బయటకు వెళ్లిపోతామని దానికి వెనుకాల తోక (పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి) చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. పవన్ ఎందుకు ఢిల్లీ వెళ్లారని ఈ సందర్భంగా బొత్స సందేహం వ్యక్తం చేశారు. ఇదంతా ప్రజల్లో అయోమయం సృష్టించేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైసీపీ డ్రామా పటాపంచలు

- ఐటీ శాఖ పంచనామానే నిదర్శనం
- జగన్ క్షమాపణ చెప్పాలి.. ట్విట్టర్‌లో టీడీపీ నేతల ఫైర్



అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాజీ పీఎస్ శ్రీనివాసరావు ఇంట్లో దాడుల్లో దొరికింది రూ.2వేల కోట్లు కాదని, రూ.2.63 లక్షలేనని ఐటీ శాఖ అధికారులు విడుదల చేసిన పంచనామా ప్రతులను ఇదిగో సాక్ష్యం అంటూ పలువురు టీడీపీ నేతలు ఆదివారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'పంచనామా పత్రాలతో రూ.2వేల కోట్లు అంటూ వైసీపీ నేతలు ఆడిన డ్రామాలు పటాపంచలయ్యాయి. ఉన్నది రూ.2.63లక్షలే. 12తులాల బంగారం. అంత సొమ్ము మా కొద్దు అని తిరిగి ఇచ్చేశారు కూడా! అయినా వాళ్లకి సిగ్గు లేదు' అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. అవినీతిలో కూరుకుపోయిన వాళ్లకి అందరూ అవినీతిపరుల్లానే కన్పిస్తారనేది రుజువైందని మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప వ్యాఖ్యానించారు. అందరూ దొంగలే.. అవినీతిపరులే అని చెప్పబోయి వైసీపీ నాయకులు బొక్కబోర్లా పడ్డారని ఎమ్మెల్సీ కేతఃఈ ప్రభాకర్ పేర్కొన్నారు. పంచనామాలో రూ.2,63,000 అని అక్షరాలా రాసి ఉంది. మరి వైసీపీ వాళ్లు చెప్పిన రూ.2వేల కోట్లు ఎక్కడ? అని మాగంటి రూప ప్రశ్నించారు. ఐటీ పంచనామా నివేదిక వైసీపీ మీడియాకు దిమ్మదిరిగే షాక్ అని బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఐటీ దాడులపై వక్రభాష్యాలు పలికిన వైసీపీ నేతల తరుపున జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. వైసీపీ వాళ్లు చెబుతున్నట్టు నిజంగా అంత డబ్బు పట్టుబడి ఉంటే శ్రీనివాసరావును ప్రభుత్వం అరెస్టు చేయకుండా ఉండేదా? అని గోనుగుంట్ల కోటేశ్వరరావు వ్యాఖ్యానించారు. వైసీపీ అవినీతి రొచ్చు టీడీపీ మీద వేద్దామనుకునే వారికి చివరికి మిగిలేది శ్రీకృష్ణ జన్మస్థానమే అని అచ్చెన్నాయుడు ట్వీట్ చేశారు. చంద్రబాబుకి అవినీతి మరకలు అంటించడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, వైసీపీకి ఉన్న క్రెడిబులిటీ బట్టబయలైందని బొండా ఉమా విజయవాడలో అన్నారు.

### జగన్ రాక్షస పాలనకు పరాకాష్ట! అనిత

బీసీలకు అన్యాయం జరుగుతోందని గళం విప్పినందుకు పులివెందుల టీడీపీ కార్యకర్త విజయ్‌ని అరెస్టు చేయడం జగన్ రాక్షస పాలనకు పరాకాష్ట అని తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత ఆదివారం ట్వీట్ చేశారు. ఈ అక్రమ అరెస్టుతో బీసీలపై జగన్‌కున్న ప్రేమేంటో అర్థమౌతోందన్నారు.

### అబద్ధాలు, అసత్యాలకు వారిదే పేటెంట్: నిమ్మల

పాలకొల్లు టౌన్: అబద్ధాలు, అసత్యాలకూ పేటెంట్ హక్కులు వైసీపీ నాయకులవేనని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఏటా ఆస్తులను ప్రకటిస్తున్నారని, జగన్ ఒక్క ఏడాది కూడా ప్రకటించలేదని, ఇందుకు జగన్‌కు దమ్ములేదని వ్యాఖ్యానించారు.

### వైసీపీ నేతలపై లీగల్ చర్యలు: యనమల

టీడీపీ అధినేత చంద్రబాబు మాజీ పీఎస్ శ్రీనివాస్‌పై జరిగిన ఐటీ దాడి విషయంలో టీడీపీపై దుష్ప్రచారం చేసిన వైసీపీ నేతలు, వారి మీడియాపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు ప్రకటించారు. చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేసినందుకు వైసీపీ నేతలు, వారి మీడియాపై పరువు నష్టం దావా వేస్తామన్నారు. జగన్ మీడియాపై ప్రెస్ కౌన్సిల్‌కు, ఎడిటర్స్ గిల్డ్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వారిని వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీ దాడుల్లో రూ.2.63లక్షలు దొరికితే, రూ.2వేల కోట్లని దుష్ప్రచారం చేస్తారా? ఐటీ పంచనామా రిపోర్ట్‌పై వైసీపీ నేతలు ఏం జవాబిస్తారు? చంద్రబాబును అరెస్టు చేయాలన్న వాళ్లు ఇప్పుడేం మాట్లాడతారు? వాళ్ల నోళ్లు ఇప్పుడెందుకు మూతపడ్డాయి? అని ప్రశ్నించారు. పంచనామా రిపోర్టు చూశాకైనా వైసీపీ బుద్ధి తెచ్చుకోవాలి. తప్పుడు ప్రచారం చేసినందుకు వైసీపీ నేతలు, జగన్ మీడియా తక్షణం చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### వైసీపీతో రాష్ట్రానికి నష్టం.. బుచ్చిరాంప్రసాద్

ఐటీ దాడులతో ఎన్నారైలు, పెట్టుబడిదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని టీడీపీ ఎన్నారై విభాగం చైర్మన్ కే బుచ్చిరాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ఐటీ దాడులపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం వైసీపీ నేతల బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రావడానికి జంకుతున్నారన్నారు.

### పంచనామా నివేదికతో వైసీపీ కుదేలు: ఉమా

విజయవాడ విద్యాధరపురం: ఐటీ అధికారుల పంచనామా నివేదికతో వైసీపీ కుదేలైందని, ప్రస్తుతం వైసీపీ నేతలు ముఖం చాటేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడ ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి బొత్స సత్యనారాయణ అవసరమైతే ఎన్డీయేలో చేరుతామని లీకులు ఇచ్చారని, గతంలో ఏడారి అని.. మునిగిపోతుందని.. లీకులు ఇచ్చి అమరావతిని చంపారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆటలో బొత్స అరటిపండులా ఉన్నారని, ఒక సీనియర్ మంత్రిగా ఆయనకిదేం ఖర్మ అని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డికి విశాఖపట్నంలోని జ్ఞానానంద ఆశ్రమంపై కన్ను పడిందని, 300 కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పేటీఎం నేతలు ఐటీ దాడులను చంద్రబాబు నాయుడుకు అంటగట్టి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మాజీ విప్ కూన రవికుమార్ అన్నారు. వైసీపీ నేతలు మెడలు వంచుతామని చెప్పి ఢిల్లీ వెళ్లి బీజేపీ నేతల కాళ్లు మొక్కుతున్నారని వ్యాఖ్యానించారు.



## ఓణీ వేడుకలో 'జై అమరావతి'

విజయవాడ(మొగల్రాజపురం): ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీశ్రేష్టకు విజయవాడ సిద్ధార్థ పాలిక్లీనిక్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం ఓణీల వేడుక నిర్వహించారు. హాజరైన అతిథులు జై అమరావతి ప్లకార్డులను ప్రదర్శించారు.


ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన మందడం రైతులు, మహిళలు

## అమరావతి ఉద్యమానికి సహకారం!

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం

తాడికొండ, ఫిబ్రవరి 16: ప్రభుత్వం రైతులను నట్టేట్లో ముంచిపోవటం కరెక్టు కాదని, రాజధాని అమరావతి రైతుల ఉద్యమానికి తమ సహకారం ఉంటుందని తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అయితే, తమది పక్క రాష్ట్రం అయినందున.. అమరావతికి దీర్ఘకాలికంగా లాభించే విధంగా మా ట్లాడాల్సి ఉందన్నారు. అప్పుడే.. రాజధానిలో రైతులు చేస్తున్న పోరాటాలకు ఫలితం ఉంటుందని చెప్పా రు. ఓ వివాహ వేడుక కోసం ఆదివారం తెనాలి వెళ్తున్న ప్రొఫెసర్ కోదండరాంను రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ఓ హోటల్‌లో కలిసి తమ గోడు వెళ్ల బోసుకున్నారు. అమరావతి ఉద్యమానికి తెలంగాణ ప్రజల మద్దతు ఉండేలా చూడాలని కోరగా, కోదండరాం పైవిధంగా స్పందించారు. పిల్లల భవిష్యత్తు బాగుంటుందనే రాజధానికి భూములు ఇచ్చామని, అయితే, వ్యక్తి మీద ఉన్న కోపాన్ని వ్యవస్థ మీద చూపుతూ తమ బతుకుల్ని అగాధంలోకి నెడుతున్నారని వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆక్రోశం వెళ్లగక్కారు. 61 రోజుల నుంచి నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదని, 40 మందికి పైగా రైతులు, రైతుల కూలీలు చనిపోయినా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

## 'మూడు'తో ఏపీ విధ్వంసం

- రాష్ట్ర అభివృద్ధి ముసుగులో కేసుల మాఫీ కోసమే జగన్ ఢిల్లీకి
- రాజ్యాంగానికి వ్యతిరేక బిల్లులు తెచ్చిన
- మోదీ, షాలే దేశద్రోహులు : నారాయణ



జడ్చర్ల, ఫిబ్రవరి 16: మూడు ముక్కల రాజధాని పేరుతో ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసానికి పాల్పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నాశనం చేయడానికి, రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వింత ప్రవర్తనతో వింత కోతిలాగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం నిర్వహించిన లౌకికవాదుల మహాగర్జన సభలో నారాయణ ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధి ముసుగులో తనపై ఉన్న కేసుల మాఫీ కోసమే ఢిల్లీ పెద్దలను జగన్ కలుసుకుంటున్నాడని ఆయన విమర్శించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ పథకానికి 30శాతం నిధులు తగ్గించిందని, సాల్వెన్సీస్ సర్టిఫికెట్‌లతో పారిశ్రామికవేత్తలు తీసుకున్న రుణాలను ఎగ్గొట్టేందుకు అనుకూలంగా ఉగ్ర ఆర్థిక బడ్జెట్‌ను తీసుకొచ్చిందని ఆరోపించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీ చట్టాలను తీసుకొస్తున్న నరేంద్ర మోదీ, అమిత్‌షాలే దేశద్రోహులని నారాయణ అన్నారు.

## బీజేపీకి అత్యంత విశ్వాస మిత్రపక్షం వైసీపీ

- మండలి రద్దు రాష్ట్ర ప్రయోజనమా? : శైలజానాథ్



విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వైసీపీ అతి విశ్వాసమైన మిత్రపక్షమని పీసీసీ చీఫ్ సాకే శైలజనాథ్ అన్నారు. వైసీపీ నేతలు సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లపై ఢిల్లీలో ఒకమాట, అమరావతిలో మరో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రయోజనాలు' ప్రతి ఒక్కరికీ ఒక వాడుకపదంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లోగడ చంద్రబాబు ఈవిధంగా 'రాష్ట్ర ప్రయోజనా'లను ఉపయోగించుకుని ఏమీ సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. శాసనమండలిని రద్దు చేయాలని ఢిల్లీ పెద్దలను కోరడం రాష్ట్ర ప్రయోజనమా అని సీఎం జగన్‌ను నిలదీశారు. ఒకపక్క బీజేపీ ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమని చెబుతున్నా వాళ్ల కాళ్లు పట్టుకోవడానికి గల కారణం ఏమిటని అడిగారు. రాజధాని అమరావతిపై బీజేపీ నేతలు నచ్చినట్లుగా ప్రకటన చేస్తూ నాటకాలు ఆడుతున్నారని శైలజానాథ్ విమర్శించారు.



షిర్డీలోనూ జై అమరావతి ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న మహిళలు


రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

# అమరావతితోనే మా భవిత!

**61వ రోజూ అదే హోరు.. కొనసాగిన నిరసన దీక్షలు, ధర్నాలు**

- ఉస్మానియా విద్యార్థుల సంఘీభావం
- అజ్మీర్ వెళ్లి ముస్లింల ప్రార్థనలు
- శబరిమలైకి రాజధాని యువకులు
- కూకట్‌పల్లిలోనూ మద్దతు సమావేశం
- రేపు జాతీయ రైతు నాయకుల రాక

గుంటూరు, తుళ్లూరు, హైదరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'మా లక్ష్యం అమరావతి.. రాజధానిగా అమరావతి కొనసాగింపుతోనే మాకు న్యాయం' అని ఆ ప్రాంత రైతులు స్పష్టం చేశారు. నవ్యాంధ్ర రాజధాని తరలింపును నిరసిస్తూ రైతులు, రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు, ధర్నాలను 61వ రోజైన ఆదివారం కొనసాగించారు. మదడం, తుళ్లూరు, తాడికొండ అడ్డరోడ్డు, కృష్ణాయపాలెం, వెలగపూడి, రాయపూడి, యర్రబాలెం, పెదపరిమి తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వెలగపూడి, మందడంలో అసైన్డ్ రైతులు, దళిత కూలీలు, మహిళలు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు నలుగురు సంఘీభావం తెలిపారు. తాడికొండ, పొన్నెకల్లు, నిడుముక్కల తదితర ప్రాంతాల మహిళలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు వాహనదారులకు గులాబీలు ఇచ్చి అమరావతికి మద్దతు కూడగట్టారు. మందడంలో దీక్షలకు మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఎన్జీవోలు, ఆర్టీసీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రేడ్ యూనియన్లు, లాయర్ల సంఘాలతో మాట్లాడి ఉద్యమంలోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వాసులు వసంతనగర్ కాలనీలో సమావేశాన్ని నిర్వహించి అమరావతి రైతులకు మద్దతు తెలిపారు. హాజరైన జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌తోపాటు నిర్వాహకులు హరీశ్ రమేశ్‌లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. దీంతో మద్దతుదారులు నినాదాలతో హోరెత్తించారు.

### ఉచిత వైద్య శిబిరం

రాజధాని రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు డాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో మందడంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 530 మంది రైతులు, మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, కంటి, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, బీపీ, షుగర్, గైనిక్ తదితర సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తాడికొండ, పొనెకల్లు, నిడముక్కల తదితర ప్రాంతాల మహిళలు వాహనదారులకు గులాబీలు ఇచ్చి రాజధానికి మద్దతు కూడగట్టారు. తాడేపల్లి మండలం పెనుమాకలో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. నరసరావుపేట జేఏసీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో 250 కేజీల బియ్యాన్ని రైతుల దీక్షకు విరాళంగా అందజేశారు. తాడికొండ అడ్డరోడ్డులో దీక్షలు 44వ రోజుకు చేరుకున్నాయి. రైతులకు మద్దతు తెలిపిన చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాజధాని తరలింపు అసాధ్యమన్నారు. ఎవరూ అధైర్య పడొద్దన్నారు. యర్రబాలెంలో రైతులు చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉయ్యూరు విశ్వశాంతి సంస్థల అధినేత మాదాల సుబ్రహ్మణ్యేశ్వరరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి రూ.20వేలు, కురగల్లుకు చెందిన మల్లాపురపు పానకాలు, నటరాజు, ఉమామహేశ్వరరావు రూ.6వేలు విరాళంగా అందజేశారు. నరసరావుపేట రైతులు 8 క్వింటాళ్లు, చిన్న ఓగిరాల రైతు పాలడుగు సుబ్బారావు క్వింటా బియ్యం అందజేశారు. దీక్షా శిబిరాన్ని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు. రూ.10వేల నగదు, క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. మంగళగిరి పాతబస్టాండు సెంటరులో చిన్నారులు రిలే దీక్షల్లో పాల్గొని నిరసన తెలిపారు. 30 మంది చిన్నారులు దీక్షలు వహించారు. మంగళగిరికి చెందిన 20మంది యువకులు శబరిమలై యాత్రకు బయల్దేరి వెళ్లారు. మార్గ మధ్యంలోని చెన్నై రైల్వేస్టేషన్‌లో అమరావతిపై ప్లకార్డులు ప్రదర్శించారు.

### అదరగొట్టిన ధూం..ధాం..

తుళ్లూరులో నిర్వహించిన అమరావతి ధూం ధాం కార్యక్రమం అదరగొట్టింది. రాజధాని రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జానపద గేయాలు, నృత్య ప్రదర్శన ద్వారా రాజధాని రైతులకు జరుగుతున్న అన్యాయం వివరించడం అందరినీ కట్టిపడేసింది. 29 గ్రామల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది రైతులు, కూలీలు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాది మంది చేతులు పైకెత్తి 'జై అమరావతి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## సీఎం మనసు మార్చాలని ప్రార్థన

సీఎం మనసు మార్చుకొని ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించేలా చూడాలని తుళ్లూరు, రాయపూడి మైనార్టీ రైతులు కుటుంబాలతో కలిసి రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. మూడు రాజధానులు వద్దు, అమరావతే ముద్దు అంటూ అక్కడ ప్లకార్డులు ప్రదర్శించారు. అన్నదానం చేశారు. రాజధాని రైతుల త్యాగాన్ని అవహేళన చేయడం దుర్మార్గమని అమరావతి రాజధాని రైతు, వ్యవసాయ కూలీల ఐక్య పోరాట వేదిక నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తుళ్లూరు దీక్షా శిబిరంలో వారు ప్రసంగించారు. రైతుల పోరాటానికి మద్దతుగా జాతీయ నాయకుల బృందంతో మంగళవారం రాజధాని ప్రాంతంలో పర్యటించబోతున్నట్లు వెల్లడించారు. ఎంపీ కేకే రాగేష్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆలిండియా కిసాన్ సభ సహాయ కార్యదర్శులు రావుల వెంకయ్య, వి.విజూకృష్ణన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. యర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడం, రాయపూడి, తుళ్లూరు వరకు పర్యటన కొనసాగుతుందని తెలిపారు.


మందడంలో శిబిరంలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు


మందడం దీక్ష శిబిరంలో మహిళల నినాదాలు


కృష్ణాయపాలెంలో 61గంటల నిరశన దీక్ష చేస్తున్న యువకులు



యర్రబాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు, రైతులు

# మా ఇంటి సంగతేంటి?

- ఉన్నది పోయింది... కొత్తది రద్దయింది
- ఇప్పుడు స్థలాలతో పాటే కొత్త ఇళ్లు
- సొంత స్థలం ఉన్న వారికి కష్టమే?
- 4.37 లక్షల మంది పేదల ఆవేదన

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పక్కా ఇల్లు మంజూరు చేసిందని ఉన్న పూరిల్లు కూల్చేశారు. సర్కారు రాయితీతో పక్కా ఇల్లు నిర్మించుకుందామని సిద్ధమయ్యే సమయానికి... గతంలో మంజూరు చేసినవి చెల్లవంటూ వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో ఉన్న పూరిల్లు పోయి, కొత్త ఇల్లు కట్టుకోలేక వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్న వీరు... పక్కా ఇంటి కల కలగానే మిగిలిపోతుందా అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో మంజూరు చేయకుండా ఉంటే అద్దె భారం లేకుండా ఉన్న గుడిసెలోనే కాలం గడిపేవాళ్లమని, ఇప్పుడు అటూ ఇటూ కాకుండా పోయామని ఆందోళన చెందుతున్నారు. పక్కా ఇల్లు రాకపోగా ఇప్పుడు అదనంగా అద్దె భారం మోస్తున్న వారు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4.37 లక్షల మంది ఉన్నారు. వీరంతా పక్కా ఇళ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

### స్థలాలకే తొలి ప్రాధాన్యం

వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేవలం స్థలం ఇవ్వడమే కాకుండా దాంటోపాటు వారికి పక్కా ఇంటిని మంజూరు చేయనున్నారు. ఇంటికి ఇచ్చే రాయితీ నగదు, ఇంటి స్థలం విలువను కలిపి మొత్తం రాయితీగా చూపించనున్నారు. 25లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు. అలాగే ఐదేళ్లలో 25 లక్షల మందికి పక్కా ఇళ్లు నిర్మించనున్నట్లు వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. అంటే స్థలాలు ఇచ్చే 25లక్షల మందికే ఇళ్లు మంజూరుచేస్తారనే విషయం స్పష్టమవుతోంది. కానీ సొంత స్థలాలు ఉండి, పక్కా ఇంటికి అర్హత ఉన్నవారి పరిస్థితి ఏంటనేది ఇప్పుడు తలెత్తుతోన్న ప్రశ్న. ఒకవేళ వీరికి ఇవ్వాలన్నా ప్రభుత్వం పెట్టుకున్న తొలి ప్రాధాన్యం 25 లక్షలు కట్టాకగానీ వీరికి ఇచ్చే పరిస్థితి లేదు. అవి కట్టాలంటే వైసీపీ పదవీకాలం దాదాపు ముగింపుకొస్తుంది. అంటే అప్పటివరకూ ఇక తమకు ఇళ్లు లేనట్టేనా? సొంత స్థలం ఉండటమే తమ తప్పా? అని పేదలు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ప్రభుత్వం రద్దు చేసిన 4.37లక్షల మంది కాక ఇంకా చాలా మంది సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకోవాలని ఆశించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యాలు చూస్తే ఇక వీరికి ఇప్పట్లో ఇల్లు లేనట్టేనని అర్థమవుతోంది.

### బిల్లులూ లేవు

కాగా ప్రస్తుతం పురోగతిలో ఉన్న ఇళ్ల బిల్లులు విడుదల చేయడమూ గగనంగా మారింది. గత ప్రభుత్వంలోనే ఎన్నికల కోడ్ మొదలైన తర్వాత ఏప్రిల్ నుంచి ఇళ్ల బిల్లులు నిలిపివేశారు. ఇక అప్పటినుంచి ఇప్పటివరకూ 10 నెలలైనా పక్కా ఇళ్ల లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దాదాపు రూ.1100 కోట్లకు పైగా బిల్లులు పేరుకుపోయాయి. కొత్త ప్రభుత్వం అయినా బిల్లులు మంజూరు చేస్తుందని లబ్ధిదారులు ఆశించగా పది నెలలు అవుతున్నా వాటి గురించి పట్టించుకోవడం లేదు. దాదాపు 2లక్షల మందికిపైగా లబ్ధిదారులకు బిల్లులు రావాలి. వారిలో కొందరు అప్పులుచేసి నిర్మాణాలు పూర్తిచేసుకోగా, అనేక మంది మధ్యలో నిర్మాణాలు ఆపేసి ప్రభుత్వం ఇచ్చే రాయితీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలే పట్టణాల్లో నిర్మించుకునే ఇళ్లకు సంబంధించిన బీఎల్‌సీ పథకంలోని ఇళ్ల రాయితీల విడుదలకు గృహనిర్మాణ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కానీ పెద్దఎత్తున నిర్మించుకుంటున్న గ్రామీణ ఇళ్ల గురించి మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

# వేతన చిక్కుల్లో కాంట్రాక్ట్ జేఎల్స్

**4 నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు.. 'నాన్ శాంక్షన్' పోస్టులంటూ మెలిక**

- ఆర్థికశాఖ అనుమతితోనే రెన్యువల్
- అయినా.. వేతనాలు ఆపేసి వేధింపులు
- రోడ్డున పడ్డ 395 మంది కుటుంబాలు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆర్థికశాఖ పెట్టిన మెలిక కారణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో మంజూరు కాని పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు గత 4 నెలలుగా వేతనాలు అందటం లేదు. దీంతో వారి కుటుంబాలు రోజు గడవడం కోసం కటకటలాడుతున్నాయి. ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితోనే నియమితులై ఏటా ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో బోధన చేస్తున్నా గత ఏడాది అక్టోబరు నుంచి వారికి జీతాలు నిలిపేశారు. రాష్ట్రంలో మొత్తం 421 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో 3,729 మంది జేఎల్స్(జూనియర్ లెక్చరర్స్) పనిచేస్తున్నారు. ఈ జేఎల్స్ అందరినీ రూ.37,100 కనీస వేతన స్కేలుపై 10 రోజుల విరామం(గ్రాప్)తో ఏటా ఏప్రిల్ 1 నుంచి మార్చి 21 వరకు 12 నెలల పాటు పనిచేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. 2019-20 విద్యా సంవత్సరంలోనూ మొత్తం 3,729 మంది జేఎల్స్‌ను రెన్యువల్ చేశారు. గతంలో మాదిరిగానే ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకు జీతాలు చెల్లించారు. అయితే, ఆ తర్వాత అక్టోబరు నుంచి జనవరి వరకు 395 మందికి జీతాలు నిలిపేరు. జీతాలు ఆపటమేమిటన్న ప్రశ్నకు.. ఇటీవల ఆర్థిక శాఖ పెట్టిన కొత్త మెలికే కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లో నియమితులైన జేఎల్స్‌కు మాత్రమే జీతాలు ఇవ్వాలని, మంజూరు కాని(నాన్ శాంక్షన్) పోస్టుల్లో నియమితులైన వారికి జీతాలు నిలిపివేయాలంటూ ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఇంటర్ విద్య కమిషనరేట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కమిషనరేట్ గణాంకాల ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా 3,729 మంది కాంట్రాక్టు లెక్చరర్స్ పనిచేస్తుండగా వీరిలో 395 మంది మంజూరు కాని పోస్టుల్లో ఉన్నారు. దీంతో వారికి అక్టోబరు నుంచి జీతాలు ఆపేశారు. ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇస్తే జీతాలు విడుదల చేస్తామని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు. ఇంతకీ మంజూరైన పోస్టులు, మంజూరు కాని పోస్టులు ఏమిటన్నది.. విద్యాశాఖ-ఆర్థికశాఖ అధికారులకే తెలియాలి. మంజూరు కాని పోస్టులలో ఎందుకు, ఎలా నియమించారో వాళ్లే సమాధానం చెప్పాలని పలువురు అంటున్నారు. ఆర్థికశాఖ ఇలాంటి మెలిక పెట్టినప్పుడు.. మరి తమను రెన్యువల్ ఎందుకు చేశారని లెక్చరర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్‌కు, విద్యాశాఖా మంత్రిని కలిసి విన్నవించామని, అయినా స్పందన లేదని లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బీజే గాంధీ తెలిపారు.

### 2008 నాటి నిర్ణయం

2008-2018 మధ్య కాలంలో రాష్ట్రంలో 84 కొత్త జూనియర్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం వాటి కోసం 395 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికగా మంజూరు చేసింది. కానీ.. కొత్త కాలేజీల కోసం ఒక్క రెగ్యులర్ పోస్టును కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం. కాంట్రాక్టు పోస్టుల్లో కూడా మంజూరు చేసిన పోస్టులు, మంజూరు చేయని పోస్టులు అని విభజన చేయడం ప్రభుత్వ తప్పిదమని, ఇన్నేళ్ల పాటు తమ సేవలు వినియోగించుకుని, ఇప్పుడు మంజూరు కాని పోస్టుల్లో పనిచేస్తున్నారని జీతాలు నిలిపేయడం ఎంతవరకు సమంజసమని లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే తమకు పెండింగ్ వేతాలు ఇవ్వాలని కోరుతున్నారు.

## లారీ ఢీ.. వంతెనపై నుంచి పడ్డ కారు

- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం
- పర్యవేక్షణకు వెళ్లి కానిస్టేబుల్ మృత్యువాత

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మృత్యుశకటంలా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో వంతెన మీద నుంచి వెళుతున్న కారు అదుపు తప్పి 150 అడుగుల కింద పడింది. ఈ ప్రమాదం.. కారులో ప్రయాణిస్తున్న దంపతుల్లో ఒకరిని బలిగొని, మరొకరిని చావుబతుకుల్లోకి నెడితే, పర్యవేక్షించేందుకు వెళ్లిన ఓ పోలీసు ప్రాణాలనూ బలితీసుకుంది. కరీంనగర్ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన గండి శ్రీనివాస్ (48) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయనకు భార్య స్వరూప (40), పిల్లలు స్రవంతి (16), ప్రణవి (13) ఉన్నారు. శ్రీనివాస్ దంపతులు, కొమురవెల్లికి వెళ్లి మల్లన్న దర్శనం చేసుకోవాలని సంకల్పించారు. ఆదివారం ఉదయం కారులో బయలుదేరారు. 9:20 గంటలకు మానేరు మొదటి వంతెనపైకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. అదుపుతప్పిన కారు, వంతెనపై నుంచి కింద పడింది. స్థానికులు, పోలీసులు అరగంటకుపైగా శ్రమించి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. శ్రీనివాస్ అప్పటికే మృతిచెందగా.. గాయాలైన స్వరూపను ఆస్పత్రికి తరలించారు. ప్రజలను చెదరగొట్టేప్రయత్నంలో కానిస్టేబుల్ భైరగోని చంద్రశేఖర్ (57) వంతె నపై నుంచి కాలు జారి కిందపడి మృతిచెందాడు. కాగా.. మరోఘటనలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రామకృష్ణ రాజు (28), పాలకొల్లుకు చెందిన హరిరాజు (24)తెలంగాణలోని నారాయణపేటజిల్లా కృష్ణా మండలంలో నదీ స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. బంధువులు మాధవి, మౌనిక, సుధ సెల్ఫీలు తీసుకుంటూ నీళ్లలోపడడంతో వారిని కాపాడే ప్రయత్నంలో ఈఇద్దరూ ప్రాణాలు విడిచారు.

## భారత్-పాక్ మహిళల వామప్ మ్యాచ్ రద్దు

బ్రిస్బేన్: భారత్-పాకిస్థాన్ మహిళల జట్ల మధ్య ఆదివారం జరగాల్సిన టీ20 వరల్డ్ కప్ వామప్ మ్యాచ్ వర్షంతో రద్దయింది. భారీ వర్షంతో కనీసం టాస్ వేసేందుకూ వీలుకాలేదు. దాంతో మ్యాచ్‌ను రద్దు చేస్తూ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. 18న జరిగే రెండో, చివరి వామప్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. ఇక అడిలైడ్‌లో జరిగిన వామప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఈనెల 21న ప్రపంచకప్ ప్రారంభం కానుంది.



## టైటిల్‌కు చేరువలో హంపి

**హారిక గేమ్ డ్రా ● కెయిన్స్ కప్**

**సెయింట్ లూయిస్ (యూఎస్):** తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి కెయిన్స్ కప్ చెస్ టోర్నీ టైటిల్‌కు చేరువైంది. ఎనిమిదో రౌండ్‌లో రష్యా గ్రాండ్ మాస్టర్ వాలెంటినా గునీనాపై నెగ్గిన హంపి.. మరో రౌండ్ మిగిలుండగానే మొత్తం 5.5 పాయింట్లతో సింగిల్‌గా టాప్‌లో నిలిచింది. ఆఖరి, 9వ రౌండ్‌లో మరో తెలుగు గ్రాండ్ మాస్టర్ హారికతో తలపడనున్న నేపథ్యంలో హంపి టైటిల్ చేక్కించుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తెల్లపావులతో ఆడిన హంపి 35 ఎత్తుల్లో గునీనా ఆటకట్టించింది. కాగా, ఉక్రెయిన్ గ్రాండ్ మాస్టర్ మరియా ముజిచక్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది. మొత్తం 8 రౌండ్ల నుంచి హారిక 4 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది.

# మరో రెండు డే/నైట్ టెస్టులు

**ఒకటి ఆస్ట్రేలియాలో.. మరొకటి మొతేరాలో ఇంగ్లండ్‌తో ఆడనున్న భారత్**

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత క్రికెట్ జట్టు గులాబీ టెస్టు ఆడే విషయంలో సందిగ్ధం తొలగింది. ఈ ఏడాది చివరలో అక్కడ జరిగే నాలుగు టెస్టుల్లో ఒకటి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనుంది. ఆదివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో బోర్డు అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కార్యదర్శి జై షా పాల్గొన్నారు. అలాగే వచ్చే ఏడాది ఇంగ్లండ్‌తోనూ స్వదేశంలో ఓ డే/నైట్ మ్యాచ్‌ను ఆడించాలని నిర్ణయించారు. ఇది అహ్మదాబాద్‌లో నూతనంగా నిర్మించిన మొతేరా స్టేడియంలో జరిగే అవకాశాలున్నాయి. జనవరిలో భారత్‌కు వచ్చిన క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ ఎర్ల్ ఎడింగ్స్ బోర్డు అధ్యక్షుడు గంగూలీ, షాలను కలిసి పింక్ టెస్టుల గురించి చర్చించాడు. నిజానికి వారు రెండు పింక్ టెస్టులను నిర్వహించాలని కోరినా సిరీస్‌లో జరిగే 4 టెస్టుల్లో 2 గులాబీ మ్యాచ్‌లను జరపడం సరి కాదని అప్పట్లో దాదా వ్యతిరేకత వ్యక్తం చేశాడు. 2018-19లో భారత జట్టు ఆసీస్ టూర్‌కు వెళ్లినప్పుడు కూడా డే/నైట్ ప్రస్తావన వచ్చినా అప్పట్లో బోర్డు అంగీకరించలేదు. కానీ దాదా చీఫ్ అయ్యాక పరిస్థితులు మారిపోయి టీమిండియా ఇప్పటికే బంగ్లాదేశ్‌తో ఓ పింక్ టెస్టును కూడా ఆడేసింది.



## 'కొత్త పోస్ట్.. అందంగా దోస్త్'

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ట్వీట్ చేసిన ఓ ఫన్నీ ఫొటో నెట్‌లో వైరల్‌గా మారింది. సహచరులు షమి, పృథ్వీ షాతో కోహ్లీ.. మెల్లకన్ను పెట్టి విచిత్రమైన ముఖ కవళికలతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశాడు. దీనికి 'కొత్త పోస్ట్.. అందంగా దోస్త్' అని క్యాప్షన్ పెట్టాడు. దీన్ని చూసిన ఫ్యాన్స్ ఇలాంటి విభిన్న ముఖ కవళికలతో ఉన్న తమ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.

## కపిల్‌పై 'విరుద్ధ' ఫిర్యాదు వ్యర్థం

**స్పష్టం చేసిన ఎథిక్స్ అధికారి**



**న్యూఢిల్లీ:** పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశంలో టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్‌పై నమోదైన ఫిర్యాదును విచారించాల్సిన అవసరం లేదని బీసీసీఐ ఎథిక్స్ అధికారి డీకే జైన్ స్పష్టం చేశారు. క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ), భారత క్రికెటర్ల సంఘం డైరెక్టర్‌గా కపిల్ ఏకకాలంలో భిన్న పదవులను అనుభవిస్తున్నాడని.. ఇది బోర్డు రాజ్యాంగం ఉల్లంఘన కిందకు వస్తుందనే ఫిర్యాదు అందింది. దీంతో కపిల్‌తోపాటు సీఏసీలో సభ్యులుగా ఉన్న శాంతా రంగస్వామి, అన్షుమన్ గైక్వాడ్‌లకు కూడా నోటీసులు అందాయి. ఆ తర్వాత కమిటీలోని ముగ్గురూ తమ పదవుల నుంచి తప్పుకొన్నారు. దీంతో ఫిర్యాదును వ్యర్థంగా తేల్చామని జైన్ తెలిపారు.

## 'ఒలింపిక్స్' ట్విటర్ అకౌంట్ హ్యాక్

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్ అధికారిక ట్విటర్ అకౌంట్‌తోపాటు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) మీడియా అకౌంట్‌లు హ్యాకింగ్‌కు గురయ్యాయని ట్విటర్ తెలిపింది. వీటిని తాత్కాలికంగా నిలిపివేసినట్టు ప్రకటించింది. థర్డ్ పార్టీకి చెందిన టూల్ ద్వారా సైబర్ దాడి జరిగినట్టు ట్విటర్ ప్రతినిధి తెలిపారు. త్వరలోనే వాటిని పునరుద్ధరిస్తామని చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు ఐవోసీ ప్రతినిధి కూడా పేర్కొన్నారు.

## ఐసీఏకు రూ.2 కోట్ల మంజూరు

**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) కార్యకలాపాల కోసం బీసీసీఐ 2 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆదివారం జరిగిన బోర్డు సమావేశంలో అపెక్స్ మండలి ఈ నిర్ణయం తీసుకుంది.

**న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు చక్కని మ్యాచ్ ప్రాక్టీస్ లభించినట్టయింది. మొదటి రోజు బ్యాటింగ్‌లో విఫలమైనా ఆ తర్వాత ట్రాక్‌లోకి వచ్చిన జట్టు అన్ని రంగాల్లో అదరగొట్టింది. బౌలర్లు మురిపించినట్టే ఆఖరి రోజు బ్యాట్స్‌మెన్ కూడా నిలకడ ప్రదర్శించారు. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న 'బర్త్‌డే బాయ్' మయాంక్ అగర్వాల్, రిషభ్ పంత్ పరుగుల దాహాన్ని తీర్చుకుంటూ అర్ధసెంచరీలు సాధించడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఊరటనిచ్చింది.**

# ప్రాక్టీస్ ఓకే..

- మయాంక్, పంత్ అర్ధసెంచరీలు
- భారత్-కివీస్ లెవెన్ ప్రాక్టీస్ మ్యాచ్ డ్రా

**హామిల్టన్:** న్యూజిలాండ్ లెవెన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌ను భారత్ డ్రాగా ముగించింది. ఆదివారం మూడో, చివరి రోజు ఆటలో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (81 రిటైర్డ్ అవుట్), రిషభ్ పంత్ (70) బ్యాట్లు ఝుళిపించారు. దీంతో ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో 4 వికెట్లకు 252 పరుగులు చేసింది. గత వరుస 11 ఇన్నింగ్స్‌ల్లో (లిస్ట్-ఎ, ఫస్ట్‌క్లాస్, వన్డేలు) కనీసం 40 పరుగుల మార్క్‌ను కూడా దాటని మయాంక్‌కు తాజా ఇన్నింగ్స్‌తో ఆత్మవిశ్వాసం లభించినట్టయింది. మిచెల్‌కు మూడు వికెట్లు దక్కాయి. కెప్టెన్ కోహ్లీ రెండు సెషన్లలోనూ బ్యాటింగ్‌కు దిగలేదు.

**శతక భాగస్వామ్యం**

59/0 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఆరంభంలోనే చకచకా రెండు వికెట్లను కోల్పోయింది. తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించాక పదో ఓవర్‌లో ఓపెనర్ పృథ్వీ షా (39)ను మిచెల్ బౌల్డ్ చేయగా కొద్దిసేపటికే శుభ్‌మన్ గిల్ (8)ను కూడా అతడే ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లో విఫలమైన గిల్ ఓపెనింగ్ పోటీ నుంచి తప్పుకొన్నట్టే. ఈ దశలో ఆదివారం 29వ పుట్టిన రోజు జరుపుకొన్న మయాంక్ చక్కటి ఫుట్‌వర్క్‌తో బ్యాటింగ్ కొనసాగించాడు. పేసర్ల బౌలింగ్‌లో డ్రైవ్స్, పుల్ షాట్లతో ఆకట్టుకున్నాడు. అతడికి పంత్ చక్కటి ఆటతీరుతో అండగా నిలిచారు. ఆరంభంలో పంత్ నిదానం ప్రదర్శించినా అటు మయాంక్ బౌండరీలతో చెలరేగి 56 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కాస్త కుదురుకున్నాక పంత్ కూడా తన సహజశైలిలో బ్యాట్ ఝుళిపిస్తూ సోధీ వేసిన ఇన్నింగ్స్ 27వ ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. మూడో వికెట్‌కు మయాంక్, పంత్ 100 పరుగులు జోడించారు. అయితే లంచ్ విరామం తర్వాత మయాంక్ పెవిలియన్‌కే పరిమితం కాగా సాహా బరిలోకి దిగాడు. అటు పంత్ మాత్రం తన దూకుడును కొనసాగిస్తూ రెండో సెషన్ ఆరంభ ఓవర్‌లోనే మరోసారి రెండు వరుస సిక్సర్లతో 53 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే మిచెల్ ఓవర్‌లోనే క్లీవర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివరకు రెండో సెషన్‌లో 16 ఓవర్ల ఆట తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు డ్రాగాకు అంగీకరించడంతో మ్యాచ్ ముగిసింది. సాహా (30), అశ్విన్ (16) అజేయంగా మిగిలారు.



బర్త్‌డే బాయ్ మయాంక్ అగర్వాల్‌కు సహచరుల విషెష్

**స్కోరుబోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 263**
**కివీస్ లెవెన్ తొలి ఇన్నింగ్స్: 235**

**భారత్ రెండో ఇన్నింగ్స్:** పృథ్వీ షా (బి) మిచెల్ 39; మయాంక్ (రిటైర్డ్‌అవుట్) 81; శుభ్‌మన్ గిల్ (ఎల్బీ) మిచెల్ 8; రిషభ్ పంత్ (సి) క్లీవర్ (బి) మిచెల్ 70; సాహా (నాటౌట్) 30; అశ్విన్ (నాటౌట్) 16; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం:** 48 ఓవర్లలో 252/4. **వికెట్ల పతనం:** 1-72, 2-82, 3-182, 4-216.

**బౌలింగ్:** టిక్నెర్ 3-0-19-0; కుగెలిన్ 12-0-81-0; జాన్‌స్టన్ 4-0-18-0; మిచెల్ 9-2-33-3; నీషమ్ 6-1-29-0; సోధీ 5-0-32-0; కూపర్ 3-0-27-0; బ్రూస్ 5-1-8-0; ఆలెన్ 1-1-0-0.

## గతం గురించి ఆలోచించడం లేదు

వామప్ మ్యాచ్‌లో చక్కటి ఆటతీరును ప్రదర్శించి తిరిగి ఫామ్‌లోకి రావడం సంతోషంగా ఉందని ఓపెనర్ మయాంక్ అగర్వాల్ తెలిపాడు. ఇక గతంలో ఏం జరిగిందనే విషయం గురించి ఆలోచించడం లేదన్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు అతడు వరుసగా 11 ఇన్నింగ్స్‌లో (8, 32, 29, 37, 24, 0, 0, 32, 3, 1, 1) దారుణంగా విఫలమయ్యాడు. 'ఇక్కడ ఆడడం కాస్త విభిన్నంగా ఉంది. అయితే గతంలో జరిగిన దాని గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రెండో ఇన్నింగ్స్‌లో 81 పరుగులు నాలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. ఇదే జోరును టెస్టు సిరీస్‌లోనూ ప్రదర్శిస్తాను. తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగుకే అవుటయ్యాక బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌తో చర్చించాను. నెట్స్‌లో చెమటోడ్చి ఫలితం సాధించాను' అని మయాంక్ సంతోషం వ్యక్తం చేశాడు. ఇక ఆదివారం మయాంక్ బర్త్‌డే కావడంతో మ్యాచ్ ముగిశాక జట్టు సభ్యులు కేక్ కట్ చేయించి సందడి చేశారు.

## బింద్రాకు ఐఓసీ చీఫ్ ప్రశంస

**న్యూఢిల్లీ:** శరణార్థి అథ్లెట్లు టోక్యో ఒలింపిక్స్ అర్హత సాధించేందుకు చాంపియన్ షూటర్ అభినవ్ బింద్రా చేస్తున్న కృషిని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) చీఫ్ థామస్ బాచ్ కొనియాడారు. శరణార్థి షూటర్లు ఒలింపిక్స్ క్వాలిఫై అయ్యేలా తీర్చిదిద్దేందుకు బింద్రాతో పాటు ఇటలీ షూటర్ నికోలో కాంప్రియాని 'టేకింగ్ రెఫ్యూజీ' అనే ప్రాజెక్టును నెలకొల్పారు. ఇందులో భాగంగా ఇద్దరు శరణార్థి షూటర్లు ఖౌలా, మహ్దీలకు బెంగళూరులోని తన అకాడమీలో అభినవ్ శిక్షణ ఇస్తున్నాడు. ఇందుకు బింద్రాను బాచ్ ప్రశంసిస్తూ 'ఈ ప్రాజెక్టుతో నిజమైన ఒలింపియన్లుగా నిరూపించుకున్నారు. మీ గొప్పతనానికి హ్యాట్సాఫ్' అని లేఖ రాశారు.

## శివరామకృష్ణన్ దరఖాస్తు మాయం



**న్యూఢిల్లీ:** బీసీసీఐ సెలెక్టర్ పోస్టు కోసం మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ దరఖాస్తు విషయం పలు అనుమానాలకు తావిస్తోంది. అతడి దరఖాస్తు స్పామ్ ఫోల్డర్‌లోకి చేరడం వల్ల.. గమనించలేక పోయామని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. కానీ, సెలెక్టర్ రేస్ నుంచి శివను తప్పించేందుకే ఉద్దేశ పూర్వకంగా ఇలా వ్యవహరించారని కొన్ని వర్గాలు అనుమానిస్తున్నాయి. చీఫ్ సెలెక్టర్ పదవి కోసం పోటీపడుతున్న వారిలో శివ పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే, షార్ట్ లిస్ట్‌లో అతడి పేరు లేదంటూ వార్తలు వచ్చాయి. కాగా, శివ అసలు దరఖాస్తే పంపలేదని బోర్డు వర్గాలు చెప్పడం కలకలం రేపింది. విమర్శలు రావడంతో బీసీసీఐ అధికారులు మరోసారి పరిశీలించారు. గత నెల 22న శివ పంపిన మెయిల్‌ను స్పామ్ ఫోల్డర్‌లో ఉన్నట్టు గుర్తించామని చెప్పిన అధికారులు.. బోర్డు కార్యదర్శి జై షాకు ఫార్వర్డ్ చేశారు. సెలెక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలో శివ పేరును కూడా చేర్చామని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. మీడియాలో వార్తలు రాకపోతే ఏం జరిగి ఉండేదో? అని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## కంబళ రేసర్‌కు మరికొంత గడువు



**న్యూఢిల్లీ:** కర్ణాటక ప్రాచీన సంప్రదాయ క్రీడ కంబళతో పరుగుల వీరుడుగా పుట్టుకొచ్చిన రేసర్ శ్రీనివాస్ గౌడకు ట్రయల్స్ నిర్వహించడంపై భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) ఇంకా తేదీని ఖరారు చేయాల్సి ఉంది. తొలుత ఈ సోమవారం బెంగళూరు సాయ్ కేంద్రంలో ట్రయల్స్‌కు హాజరు కావాల్సిందిగా గౌడను ఆహ్వానించిన సాయ్.. అతనికి మరో రెండ్రోజుల సమయమివ్వాలని భావిస్తోంది. ఎందుకంటే.. ట్రాక్ రేస్‌కు అనుగుణంగా అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు వీలుగా కొంత సమయమిచ్చాక ట్రయల్స్ నిర్వహించాలనుకుంటున్నట్టు సాయ్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ నెల ఆరంభంలో జరిగిన కంబళ పోటీల్లో 28 ఏళ్ల శ్రీనివాస్ గౌడ తన దున్నలతో కలిసి 145 మీటర్ల దూరాన్ని 13.62 సెకన్లలోనే పరిగెత్తి అందరినీ ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. దీంతో గౌడకు సరైన శిక్షణ ఇచ్చి ఒలింపిక్స్‌కు పంపితే పతకం తెస్తాడంటూ చాలామంది ప్రశంసించడంతో.. అతనికి ట్రయల్స్ నిర్వహించాలంటూ సాయ్ అధికారులకు క్రీడా మంత్రి కిరణ్ రిజిజు సూచించిన సంగతి తెలిసిందే.

# మోర్గాన్ మోత

- టార్గెట్-223ను ఛేదించిన ఇంగ్లండ్
- సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ కైవసం



మోర్గాన్

**సెంచూరియన్:** సౌతాఫ్రికా-ఇంగ్లండ్ సిరీస్‌లో తొలి రెండు టీ20ల మాదిరే ఆఖరి ఓవర్ వరకూ వచ్చింది కానీ.. వాటి మాదిరి ఉత్కంఠ రేపలేదు నిర్ణాయక మ్యాచ్. 24 బంతుల్లో 53 పరుగులు కావాల్సిన దశలో మోర్గాన్, స్టోక్స్ విరుచుకుపడ్డారు. కళ్లు చెదిరే షాట్లతో 17, 18, 19 ఓవర్లలో కలిపి 52 పరుగులు రాబట్టారు. ఈక్రమంలో స్టోక్స్ అవుటైనా దూకుడు ఆపని మోర్గాన్ వరుస సిక్సర్లతో సౌతాఫ్రికా బౌలర్లను బెంబేలెత్తించాడు. దాంతో ఈ పోరులో ఐదు వికెట్లతో సులువుగా గెలుపొందిన ఇంగ్లండ్ జట్టు 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగులు చేసింది. క్లాసెన్ (33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 66) హాఫ్ సెంచరీ చేశాడు. బవుమా (24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 49), డి కాక్ (24 బంతుల్లో ఫోర్, 4 సిక్సర్లతో 35), మిల్లర్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 నాటౌట్) తలో చేయి వేశారు. కర్రాన్, స్టోక్స్ చెరో రెండో వికెట్లు పడగొట్టారు. భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్ జేసన్ రాయ్ (7) వికెట్‌ను ఇంగ్లండ్ త్వరగా కోల్పోయింది. కానీ బెయిర్ స్టో (34 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64), కెప్టెన్ మోర్గాన్ (22 బంతుల్లో 7 సిక్సర్లతో 57 నాటౌట్), బట్లర్ (29 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 57) చెలరేగారు. వారికి స్టోక్స్ (12 బంతుల్లో ఫోర్, 2 సిక్సర్లతో 22) ధాటి ఇన్నింగ్స్ తోడుకావడంతో ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే ఇంగ్లండ్ 226/5 స్కోరుతో విజయాన్ని అందుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు మోర్గాన్‌కు దక్కాయి.

**సంక్షిప్తస్కోరు:**

**సౌతాఫ్రికా:** 20 ఓవర్లలో 222/6 (క్లాసెన్ 66, బవుమా 49, డి కాక్ 35, మిల్లర్ నాటౌట్ 35, కర్రాన్ 2/33, స్టోక్స్ 2/35)

**ఇంగ్లండ్:** 19.1 ఓవర్లలో 226/5 (బెయిర్ స్టో 64, మోర్గాన్ 57 నాటౌట్, బట్లర్ 57, స్టోక్స్ 22 ఎంగిడి 2/55).

## మీ నుంచి చాలా నేర్చుకున్నా



**స్వదేశంలో చివరి మ్యాచ్ సందర్భంగా పేస్**

**బెంగళూరు:** ఈ ఏడాదే తనకు కెరీర్‌లో చివరిదని ఇదివరకే ప్రకటించిన భారత టెన్నిస్ హీరో లియాండర్ పేస్.. బెంగళూరు ఓపెన్‌తో స్వదేశంలో చివరి టోర్నీ ఆడేశాడు. ఈ టోర్నీలో డబుల్స్ రన్నరప్‌గా నిలిచిన పేస్‌ను.. ఈవెంట్‌కు చివరిరోజైన ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్వేగానికి లోనైన 46 ఏళ్ల పేస్.. 'అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో కెరీర్‌లో ఉన్నతస్థాయికి ఎలా ఎదగాలో మీనుంచి నేర్చుకున్నా' అని అన్నాడు. ఈ కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు అశ్వినీ నాచప్ప, జూడ్ ఫిలిక్స్, వీఆర్ రఘునాథ్, రేష్మ, నిషా మిల్లెట్ తదితరులు పాల్గొన్నారు. ఇక.. ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్ జేమ్స్ డక్‌వర్త్ బెంగళూరు ఓపెన్ సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. సింగిల్స్ ఫైనల్లో డక్‌వర్త్ 6-4, 6-4తో బెంజమిన్ బోంజి (ఫ్రాన్స్)ను ఓడించి ట్రోఫీ అందుకున్నాడు.



విజేత డీజీ జట్టుకు ట్రోఫీ అందజేసిన డీజీపీ

## ఐపీఎస్‌లదే టీ20 ట్రోఫీ

**మూలపాడు (కొండపల్లి):** రాష్ట్రస్థాయి ఐఏఎస్-ఐపీఎస్‌ల టీ20 చాంపియన్‌షిప్‌లో ఐపీఎస్ జట్టు విజేతగా నిలిచింది. మూలపాడు ఏసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత ఐపీఎస్‌లతో కూడిన డీజీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 148 పరుగులు సాధించింది. ట్రైనీ ఐపీఎస్ కృష్ణకాంత్ అత్యధికంగా 83 రన్స్ చేశాడు. ఛేదనలో ఐఏఎస్‌లతో కూడిన సీఎస్ జట్టు 139 పరుగులకే కుప్పకూలి ఓటమిపాలైంది. డీజీపీ గౌతమ్ సవాంగ్ ముగింపు కార్యక్రమానికి అతిథిగా హాజరై ట్రోఫీ అందజేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com